టెన్త్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు (విద్య), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫీజు గడువు పొడిగించినట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా డిసెంబరు 6వ తేదీలోపు, రూ.50 అపరాధ రుసుముతో 7 నుంచి 12వ తేదీ వరకు, రూ.200 అపరాధ రుసుముతో 10వతేదీ నుంచి 11వతేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో 13 నుంచి 15వ తేదీలోపు చెల్లించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పాఠశాల లాగిన్ నుంచి మాత్రమే ఫీజులు చెల్లించాలని తెలిపారు. అలాగే పరీక్ష రాసేందుకు వయసు తక్కువ ఉన్న పిల్లలు అండర్ ఏజ్ సర్టిఫికెట్ ఫీజు రూ.300 కూడా ఆన్‌లైన్‌లో చెల్లించాల పేర్కొన్నారు.



జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిన కొవ్వూరుపల్లి పీహెచ్‌సీ

జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) పనితీరు మెరుగు పడనంటోంది. ఓ పక్క కేంద్రం నిధులు మంజూరు చేస్తున్నా.. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బందిలో మాత్రం మార్పు రానంటోంది. ఇందుకు ఉదాహరణ గత నెల అక్టోబరుకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ విడుదల చేసిన గ్రేడ్‌లే నిదర్శనం. జిల్లాలో 52 పీహెచ్‌సీలు ఉంటే ఒక్క దానికి కూడా ఏ గ్రేడ్ రాలేదు. 8 కేంద్రాలకు మాత్రమే బీ గ్రేడ్ దక్కింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే పీహెచ్‌సీలపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లే ప్రమాదం లేకపోలేదు.

పనితనంలో పతనం!

● పీహెచ్‌సీలలో సేవలపై గ్రేడ్‌ల కేటాయింపు ● ఒక్క కేంద్రానికీ దక్కని ఏ గ్రేడ్

నెల్లూరు (వైద్యం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) పనితీరుపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రతి నెల గ్రేడ్‌లను ప్రకటిస్తుంది. తాజాగా అక్టోబరు నెలకు సంబంధించి పీహెచ్‌సీల గ్రేడ్‌లను ప్రకటించింది. ఎప్పటిలాగే బీ, సీ, డీ గ్రేడ్‌లు తప్ప ఒక్క పీహెచ్‌సీకి కూడా ఏ గ్రేడ్ దక్కలేదు. ఆయా ఆసుపత్రులకు రోజు వారి ఎంతమంది అనారోగ్యంతో వస్తున్నారు. వారికి అందించే వైద్యపరీక్షలు, గర్భిణులకు అందిస్తున్న సేవలు, ప్రసవాలు వంటి వాటిని పరిశీలించి వైద్య ఆరోగ్య శాఖ పీహెచ్‌సీలకు గ్రేడ్‌లు కేటాయిస్తుంది. జిల్లాలో 52 పీహెచ్‌సీలు ఉండగా కోవూరుపల్లి, రామతీర్థం కేంద్రాలు బీ గ్రేడ్‌లతో ఒకటి, రెండు స్థానాలలో ఉన్నాయి. ఆఖరి స్థానం డీ గ్రేడ్‌లో గట్టుపల్లి, గూడ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ ప్రజలకు వైద్య సేవలు సరిగ్గా అందటం లేదన్న విషయంపై రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 23 పీహెచ్‌సీలలో అసలు ప్రసవాలే జరగలేదంటే ఆ కేంద్రాల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య శాఖలో ప్రజలకు మెరుగైన చికిత్సలు అందించాలన్న ఉద్దేశంతో జిల్లాకు రూ.25 కోట్లకుపైగా విడుదల చేస్తుంది. ఒక్కో పీహెచ్‌సీకి నిర్వహణ, అత్యవసర మందుల కోసం రూ.1.75 లక్షల వంతున విడుదల చేస్తుంది. ఇంతగా ఖర్చు చేస్తున్నా ప్రజలకు అందించే వైద్యసేవలలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు.

● ఏ గ్రేడ్ పీహెచ్‌సీలు ఏవీ!?

తాజాగా విడుదల చేసిన పీహెచ్‌సీల పనితీరులో ఒక్క పీహెచ్‌సీకి కూడా ఏ గ్రేడ్ రాలేదు. కోవూరుపల్లి పీహెచ్‌సీ రాష్ట్రస్థాయిలో 241, జిల్లాస్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. ఇక 247వ స్థానంలో రామతీర్థం పీహెచ్‌సీ జిల్లాస్థాయిలో 2వ స్థానంలో నిలిచింది. కుల్లూరు, చేజర్ల, మహ్మదాపురం, సీతారామపురం, జొన్నవాడ పీహెచ్‌సీలు తర్వాతి స్థానాలు దక్కించుకున్నాయి. మొత్తం మీద జిల్లాలోని పీహెచ్‌సీలు 55 శాతం ప్రజలకు వైద్యసేవలు అందించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడించింది.

లోపాలు సరిదిద్దుతున్నాం



పీహెచ్‌సీలలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి పెడుతున్నాం. రాష్ట్రంలోనే ఏ గ్రేడ్‌లో నిలిపేందుకు కృషి చేస్తున్నాము. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఎక్కడ లోపాలు ఉన్నాయో తెలుసుకుని వాటిని సరిదిద్దుతున్నాము. గర్భవతులకు అందించే వైద్యసేవలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ప్రతి పీహెచ్‌సీలో ప్రసవాలు చేయాలని ఆదేశాలు జారీ చేశాం. అలాగే సాధారణ వైద్య చికిత్సలకూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచిస్తున్నాము.

\- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో

పీహెచ్‌సీల సంఖ్య : 52	ఏ గ్రేడ్ : నిల్	బి గ్రేడ్ : 8	సీ గ్రేడ్ : 36	డీ గ్రేడ్ : 8	ప్రసవాలు జరగనివి : 23



పాదలకూరులో

రగ్బీ పోటీలు

13 జిల్లాల నుంచి క్రీడాకారుల రాక

క్వార్టర్ ఫైనల్స్‌కు నెల్లూరు బాలురు, బాలికల జట్లు

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

- వివరాలు 8లో..

దిత్వా.. జాగ్రత్త!

● మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం
● యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ప్రభుత్వం

నెల్లూరు (హరనాథపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న దిత్వా తుఫాన్‌పై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. రానున్న రెండు రోజులూ జిల్లావ్యాప్తంగా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సూచనలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. సముద్ర, నదీతీర ప్రాంతాల్లో ప్రజలను జాగృతి చేస్తున్నారు. అధికారులకు అత్యవసరమైతే తప్ప సెలవులు రద్దు చేశారు.

● ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు : భారీ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో సోమశిల జలాశయం నుంచి 3-4 నాలుగు లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేసే అవకాశం ఉన్నందున పెన్నా పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరు ఆర్డీవో బి పావని ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి వచ్చే అధిక నీటి ప్రవాహం వల్ల వాగులు, వంకలు, చెరువులు, నీటి కుంటలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా
बैंक ऑफ़ बड़ौदा
Bank of Baroda

రీజినల్ స్ట్రెస్డ్ అసెట్ రికవరీ బ్రాంచ్ (ROSARB)
1వ అంతస్తు, నం.10, సి.పి. రామస్వామి రోడ్, అల్వార్‌పేట, చెన్నై - 600018
ఫోన్: 044-2345 4221 / 9789974307

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 6(2) & 8 (6) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద చర మరియు స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తనఖాపెట్టబడిన / చార్జ్‌చేయబడిన, బ్యాంక్ ఆఫ్ బరోడా సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకోబడిన దిగువ వివరించబడిన స్థిరాస్తి, దిగువ తెలిపిన ఖాతా/లలోని బకాయిలను రికవరీ చేయడానికి **"ఎక్కడ ఎలా ఉన్నదో అది", "ఎలా ఉన్నది అలా" మరియు అక్కడి ఏది ఉంటే అది"** ప్రాతిపదికన విక్రయించబడునని ముఖ్యంగా రుణగ్రహీత(ల)కు, తనఖాదారు(ల)కు మరియు హామీదారు(ల)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. రుణగ్రహీత(లు) / తనఖాదారు / హామీదారు(లు) / సెక్యూర్డ్ ఆస్తి(లు) / బకాయిలు / రిజర్వు ధర / ఇ-వేలం తేది & సమయం, బయానా మరియు బిడ్ పెంపుదల మొత్తం వివరాలు దిగువ తెలియజేయబడినవి:

రుణగ్రహీత(లు) / తనఖాదారు / హామీదారు(ల) పేర్లు & చిరునామా: 1. మెసర్స్ శ్రీ వినాయక ట్రేడర్స్ ప్రొప్రైటర్: శ్రీమతి శ్వేత శిల్ప, నం.16/1, శ్రీనివాస నగర్, 1వ మెయిన్ రోడ్, కొలాతూర్, చెన్నై - 600099 మరియు **2. శ్రీమతి శ్వేత శిల్ప బి భర్త ఉమాశేఖర్,** నం.337ఎ, 2వ మెయిన్ రోడ్, బాబానగర్, విల్లివక్కం, చెన్నై - 600049; **3. శ్రీమతి శ్వేత శిల్ప** , సర్వే నం.559/ భాగం, నెల్లూరు బిట్ 2 ఏరియా, ప్లాట్ నం.1 (దక్షిణం వైపు), డోర్ నం.27-2-1137, (ప్రస్తుత డోర్ నం.27-10-739, వార్డు నం.27-2, మోడ్రన్ స్కూల్ సమీపాన, సరస్వతి నగర్, ఎస్‌పిఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా - 524002

మొత్తం బకాయిలు: 24.11.2025 నాటికి రూ.50,60,067.54 ప్లస్ 25.11.2025 నుండి దానిపై తదుపరి వడ్డీ మరియు ఇతర చట్టబద్ధమైన చార్జీలు — సాంకేతిక స్వాధీనం

స్థిరాస్తి పూర్తి వివరాలు మరియు తాకట్టు రుణభారాల వివరాలు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా (ఎస్‌పిఎస్‌ఆర్), స్టోన్‌హౌస్ పేట, సబ్-రిజిస్ట్రేషన్, నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని నెల్లూరు సిటీ, నెల్లూరు బిట్ 2 ఏరియా, సర్వే నం.559/భాగం, సరస్వతి నగర్, మునిసిపల్ వార్డు నం.27/3, ప్లాట్ నం.1 (దక్షిణం భాగం), డోర్ నం.1137 (ప్రస్తుత డోర్ నం.27-10-739), అసెస్‌మెంట్ నం.1031055535, ఆర్‌సీసీ భవనం సైట్ సరిహద్దులు: తూర్పు: లేఅవుట్ రోడ్, దక్షిణం: కాలువ, పశ్చిమం: రామచంద్రయ్య యొక్క ప్రహరీగోడ, ఉత్తరం: సూరం సుశీలమ్మ ఇంటి ప్లాట్ నం.1 మిగతా సైట్. ఈ సరిహద్దులలో 15 అంకణముల 48 చ.అ. లేదా 125.33 చ.గజాల విస్తీర్ణ సైట్, ఇందులో గ్రౌండ్‌ఫ్లోర్ ఆర్‌సీసీ 720 చ.అడుగులు మరియు మొదటి అంతస్తు 720 చ.అడుగులు, హెచ్‌ఎస్‌సి నం.046603 అన్ని అనుభోగ హక్కులతో, డాక్యుమెంట్ నంబర్ 748/2019 తేది 18.02.2019 ప్రకారం సెటిల్‌మెంట్ డీడ్‌లో, డాక్యుమెంట్ నంబర్ 2452/2019 తేది 29.05.2019 ప్రకారం మెమొరాండం ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్‌లో మరియు డాక్యుమెంట్ నంబర్ 7153/2021 తేది 08.10.2021 ప్రకారం ఎక్స్‌టెన్షన్ ఆఫ్ మెమొరాండం ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్‌లో మరింత వివరముగా వివరించబడినది.

రిజర్వు ధర : రూ. 57,40,000/- | బయానా మొత్తం : రూ. 5,74,000/- | బిడ్ పెంపుదల మొత్తం: రూ. 25,000/-

ఆస్తి తనిఖీ తేది & సమయం : 10.12.2025 ఉ.11:00 గం. నుండి మ.03:00 గం.

ఇ-వేలం తేది & సమయం : 17.12.2025 మ.02:00 గం. నుండి సా.06:00 గం.

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు రిఫర్ చేయండి/ దర్శించండి వెబ్‌సైట్ లింక్: **https://www.bankofbaroda.in/e-auction.htm** మరియు ఆన్‌లైన్ ఆక్షన్ పోర్టల్ **https://baanknet.com** మరియు భావి కొనుగోలుదారు బిడ్డర్లు అధీకృత అధికారిని టెలిఫోన్ నం.044-23454221 / 9789974307లో సంప్రదించంగలరు.

ప్రదేశం: చెన్నై, తేది: 25.11.2025 — అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా



జంతుగణనపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న రేంజ్ అధికారి కుమారరాజా

1 నుంచి 'వెలుగొండ'లో జంతుగణన

ఉదయగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఉదయగిరి రేంజ్ పరిధిలో విస్తరించి ఉన్న వెలుగొండ అడవిలో వచ్చేనెల 1 నుంచి 8వ తేదీ వరకు జంతు గణన చేపట్టనున్నట్లు రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా పేర్కొన్నారు. శుక్రవారం అటవీ శాఖ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించి జంతుగణనలో చేపట్టాల్సిన విధివిధినాలు వివరించారు. ప్రతి నాలుగేళ్లకోసారి జంతుగణన చేపట్టడం ఆనవాయితీగా చెప్పుకొచ్చారు. జంతుగణనలో భాగంగా ప్రతి బీట్ అటవీ ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల పరిధిలో నడుచుకుంటూ మాంసాహార, శాఖాహార జంతువుల పాదముద్రలు, పెంటికలు గుర్తించాలని సూచించారు. పక్కాగా జంతుగణన చేపట్టి గుర్తించిన అంశాలను యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వోలు ప్రసాద్, మురళి, ఎఫ్‌ఎస్‌వోలు చినవెంకటయ్య, శ్రీరాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోమశిలకు పెరిగిన ఇన్‌ఫ్లో

30 వేల క్యూసెక్కుల నీరు విడుదల

అనంతసాగరం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద అనూహ్యంగా పెరిగింది. గురువారం 7,287 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా శుక్రవారం నాటికి 10,218 క్యూసెక్కులకు పెరిగింది. ఈ ప్రవాహం ఇంకా పెరగవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే, డ్యాం నుంచి 30 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. తుపాన్ ప్రభావంతో ముందస్తుగా ఎక్కువ మోతాదులో నీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం జలాశయంలో 72.682 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఉత్తర కాలువకు 400, కండలేరుకు 2,200 క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు.

● **రాపూరు :** కండలేరు డ్యాం నీటి సామర్థ్యం 68టీఎంసీలు కాగా ప్రస్తుతం 57.93 టీఎంసీల నీరు ఉన్నట్లు ఏఈ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 1900 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే, 1080 క్యూసెక్కుల దిగువకు వెళుతోందని ఆయన తెలిపారు.

జిల్లాకు 57,100 కేజీల

జింకు కేటాయింపు

● 17,950 కేజీల స్ప్రే జింకు కూడా..
● డీఏఓ సత్యవాణి వెల్లడి

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జింకు లోపం ఉన్న భూములను సరిచేసేందుకు జిల్లాకు 57,100 కేజీల 21శాతం ముడి జింకును ప్రభుత్వం కేటాయించినట్లు జిల్లా వ్యవసాయాధికారి పి.సత్యవాణి తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'సూక్ష్మపోషకాలు అందేనా!?' కథనంపై ఆమె స్పందించి ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 1,142 ప్రదర్శనా క్షేత్రాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామని, ఈ ఏడాది 32వేల మట్టి పరీక్షలు చేశామన్నారు. గతేడాది పరీక్షలను బట్టి జిల్లా అవసరాలను గుర్తించి ప్రభుత్వానికి నివేదికలు పంపినట్లు తెలిపారు. ఈ క్రమంలో జిల్లాకు 57100 కేజీల 21శాతం ముడి జింకుతోపాటు 17,950 కేజీల 12శాతం స్ప్రే జింకును కూడా జిల్లాకు కేటాయించారని అన్నారు. ప్రస్తుతం ఏయే మండలాల్లో అవసరమో గుర్తించి ముడి జింకును సరఫరా చేస్తున్నామన్నారు. హెక్టారుకు 50 కేజీల ముడి జింకుతోపాటు జీవన ఎరువులు అందిస్తున్నామని, వీటి విలువ సుమారు రూ.5వేల వరకు ఉంటుందన్నారు. నూర ఎశాతం సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. అదేవిధంగా హెక్టారుకు 250 గ్రాముల 12శాతం స్ప్రే జింకు కూడా ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అదేవిధంగా హెక్టారుకు 250గ్రాముల 12శాతం స్ప్రే జింకు కూడా ఇవ్వనున్నట్లు చెప్పారు. అత్యధికంగా 58 ప్రదర్శన క్షేత్రాలను అల్లూరులో నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లెక్క.. పక్కా! 8

● పంచాయతీల్లో పన్నుల వసూలుకు యాప్

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయం, ప్లాట్ నెం.1, ప్రశాంతి నగర్, పాదలకూర్ రోడ్, నెల్లూరు క్లబ్ దగ్గర, నెల్లూరు - 524003, ఫోన్ నెం. 0861-2329730

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారి ప్రకటన నెం.S.O.1533(E) తేది:14 సెప్టెంబర్, 2006 మరియు దాని తదుపరి సవరణలో పేర్కొన్న విధముగా మెస్సర్స్ రామ్కీ బయో ప్రైవేట్ లిమిటెడ్ వారు రూ. 356 కోట్ల పెట్టుబడితో ఇఫ్కో కిసాన్‌సెజ్, రేగడి చెలిక గ్రామ పంచాయతీ, రాచర్లపాడు గ్రామం, కొడవలూరు మండలం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లాలోని ప్లాట్ నెం. 564-1B, 564-1C, 564-1D & 564-1E వద్ద 29 ఎకరాల స్థలములో 370 KLD ఇథనాల్ (ధాన్యం ఆధారిత డిస్టిల్లరీ) పరిశ్రమ మరియు 7.25 MW క్యాప్టివ్ పవర్ ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనకు సంబంధించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరపబడును అని ఇందుమూలముగా తెలియజేయడమైనది. ఈ ప్రతిపాదిత ప్రాజెక్ట్ యొక్క వివరములు దిగువ పేర్కొనబడినవి.

1	కంపెనీ పేరు చిరునామాతో	మెస్సర్స్ రామ్కీ బయో ప్రైవేట్ లిమిటెడ్,2వ అంతస్తు, వంశీరామ్ జ్యోతి గెలాక్సీ, కావూరి హిల్స్,జూబ్లీ హిల్స్, హైదరాబాద్, తెలంగాణ - 500 033.
2	ప్రతిపాదిత ప్రాజెక్ట్ ప్రదేశం సర్వేనెం.	ప్లాట్ నెం. ప్లాట్ నెం. 564-1B, 564-1C, 564-1D & 564-1E ఇఫ్కో కిసాన్ సెజ్, రేగడి చెలిక గ్రామ పంచాయతీ, రాచర్లపాడు గ్రామం, కొడవలూరు మండలం, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా
3	భూమి విస్తీర్ణం	29 ఎకరాలు
4	సంప్రదించవలసిన అధికారిక వ్యక్తి పేరు చిరునామా & ఫోన్ నెం.	కె. సందీప్ కుమార్, డైరెక్టర్ 2వ అంతస్తు, వంశీరామ్ జ్యోతి గెలాక్సీ, కావూరి హిల్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్, తెలంగాణ - 500 033 ఫోన్ నెం. 8885605498
5	ప్రాజెక్ట్ వ్యయం	రూ.356 కోట్లు
6	కార్యకలాప వివరములు మరియు సామర్థ్యం	370 KLD ఇథనాల్ (ధాన్యం ఆధారిత డిస్టిల్లరీ) పరిశ్రమ మరియు 7.25 MW క్యాప్టివ్ పవర్ ప్లాంట్
7	బహిరంగ విచారణ తేది/ ప్రదేశం /సమయం	తేది :30.12.2025 సమయం: మధ్యాహ్నం 12.00గంటలకు ప్రదేశం: ఇఫ్కో కిసాన్ సెజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ దగ్గర, రాచర్లపాడు గ్రామం, కొడవలూరు మండలం, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా
8	ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక మరియు సంక్షిప్త సారాంశ నివేదికలు ప్రజల పరిశీలనార్థం ఈ క్రింద పేర్కొనబడిన కార్యాలయంలో అందుబాటులో ఉంచడమైనది	
i.	కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయం, నెల్లూరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా	
ii.	చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారి కార్యాలయం, జిల్లా పరిషత్, నెల్లూరు	
iii.	రెవిన్యూ డివిజినల్ ఆఫీసర్ వారి కార్యాలయం, నెల్లూరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా	
iv.	జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల కేంద్రం, ఎ. కె నగర్, నెల్లూరు	
v.	ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పర్యావరణం, అటవీ, సైన్స్ & టెక్నాలజీ శాఖ, ఆంధ్రప్రదేశ్, సెక్రటేరియట్ కాంప్లెక్స్, బిల్డింగ్ నెం.4 గ్రౌండ్ ఫ్లోర్, వెలగపూడి, గుంటూరు జిల్లా.	
vi.	జాయింట్ డైరెక్టర్ (ఎస్) వారి కార్యాలయం, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, ఇంటిగ్రేటెడ్ ప్రాంతీయ కార్యాలయం, విజయవాడ గ్రీన్ హౌస్ కాంప్లెక్స్ విజయవాడ -520010	
vii.	మెంబర్ సెక్రటరీ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ్ భవన్, APIIC కాలనీ రోడ్, గురునానక్ కాలనీ, ఆటోనగర్, విజయవాడ -520 007	
viii.	జాయింట్ చీఫ్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జోనల్ ఆఫీస్, 3వ అంతస్తు, పర్యావరణ్ భవన్, N.T.రోడ్, తిరుపతి-517501	
ix.	ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, ప్లాట్ నెం.1, ప్రశాంతి నగర్, పాదలకూర్ రోడ్, నెల్లూరు క్లబ్ దగ్గర, నెల్లూరు -524003	
x.	తహసిల్దార్ వారి కార్యాలయం, కొడవలూరు, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా	
xi.	మండల ప్రజా పరిషత్ అభివృద్ధి ఆఫీసర్ వారి కార్యాలయం, కొడవలూరు మండలం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా	
xii.	పంచాయితీ సెక్రటరీ వారి కార్యాలయం, రేగడిచెలిక మరియు రాచర్లపాడు గ్రామాలు, కొడవలూరు మండలం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా	

కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారి మరియు దాని తదుపరి సవరణలో పేర్కొనబడిన విదంగా ఈ ప్రతిపాదిత కార్యకలాపాలవలన స్థానభ్రంశం చెందువారు, పర్యావరణ పరంగా ఇబ్బందులు ఎదుర్కొనువారు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు లేక అభ్యంతరములు ఈ ప్రకటన వెలువడిన 30 రోజుల లోపు లిఖిత పూర్వకముగా క్రింద సంతకందారునకు తెలియపరచమని కోరడమైనది మరియు పైన పేర్కొనబడిన వేదిక, తేది, సమయము నందు జరుగు ప్రజాభిప్రాయ సేకరణలో స్వయంగా పాల్గొని తమ అభిప్రాయములను తెలియచేయవచ్చును.

ప్రదేశం: నెల్లూరు
తేది : 28.11.2025

సం// ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, నెల్లూరు

గంజాయి బ్యాచ్ ఘాతుకం!

నెల్లూరు శివార్లలో యువకుడి హత్య ● వేటకొడవళ్లతో నరికి చంపిన దుండగులు ● ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు

గంజాయి బ్యాచ్ బరితెగిస్తోంది. నిన్నటిదాకా బెదిరించి నగదు, నగలు లాక్కోవడం, దాడులు చేయడం వంటి ఘటనలే జరుగుతుండేవి. తాజాగా మనుషుల ప్రాణాలు తీసే స్థాయికి తెగబడ్డారు. నెల్లూరు రూరల్ మండలం కల్లూరిపల్లిలో గురువారం సాయంత్రం ఓ యువకుడిని అత్యంత కిరాతకంగా వేటకొడవళ్లతో నరికి చంపేశారు. ఈ ఘాతుకంలో గంజాయి సరఫరాకు డాన్‌గా వ్యవహరిస్తున్న ఓ మహిళ ప్రమేయం ఉన్నట్లు స్థానికులు, పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు..



మృతుడు పెంచలయ్య (ఫైల్)

నెల్లూరురూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కల్లూరిపల్లి వద్దనున్న ఆర్డీటీ (రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) కాలనీలో ఉంటున్న కొట్టావిట్టం పెంచలయ్య (35) చిరు వ్యాపారాలు చేస్తుంటాడు. సీపీఎంలో చురుకైన కార్యకర్త కూడా. ఈ క్రమంలో తమ ప్రాంతం గంజాయి సరఫరాకు ముద్రపడటంతో దానిని తొలగించుకోవాలని, ఎవరూ అలాంటి కార్యకలాపాలకు పాల్పడకూడదని స్థానికులు కొందరు గ్రూపుగా ఏర్పడి తీర్మానం చేసుకున్నారు. ఇందులో పెంచలయ్య కీలక పాత్ర పోషిస్తున్నాడు. కాగా, ఆ ప్రాంతంలో గంజాయి విక్రయాల్లో డాన్‌గా, నేర చరిత్ర కలిగిన వారికి ఆశ్రయం ఇస్తున్న ఆరవ కామాక్షితో పెంచలయ్య బృందానికి విభేదాలు ఏర్పడ్డాయి. కాగ నెల్లూరులోని నవాబుపేట పోలీసు స్టేషన్‌లో కామాక్షిపై గంజాయి కేసులు ఉన్నట్లు సమాచారం.



రక్తపు మడుగులో ఉన్న కత్తి

● కన్నకొడుకు కళ్లముందే..

శుక్రవారం సాయంత్రం పెంచలయ్య తన కొడుకు నిఖిలి (10)ని స్కూలు నుంచి తీసుకుని ఇంటికి బయలుదేరాడు. కల్లూరిపల్లిలోని పాత ఇనుప సామాన్ల దుకాణం వద్దకు రాగానే వెనుక నుంచి మూడు స్కూటర్లలో వచ్చిన 9 మంది గుర్తుతెలియని వ్యక్తులు పెంచలయ్యను ఢీకొట్టారు. దీంతో కింద పడిపోయిన ఆయన్ను వేటకొడవళ్లతో అత్యంత కిరాతకంగా నరికి చంపేశారు. అంతా అయ్యాక అక్కడ నుంచి పరారయ్యారు. కళ్లెదుటే కన్నతండ్రిని చంపడం చూసి నిఖిలి భీతిల్లిపోయాడు. చుట్టుపక్కల వాళ్లు గమనించి పెంచలయ్యను ఆటోలో తీసుకుని జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

● మహిళా డాన్ తమ్ముడే!

పెంచలయ్యను అత్యంత కిరాతకంగా హతమార్చిన ఘటనలో కామాక్షి తమ్ముడు ఉన్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. హత్య జరిగిన సమయంలో సమీప ప్రాంతాల సీసీ టీవీ ఫుటేజీలను పోలీసులు సమగ్రంగా పరిశీలించగా ఆమె తమ్ముడితోపాటు స్కూటర్‌ను గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో భాగస్వాములైన వారంతా 20 ఏళ్ల వయసున్న యువకులుగా తేలినట్లు సమాచారం.



మృతుడి స్కూటర్ ఇదే!

● ఆ సమావేశమే హత్యకు పునాది

ఇటీవల పెంచలయ్య, మరి కొందరు గంజాయి వాడకం వద్దంటూ నెల్లూరు రూరల్ పోలీసులతో కలిసి ఓ సమావేశాన్ని ఆర్డీటీ కాలనీలో ఏర్పాటు చేశారు. గంజాయి వాడేవాళ్లు తమ ప్రాంతం నుంచి వెళ్లిపోవాలని, లేకపోతే తామే పోలీసులకు పట్టిస్తామని హెచ్చరికలు జారీ చేయడంతో పెంచలయ్య ఉంటే తమ కార్యకలాపాలకు అడ్డమని నిర్ణయించుకున్న ఆరవ కామాక్షి అతడ్ని హత్య చేయాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. అప్పటి నుంచే పెంచలయ్యపె రెక్కీ నిర్వహిస్తున్న

- మిగతా 6వ పేజీలో..

నేడు పొదలకూరులో క్రీడా పోటీలు

పొదలకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం మేరా యువ భారత్ ఆధ్వర్యంలో బ్లాక్ లెవల్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్న జిల్లా యూత్ ఆఫీసర్ మహేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్, 100 మీటర్ల పరుగు పందెం, ఖోఖో, షాట్‌పుట్ పోటీలు నిర్వహిస్తామని, 15 నుంచి 29 సంవత్సరాల వయ సున్నవారు పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. ట్రీస్ ఎన్జీవో సహకారంతో ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12128
వెండి కిలో ధర	రూ. 169000
వెండి ఒక గ్రాము	రూ. 174.00

వైభవంగా సామూహిక కుంకుమార్చన


కొలువుదీరిన కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లి కార్జున స్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం కామాక్షితాయికి భక్తులతో అత్యంత వైభవంగా అర్చకులు సామూహిక కుంకు మార్చన నిర్వహించారు. అనంతరం అమ్మ వారి ఉత్సవ మూర్తిని పల్లకిలో కొలువుదీర్చి ఆలయం చుట్టూ పల్లకి సేవలు నిర్వహిం చారు. ఆలయంలో గంగా, కామాక్షి సమేత మల్లికార్జునస్వామికి శాస్త్రోక్తంగా నిర్వ హించి న నిత్య కళ్యాణోత్సవం భక్తులను అల రించిం ది. ఆలయ చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి, ఈఓ శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.

మల్లమ్మగుంటలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం


కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్, వలంటీర్లు

రాపూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాపూ రు ఎన్ఎస్ఎస్ యూనిట్ నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో మల్లమ్మగుంటలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముళ్ల చెట్లను విద్యార్థులు తొలగించారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్, రామాలయం, అంగన్‌వాడీ పరిస రాల్లో పిచ్చిచెట్లను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ క్రిష్ణవేణి, ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం అధికారి జి.సాయికిరణ్, అధ్యాపకులు సరిత, సుధాకర్, గౌస్, పెంచలయ్య, క్రిష్ణ, రమాదేవి, పర్వీన్, రామలింగయ్య, కాలేషా, వాలంటీర్లు, తదిత రులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు అందజేస్తున్న ఎస్ఐ

మనుబోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే 136వ వర్ధంతిని స్థానిక పద్మావతి కల్యాణ మండపంలో శుక్ర వారం బీసీ కులాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఐక్యవేదిక నాయకులు నివా ళులు అర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఎస్ఐ శివరాకేష్ చేతుల మీదుగా 200 మంది పేదలకు దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెనుబాక మహేష్, చెల్లగిరి ప్రసాద్, శివుడు రాజాగౌడ్, కన్నా సుబ్బయ్య, రవీంద్రబాబు, శంకరయ్య ఆచారి, కేవీఆర్ గౌడ్, సురేష్ గౌడ్, చిట్టిబాబు, యనమల అంకయ్య, చేవూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్లపల్లిలో వైద్య శిబిరం

పొదలకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పార్లపల్లిలో ఎన్ఎస్ఎస్ స్పెష ల్ క్యాంపులో భాగంగా నాలుగో రోజైన శుక్ర వారం స్థానిక సీహెచ్ డాక్టర్ వినీల ఆధ్వ ర్యంలో గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వ హించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నా హీద్, ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, సర్పంచ్ గూడూరు ప్రసన్న, స్థానిక నాయకులు రాజ శేఖర్‌రెడ్డి, చెన్నకృష్ణయ్య, గ్రామస్తులు, తదిత రులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలి

కొడవలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కొత్త వంగల్లు గ్రామంలో శుక్రవారం వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధు లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు చికిత్స నిర్వహించారు. రోగులకు పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం నమోదు

ఏఎస్ పేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ ఆత్మకూరు డివిజన్ ప్రెసిడెంట్ బి శైలజ ఆధ్వర్యంలో శుక్రవారం ఏఎస్ పేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిం చారు. ఈసందర్భంగా తహసీల్దారు అనిల్ కుమార్, డిప్యూటీ తహసీల్దారు వెంకటే శ్వర్లు, ఎంపీడీవో ప్రసన్నకుమారి, ఏవో రేణుక కార్యాలయ సిబ్బంది. పీహెచ్‌సీ అధి కారులు, సభ్యత్వం నమోదు చేశారు.

ఎవరడిగారు.. ఎందుకిచ్చారు!?

- తిరుపతి జిల్లాలో విలీనంపై మండలవాసుల ఆగ్రహం..
- నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని డిమాండ్

రాపూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల పునర్వి భజనలో భాగంగా రాపూరు మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మం డలవాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అసలు ఎవరు అడిగారు? ఎందుకిచ్చారు? అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రు. వైసీపీ ప్రభుత్వంలో పునర్విభజన చేసినప్పుడు రాపూ రు మండలాన్ని తిరుపతి జిల్లాలో కలిపినప్పుడు స్థాని కులు, రాజకీయ నాయకులతో కలిసి నిరసన ఉద్యమాలు చేసి, అప్పటి శాసనసభ్యుడు ఆనం రామనారాయణరెడ్డి ద్వారా ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఇక్కడి ప్రాంత స్థితిగతులు, సమస్యలు, కండలేరు నీటి జలాల విషయా లలో కూలంకుషంగా నివేదిక అందజేయడంతో అప్పటి ప్రభుత్వం విలీన ప్రక్రియ ఆపి నెల్లూరు జిల్లాలోనే కొనసా గించింది. ఇప్పుడు పరిస్థితి భిన్నంగా కనిపిస్తుంది. ఎన్నికల హామీలో కానీ, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కానీ ఎవ్వరూ రాపూరు మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేయాలని అడిగిన దాఖలాలు లేవు. కానీ పునర్విభజనలో భాగంగా నెల్లూరుజిల్లాలో రాపూరు మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేయాలని ప్రతిపాదించడం, ఆమోదిం చడం చక చకా జరిగిపోయాయి. దీని వెనుక ఉన్న మత లబు ఏంట నేది ఎవరికి అంతుబట్టడం లేదు. వైసీపీ ప్రభు త్వంలో జరగాల్సిన విలీనాన్ని ఆపి నెల్లూరు జిల్లాలోనే కొన సాగిం చుకున్నామన్న ఆనందం కూటమి ప్రభుత్వం వచ్చిన పద్దె నిమిది నెలల్లోనే ఆవిరైపోయిందని ప్రజలు వాపోతు న్నారు. అసలు ఈ విలీనం వలన ఎవరికి మేలు చేకూరు తుందని గుసుగుసలాడుకుంటున్నారు. 2022లో వైసీపీ ప్ర భుత్వం ప్రతిపాదించిన పునర్విభజన విషయంలో మండల వాసులో రోడ్ల మీదకు వచ్చి నిరసన కార్యక్రమాలు చేపట్ట డంతో వీరికి రాజకీయ మద్దతు తెలి పారు. ప్రస్తుతం మూడు రో జుల క్రితం రాపూరు మండ లాన్ని తిరుపతిలో విలీ నం చేస్తున్నామని చె ప్పినా, రాజకీయ నా యకులు ప్రస్తుతం ఎందుకు పెదవి విరచడం లేదని వాపోతు న్నారు. ఒక వేల నాయకులు ప్రశ్నించని పక్షంలో సామా న్యులే సైతం రోడ్ల మీద కొచ్చి నిరసన కార్యక్ర మాలు చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది.



● కండలేరు జల సమస్యలు మొదలయ్యేనా...?

ఉమ్మడి నెల్లూరుజిల్లా రాపూరు మండలంలో ఉన్న కండలేరు జలాశయం నీరు విడుదల విషయంలో ఏమైనా సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని కొంతమంది నిపుణు లు భావిస్తున్నారు. ఎటువంటి విధానపరమైన నిర్ణయాలు లేకుండా విలీనం చేయడం వల్ల భవిష్యత్తులో నీటి పంప కాలు విషయంలో రెండుజిల్లాల వారికి సమ స్యలు తలెత్తే అవకాశముంది. దీనిపై సమగ్రమైన నిర్ణ యాలు తీసువా లని భావిస్తున్నారు. అలాగే కండలేరు కింద 21 పంచాయతీ జనాభా భూములు ఇవ్వగా, వారికి రా వాల్సిన పరిహారం, ఉద్యోగాలు ఇంకా కూడా కోర్టులో ఉన్నా యి. విలీనం తర్వాత వీటి విషయంపై ఇబ్బందులు ఎదు ర్కోవాల్సి ఉంటుందని కండలేరు నిర్వాసితులు వాపోతు న్నారు. వీటికి సంబంధించిన తెలుగుగంగ కార్యాలయం, అధికారులు ప్రస్తుతం నెల్లూరులో ఉండగా, తిరుపతిలో కలిపితే ఎదురయ్యే సమస్యలపై దిగులు చెందుతున్నారు.

● పెంచలకోన ప్రభావం తగ్గేనా...?

నెల్లూరుజిల్లా వారు గర్వంగా చెప్పుకునే నారసింహుని క్షేత్రం పెంచలకోన బాలాజీజిల్లాకు మారడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్షేత్రాన్ని అనేక మంది మా జిల్లాలో ఉందని గొప్పగా చెప్పుకునే వారు ఇప్పుడు రాపూ రు మండల విలీనం తర్వాత తిరుపతి జిల్లాలో కలిస్తే నెల్లూరు జిల్లా నుంచి విడిపోతుందని ఆవే దన వ్యక్తం చేస్తున్నారు. సేవ్ పెంచ లకోన, సేవ్ రాపూరు అని సోషల్ మీడియాలో ట్రెండింగ్ చేస్తున్నారు. అలాగే ఆ దేవదేవుని వెంకటేశ్వరుని ముందు పెంచలకోన వైభవం తగ్గుతుందే మోనని భావిస్తున్నారు. విలీన ప్రతిపాదన లపై ఏమైనా అభ్యంతరాలుంటే 30 రోజుల్లో తమ అభిప్రాయాలు, సమ స్యలు ప్రభుత్వానికి తెలియజేయాలని తెలుపగా, కొంత మంది స్థానికులు రాపూరు మండలాన్ని నెల్లూరు జిల్లా లోనే కొనసాగించా లని డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం గ్రీవె న్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయ నున్నట్లు తెలు స్తోంది. దీనిపై నాయకులు మద్దతు ఇవ్వా లని స్థానికులు కోరుతున్నారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు: ఎస్ఐ కోటిరెడ్డి

కొడవలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కోటిరెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కొడవ లూరులో వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో శుక్ర వారం ర్యాగింగ్ మీద అవగాహన సదస్సు నిర్వహించారు. కొడవలూరు ఎస్ఐ కోటిరెడ్డి మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ర్యాగింగ్‌కు పాల్పడి తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థినుల పట్ల గౌరవంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డాక్టర్ పి. గుణ శేఖర్ మాట్లాడుతూ విద్యా సంస్థలలో ర్యాగిం గ్ చర్యల ద్వారా విద్యార్థుల భవిష్యత్తు ప్రమా దంలో పడుతుందన్నారు. సీనియర్ల ముసు గులో జూనియర్ విద్యార్థులను ఇబ్బందిపెడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. విద్యా ర్థులు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం

- రాష్ట్ర పౌర సరఫరాల డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి


మాట్లాడుతున్న పట్టాభిరామిరెడ్డి

కొడవలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర పౌర సరఫరాల డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి పేర్కొన్నారు. గండవరం గ్రామంలో రైతుల తో ఆయన సమావేశం నిర్వహించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 'అన్నదాత సుఖీభవ' పథకం కింద రాష్ట్రప్రభుత్వం రూ.14 వేలు, పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు ఇచ్చి రైతులను ఆదుకుంటున్నాయని తెలిపారు. సబ్సిడీపై రుణాలు కూడా అందిస్తున్నారన్నారు. పంటలకు మద్దతు ధర కల్పించి ఆదుకున్నారని తెలిపారు. గత వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటు పడిందన్నారు. నేడు కూటమి ప్రభుత్వం పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగ సమస్యను పరిష్క రించారన్నారు. కార్యక్రమలోట టీడీపీ నాయకుడు ఆలం మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చి తాలూకా ఏపీ ఎన్జీఓ ఎన్నికలు ఏకగ్రీవం



ఎన్జీవో అసోసియేషన్ బుచ్చిరెడ్డిపాళెం తాలూకా కమిటీ

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవోస్ అసోసియే షన్ బుచ్చిరెడ్డిపాళెం తాలూకా ఎన్నికలు ఏక గ్రీవం అయ్యాయి. బుచ్చి రెడ్డిపాళెం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవ రణలో శుక్రవారం నామినేషన్ ప్రక్రి యలో బాగంగా 11 పోస్టులకుగాను ఒక్కో పోస్టుకు ఒ క్కొక్కరు వంతున 11 మంది మాత్రమే నామి నేషన్లు వేయడంతో ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి షేక్ రియాజ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్ని కల అధికారిగా కే.సురేష్, ఎన్నికల పరిశీలకులుగా ఏపీ. కృష్ణమో హన్ వ్యవహరించారు.

● బుచ్చి తాలూకాకు నూతన కార్యవర్గం ఎంపిక

బుచ్చిరెడ్డిపాళెం తాలూకా ఏపీ ఎన్జీఓస్ అధ్యక్షులుగా షేక్. బషీర్, సహ అధ్యక్షులుగా బి. రామా రావు, ఉపాధ్యక్షులుగా వివి. శవప్రసాద్, పి. రాధా లక్ష్మి, జి. ప్రవీణ్‌కుమార్‌లు ఎంపికయ్యారు. కార్యదర్శిగా కే. రమణయ్య, సంయుక్త కార్యదర్శులుగా ఎ. మంజులవాణి, డి. కామేశ్వరమ్మ, బి. శ్రీని వాసులురెడ్డి, మహిళా సంయుక్త కార్యదర్శిగా ఎస్. రాజేశ్వరమ్మ, కోశాధికారిగా పి. శ్రీనివాసులు, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం చేత ఎన్నికల అధికారులు ప్రమాణస్వీ కారం చేయించి అభినందనలు తెలియజేశారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం


పాల్గొన్న వైద్య బృందం

తోటపల్లిగూడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం టీపీ గూ డూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠ శాలలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి గ్రామ స్తులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వ హించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయు లు వీఎస్ కృష్ణప్రసాద్, ఎన్ఎస్ఎస్ కార్య క్రమాధికారిణి పీఎస్ విజయమ్మ, ఉపాధ్యాయులు బాపనయ్య, నిరంజన్‌రావు, బాలాజీ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చండి


ప్రమాదకరంగా మారిన మురుగు కాలువ

కోవూరు, నవంబరు 28, (ఆంధ్రజ్యోతి): స్థానిక టీఎన్‌సీ కళాశాల సమీపంలోని ప్రధాన రోడ్డు పక్కన ఏర్పడిన గుంతలను పూడ్చాలని స్థానికు లు కోరుతున్నారు. టీ ఎన్‌సీ కళాశాల నుంచి మహాలక్ష్మి గుడి వీధికి వెళ్ళే దారిలో పెద్ద పెద్ద గుంతలు పడ్డాయని, ఇటీవల ఇక్కడ ద్విచక్రవా హనదారులు ప్రమాదాలకు గురయ్యారన్నారు. పక్కనే ఉన్న మురుగుకాలువల్లో ఇటీవల విద్యార్థులు పడిన ఘట నలున్నాయని, కాలువపై కూడా సిమెంటు బండలు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

మలిదేవి కాలువ తాత్కాలిక బ్రిడ్జి పనుల ప్రారంభం


కాలువలో వేస్తున్న సిమెంటు తూములు

బుచ్చిరెడ్డిపాళెం, నవం బరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దూరు వద్ద మలిదేవి కాలువపై శిథిలావస్థలో ఉన్న బ్రిటిష్‌కాలం నాటి బ్రిడ్జి పునర్నిర్మాణం కోసం గుత్తే దారు ముందుగా తాత్కాలిక బ్రిడ్జి ఏర్పాటుకు శుక్రవారం పనులు ప్రారంభించారు. కాలువపై ఉన్న బ్రిడ్జిని కూల్చేస్తే ప్రజలు, వాహనదా రుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయి. అందుకే పాత బ్రిడ్జి సమీ పంలో రూట్ డైవర్షన్ కోసం తాత్కాలిక బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా సిమెంటు తూములు వేస్తున్నారు. వారంలోపు తాత్కాలిక బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసేం దుకు వేగంగా పనులు కొన సాగుతున్నాయి. పాత బ్రిడ్జిని కూల్చే సి అదే ప్రాంతంలో కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు గుత్తేదారు తెలిపారు.

సీపీఎం నాయకుడు తాళ్ల వెంకయ్య మృతి

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనుబల్లిలో సీనియర్ సీపీఎం నాయకుడు తాళ్ల వెంకయ్య(70) గత కొన్నిరోజులుగా అనా రోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. వెంకయ్య భౌతిక కాయా నికి సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శి సభ్యులు మోహన్‌రావు, అజయ్‌కుమార్, పుల్లయ్య, రెహనాబేగం, మండల, స్థానిక సీపీఎం నాయకులు పులమాలలతో నివాళులర్పించారు. తాళ్ల వెంకయ్య పెను బల్లి సర్పంచుగా, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడుగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.

విద్యార్థినులను అభినందించిన ఎంఈవోలు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బెజవాడ బుజ్జమ్మ బాలికో న్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటి అభినందనలు అందుకున్నారు. పదవ తరగతి విద్యార్థిని వి. సంజన, ఈనెల 26న అమరావతిలోని రాష్ట్ర శాసన సభలో నిర్వహించిన మాక్ అసెంబ్లీకి ఎంపికయ్యారు. రాజ్యాంగ దినో త్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన ప్రతిభా పోటీలలో 9వ తర గతి విద్యార్థిని సాహితీశ్రీ ప్రతిభ కనబరచి కలెక్టర్ హిమాన్షు శుక్లా నుంచి అభినందనలు పొందారు. ఈ సందర్భంగా ఈ విద్యార్థినులకు శుక్రవారం పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఎంఈఓలు దిలీప్‌కుమార్, పీవీ రత్నం, హెచ్‌ఎం సుజాత, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పాఠశాల బస్సుల తనిఖీ

పొదలకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి డిసెంబరు 4 వరకు అన్నీ స్కూల్ బస్సులను తనిఖీ చేయడం జరుగుతుందని నెల్లూరు మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విఘ్నేశ్వరలాల్ తెలిపారు. శుక్రవారం పట్ట ణంలో బస్సులను ఆయన ఆకస్మికంగా తనిఖీలు చేశారు. అగ్నిమాపక పరిక రాలు, ఎమర్జెన్సీ ఎగ్జిట్, స్పీడ్ గవర్నర్లు వాటి పనితీరు పట్ల సమగ్రంగా తనిఖీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే అన్నీ విద్యా సంస్థల యాజ మాన్యాలకు తెలిపినట్లు వారు వెల్లడించారు.

తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ హెచ్చరి కల నేపథ్యంలో దిత్వా తుపాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు భారీ నుంచి అతి భారీవర్షాలు కురిసే అవకాశామున్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దారు షాజియా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొ న్నారు.


ఘటనాస్థలిలో గుమికూడిన జనం

గంజాయి బ్యాచ్ ఘాతుకం!

(5వ పేజీ తరువాయి)

ఆమె, ఆమె అనుచరులు కు మారుడితో ఒంటరిగా వస్తున్న స మయం చూసి ప్రణాళిక ప్రకారం మట్టుబెట్టినట్లు తెలుస్తోంది. కాగ పెంచలయ్యతో పాటు మరొకరిని కూడా హతమార్చాలని కామాక్షి టార్గెట్ చేసినట్లు స్థాని కులు తెలిపారు. సమాచారం అందుకున్న అదనపు ఎస్పీ సౌజన్య, రూరల్ డీఎస్పీ శ్రీనివాసురావు, సీఐ గుంజి వేణు తమ సిబ్బందితో ఘటనాస్థలికి చేరు కున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

C.R.I.M.E N.E.W.S

పోలీసులమని చెప్పి చైన్ చోరీ

- 3 సవర్ల బంగారు దండతో ఉడాయింపు
- లబోదిబోమన్న వృద్ధురాలు

మనుబోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు అల వాటుపడిన కొందరు యువకులు మోటార్ సైకిళ్లపై వచ్చి చైన్ స్నాచింగ్‌లు చేయడం ఇటీవల సర్వసాధారణమై పోయింది. గడి చిన కొద్దినెలల్లోనే మండలకేంద్రమైన మనుబోలులో ఇలాంటి సం ఘటనలు జరిగాయి. అయితే తాజాగా ఈ దఫా చోరులు పంథా మార్చారు. పోలీసు యూనిఫాంలో వచ్చి, బెదిరించి ఒంటరిగా ఉన్న వృద్ధులు, మహిళలను టార్గెట్ చేసుకున్నారు. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం మండల పరిధిలోని కొండూరు సత్రం వద్ద సాయిబాబా హోటల్ వద్దకు రెండు మోటార్‌సైకిళ్లపై నలుగురు యువకులు వచ్చారు. ఆ సమ యంలో హోటల్‌కు చెందిన సజ్జా రాధారాణి అనే వృద్ధురాలు దుకా ణం వద్ద ఉంది. ఆమె దగ్గరకు పోలీసు ప్యాంటు (ఖాకీ) ధరించి ఉన్న ఓ యువకుడు వచ్చాడు. నేను గూడూరు సీఐని, ఎస్పీ మేడం నెల్లూరు నుంచి గూడూరుకు వెళుతోంది. ఆమె అన్ని అంగళ్లు తనిఖీ చేస్తుంది. అంగళ్ళలో గుట్కాలు, పాన్‌పరాగ్‌లు అమ్మకండి, అవి తీసి లోపల పెట్టుకోండని చెప్పాడు. అలాగే నాయనా.. అంటూ వృద్ధు రాలు తలూపింది. ఆమె మెడలో ఉన్న గొలుసును గమనించిన నకి లీ సీఐ ఒంటిమీద బంగారు అవి వేసుకోకండి.. దొంగలు తిరుగుతు న్నారని చెప్పాడు. తర్వాత తీసేస్తాలే అని చెప్పగా.. 'కాదు ఇప్పుడే తీసేసి దాచేయండి' అని యువకుడు బలవంతం చేశాడు. ఆ సమ యంలో వృద్ధురాలు కొడుకు, కోడలు ఇంట్లో భోజనం చేస్తున్నారు. దీంతో ఆమె మెడలోంచి 3 సవర్ల బంగారు దండ తీసి టేబుల్‌కు ఉన్న డ్రాలో దాస్తుండగా, 'నేను దాచిపెడతాను ఇవ్వండి' అంటూ దండను యువకుడి చేతిలోకి తీసుకున్నాడు. డ్రాలో పెట్టినట్లుగా నటించి, దండ, డ్రా తాళం తీసుకుని అక్కడినుండి యువకుడు, అతడి స్నేహితులు ఉడాయించారు. దీంతో వృద్ధురాలు గట్టిగా కేక లు వేయగా, కుటుంబసభ్యులు, స్థానికులు అక్కడికి వచ్చారు. అప్ప టికే నలుగురు యువకులు గూడూరు మార్గం గుండా వెళ్ళి పోయారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసిం ది. సీసీ కెమెరాల ద్వారా చోరుల ఆచూకీ తెలుసుకుంటామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరాకేష్ తెలిపారు.

జామాయిల్ కర్ర పట్టివేత


జామాయిల్ కర్ర లారీని పట్టుకున్న తహసీల్దార్, ఎస్ఐ

సీతారామపురం, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): మండలం లో ని సింగారెడ్డిపల్లి గ్రా మ సర్వేనెంబర్ 447 లోని మేత పోరంబో కు భూమిలో గల జా మాయిల్ కర్రను అక్ర మంగా తరలిస్తున్న ఓ లారీని శుక్రవారం రాత్రి తహసీల్దార్ షజియా, ఎస్సై శివకృష్ణా రెడ్డిలు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోరం బోకు భూమిలో కొట్టిన జామాయిల్ కర్రను సింగారెడ్డిపల్లి గ్రామ సమీ పానగల భూముల్లో డంపింగ్ చేస్తుండగా స్థానికులు గమ నించి అధికారులకు సమాచారం అందించారు. ఈమేరకు రెవెన్యూ అధి కారులు, పోలీసులు రంగ ప్రవేశం చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పందెం రాయుళ్ల అరెస్టు

ఇందుకూరుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చట్టివారిగ కండ్రిగలో కోడిపందాలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తు లను శుక్రవారం ఎస్ఐ నాగార్జునరెడ్డి తన సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక కోడి, రూ. 2500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఇద్దరికి జైలు శిక్ష

నెల్లూరు(లీగల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో నేరం రుజువుకావడంతో ఇరువురికి ఏడాది జైలు శిక్ష విధి స్తూ నెల్లూరు నగర మూడవ అదనపు జూనియర్ సివిల్ న్యాయా ధికారి షేక్ అబ్దుల్ రెహమాన్ శుక్రవారం తీర్పు చెప్పారు. నెల్లూరు నగరం మూలపేటకు చెందిన ఫిర్యాది చెన్నారెడ్డి రామకృష్ణారెడ్డి కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లికి చెందిన రాజరాజేశ్వరి బాయిల్డ్ రైస్‌మిల్ మేనేజింగ్ పార్టనర్ కాండ్ర ప్రసన్న కుమార్‌రెడ్డి, పార్టనర్ ప్రతిమ ఇరువురు ఫిర్యాది రామకృష్ణారెడ్డి వద్ద 2016 జూన్ 11వ తేదీన రూ.25 లక్షల అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోట్ రాసి ఇచ్చారు. అప్పు తీర్చే క్రమంలో రూ.30 లక్షలకు 2019 ఆగస్టు 2వ తేదీన చెక్కు ఇచ్చారు. సదరు చెక్కును ఫిర్యాది ఆ మరుసటి రోజు (3వ తేదీ) బ్యాంకులో ప్రజంట్ చేయగా అది చెల్లలేదు. దాంతో ఫిర్యాది తన న్యాయవాది ద్వారా వారి రువురికి లీగల్ నోటీస్ ఇచ్చి కోర్టులో ఎన్ఐ యాక్ట్ కింది ప్రయివేట్ కంప్లయింట్ దాఖలు చేశారు. విచారణ కాలంలో నేరం రుజువు కావడంతో నిందితులిద్దరికీ పై విధంగా జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే చెక్కు మొత్తం రూ.30 లక్షలతోపాటు మరో రూ. 30 లక్షల ఫిర్యాదికి పరిహారం కింద చెల్లించాలని తీర్పు చెప్పారు.

మతిస్థిమితం లేని మహిళపై లైంగిక దాడి

మనుబోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ మహిళపై 70 ఏళ్ళ వృద్ధుడు శుక్రవారం లైంగికంగా దాడి చేసి న ఘటన మండలంలోని గొట్లపాళెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గ్రామానికి చెందిన బుడగా పెంచలయ్య బుట్టలు, గంపలు అల్లుకుని జీవనం సాగిస్తుండేవాడు. శనివారం మద్యం సేవించి దళితవాడలో ఉన్న పెద్దవెంకటస్వామితో మాట్లాడేందుకు వెళ్ళాడు. ఆ సమయంలో వెంకటస్వామి ఇంట్లో లేడు. ఆయన మన వరాలు (మతిస్థిమితం లేని మహిళ) ఇంట్లో ఒక్కటే ఉంది. దీంతో పెంచలయ్య ఆమెపై లైంగిక దాడికి ప్రయత్నించాడు. కొద్దిసేపటి తరువాత ఆమె ఇంట్లోనుంచి పెంచలయ్య రావడాన్ని గమనించిన స్థానికులు ఇంట్లోకి వెళ్ళి గమనించారు. దీంతో మహిళపై లైంగిక దాడి జరిగినట్లు గుర్తించారు. పెంచలయ్య కోసం గాలించి అనం తరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళ మెడలో బంగారు సరుడు అపహరణ

నెల్లూరు(క్రైం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రొవిజన్స్ షాపునకు వెళ్లిన మహిళ మెడలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి బంగారు సరుడు, మంగళసూత్రంను అపహరించు కెళ్లిన ఘటన పడారుపల్లి ప్రాంతంలో జరిగింది. పోలీసుల సమా చారం మేరకు.. పడారుపల్లి ప్రాంతంలో నాటకరాని శ్రీదేవి, శ్రీనివా సులు దంపతులు నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి శ్రీదేవి కోడిగుడ్లు తెచ్చుకునేందుకు ప్రొవిజన్స్ షాపునకు వెళ్లింది. చెన్న కేశవ స్వామి గుడి దగ్గరకు వెళ్లేసరికి పక్క వీధిలో నుంచి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై ఆమెకు ఎదురుగా వచ్చి ఆమె మెడలోని సుమారు 29 గ్రాముల బంగారు సరుడు, మంగళ సూ త్రం తెంచెకెళ్లారు. సరుడు తెంపుకెళ్లే సమయంలో మహిళ గట్టిగా పట్టుకున్నా ఇద్దరు నిందితులు లాక్కుంటూ వెళ్లడంతో ఆమె కింద పడి గాయపడ్డారు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చేలోపు నిందితులు పరారయ్యారు. జరిగిన విషయాన్ని తన భర్తకు తెలపడంతో శుక్రవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	124
స్కిన్ చికెన్	226
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100): 640

చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదు : ఎంహెచ్‌వో

నెల్లూరు(సిటీ), నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : నివాసాల వద్ద నిత్యం చెత్తను సేకరించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని ఎంహెచ్‌వో డాక్టర్ కనకాద్రి తెలిపారు. శుక్రవారం 47వ డివిజన్ జెండావీధి, గర్భీవీధి ప్రాంతాలలో పారిశుధ్య పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లపై చెత్త ఉండనివ్వద్దని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తున్నవారిని గుర్తించాలని సూచించారు. ప్రజలు సంచరించే ప్రాంతాల్లో పొగతాగనివ్వకుండా హెచ్చరికలు జారీ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. డ్రైనేజీ కాలువల్లో పూడిక లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీని వల్ల మురుగు నిలవకుండా వెళ్తుందన్నారు. ఫలితంగా పారిశుధ్యం మెరుగుపడి దోమల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వామ్మో.. సెన్సార్ ట్రాక్!

- డ్రైవింగ్ టెస్ట్‌కు వెళ్లాలంటే హడలెత్తుతున్న జనం
- సగం మంది కూడా ఉతీర్ణులు కావడం లేదని ఆందోళన

నెల్లూరు(క్రైం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సెన్సార్ ట్రాక్‌పై డ్రైవింగ్ టెస్ట్ కష్టతరంగా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లపైనే డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్‌లను రవాణాశాఖ అధికారులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నగరంలోని డీటీసీ కార్యాలయంలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌ను రూ.1.21 కోట్లతో హైదరాబాద్‌కు చెందిన నిపున్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు ట్రాక్‌ను పూర్తి చేశారు. దీనిపై రవాణాశాఖ అధికారుల పర్యవేక్షణలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌పై ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి డ్రైవింగ్ టెస్ట్‌లు జరుగుతున్నాయి. అయితే సెన్సార్ డ్రైవింగ్ ట్రాక్‌పై డ్రైవింగ్ టెస్ట్‌కు వస్తున్న వారిలో సగం మంది కూడా ఉత్తీర్ణులు కావడం లేదు. దీంతో సెన్సార్ ట్రాక్‌పై డ్రైవింగ్ టెస్ట్ అంత సులువు కాదు అని ప్రజలు భావిస్తున్నారు.



డీటీసీ కార్యాలయంలో నిర్మించిన సెన్సార్ డ్రైవింగ్ ట్రాక్

● ట్రాక్ మొత్తం సెన్సార్లు, కెమెరాలు

రాష్ట్రంలో మొదటి విడతలో చిత్తూరు, అనంతపురం, కర్నూలు, విజయవాడ ప్రాంతాల్లో ఆటోమేటెడ్ డ్రైవింగ్ ట్రాక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రెండవ విడతలో నెల్లూరు నగరంలోని డీటీసీ కార్యాలయంలో అత్యాధునిక ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లో 13 సెన్సార్లు, 14 వీడియో కెమెరాలు, 8 వీఎంఎస్ బోర్డులు ఏర్పాటు చేశారు. వీటితో సెన్సార్లతో కూడిన బుల్లెట్లను వాహనం తిరిగే రోడ్లపై పదుల సంఖ్యలో ఏర్పాటు చేశారు. ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ పూర్తిగా టెక్నాలజీతో నిర్మించబడింది. గతంలోలా డ్రైవింగ్ టెస్ట్‌కు వచ్చిన ప్రజలు అధికారుల పర్యవేక్షణలో వాహనాలు నడిపి లైసెన్సులు పొందేందుకు అవకాశం ఉండదు. అత్యాధునిక ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లోకి డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చిన ప్రజలు అక్కడ ఉన్న కియోస్క్ మిషన్‌లో వేలి ముద్ర వేయాల్సి ఉంటుంది. వేలి ముద్ర వేయగానే టోకెన్ వస్తుంది. ఆ టోకెన్ తీసుకొని ట్రాక్‌లోకి వెళ్లాలి. బైక్, ఆటో, కారు డ్రైవింగ్ టెస్ట్ కోసం వచ్చిన వారికి ఆయా వాహనాలకు సంబంధించిన రూట్లను సిబ్బంది చూపిస్తారు. ట్రాక్‌లోకి ప్రవేశించగానే సెన్సార్ ఉంటోంది. సెన్సార్ వద్దకు వెళ్లి టోకెన్‌ను స్కాన్ చేస్తే ట్రాక్‌పై ఉంచిన వీఎంఎస్ బోర్డుపై గ్రీన్ సిగ్నల్ వస్తుంది. దరఖాస్తు పక్రియలో తప్పులు ఉంటే రెడ్ సిగ్నల్ వస్తుంది. గ్రీన్ సిగ్నల్ వచ్చిన తర్వాత లైసెన్స్ కోసం వచ్చిన అభ్యర్థి సూచిక బోర్డుల ఆధారంగా వాహనాన్ని డ్రైవింగ్ చేయాల్సి ఉంటోంది. ట్రాక్‌పై ఏర్పాటు చేసిన సెన్సార్లు, బుల్లెట్‌లకు కాలు తగిలినా, కాలు కింద పెట్టినా వీఎంఎస్ బోర్డులో ఫెయిల్ అని వస్తుంది. దీంతో రవాణాశాఖ అధికారులు ఫెయిల్ చేసి మరోమారు డ్రైవింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తారు.

● డ్రైవింగ్ టెస్ట్‌ల వివరాలు ఇలా..

నగరంలో సెన్సార్ ఆటోమెటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌పై ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ నెల వరకు నిర్వహించిన టెస్ట్ వివరాలు ఇలా ఉన్నాయి. ఎంసీడబ్ల్యూజీ(మోటార్ సైకిల్ విత్ గేర్) లైసెన్సులు పొందేందుకు టెస్ట్‌లకు 4056 మంది హాజరు కాగా 1712 మంది మాత్రమే ఉత్తీర్ణులు కాగా 2423 మంది ఫెయిల్ అయ్యారు. ఎల్ఎంవీ(లైట్ మోటార్ వెహికల్) టెస్ట్‌కు 2,439 మంది హాజరు కాగా 107 మంది ఉత్తీర్ణు లు కాగా 2,332 మంది ఫెయిల్ అయ్యారు. అంటే పది నెలల కాల వ్యవధిలో 6,495 మంది డ్రైవింగ్ టెస్ట్‌లకు హాజరు కాగా 1,819 మంది ఉత్తీర్ణులు కాగా 4,755 మంది విఫలమయ్యారు.

కాకాణి భ్రమలో ఉన్నారు

- తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ నాయుడు



మాట్లాడుతున్న రాధాకృష్ణనాయుడు

నెల్లూరు(వైద్యం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తనలాగే అందరూ దోపిడీ చేస్తారనే భ్రమ లో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఉన్నార ని తెలుగురైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, చవట పాళెం పీఏసీఎస్ చైర్మన్ రాపూరు రాధాకృష్ణ నాయుడు విమర్శించారు. శుక్రవారం నగరంలో ని సర్వేపల్లి ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గోవర్ధన్‌రెడ్డి జీవితమం తా నకిలీ పత్రాలు, నకిలీమద్యం, నకిలీ మాట లేనని ఎద్దేవా చేశారు. కాకాణి ఎన్ని జన్మలె త్తినా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని అవినీతిప రుడుగా చిత్రీకరించలేడన్నారు. మాయమాటల తో కాలక్షేపం చేయాల్సిందేనని దుయ్యబట్టారు. కాకుటూరు శివాలయం విషయంలో కాకాణి వాఖ్యలు అర్థరహితం, దుర్మార్గమన్నారు. 1980లో దాత డబ్బుగుంట రమణయ్య దేవాలయానికి 48 సెంట్లు భూమి అప్పగించారన్నారు. అయితే శివాలయం తూర్పు భాగంలో వ్యవసాయ భూములు ఉన్నాయని, దక్షణం వైపున పొలాల్లోకి మట్టిబాట ఉండేదని చెప్పారు. కాలక్రమంలో వ్యవసాయ భూములన్నీ రియల్ ఎస్టేటుగా మారాయన్నారు. అయినా దేవాదాయశాఖకు సంబంధించి దాత ఇచ్చిన 48 సెంట్ల భూమిలో ఒక్కసెంటు కూడా క్రయ విక్రయాలు జరగలేదని పేర్కొన్నారు. అయితే సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రయోహన్ రెడ్డి ఈ శివాలయం భూములు అమ్మేస్తున్నాడని కాకాణి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అడ్డగోలు దోపిడీకి అలవాటు పడ్డ కాకాణి ఇదే లోకంలో విహరిస్తున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఫూలే ఆశయాలు ఆచరించడమే నిజమైన నివాళి

- సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి



ఫూలే దంపతుల విగ్రహాల వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నేతలు

నెల్లూరు(వైద్యం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిరావు ఫూలే ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఫూలేకు నిజమైన నివాళి అని సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి పేర్కొన్నారు. ఫూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని మినీబైపాస్ రోడ్డులో ఉన్న ఫూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరిగెల సాయి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు ఫూలే దంపతులేనన్నారు. వారి బాటలోనే నడవాల్సిన అవసరం ఉందన్నారు. ఖండే నాయకులతో కలిసి ముంబైలో కార్మిక సంఘం స్థాపించారని చెప్పారు. సామాజిక, ఆర్థిక పోరాటాలు నిర్వహించారన్నారు. ఈ రెండు రంగాల్లో పోరాటాలు చేపట్టిన సందర్భంగా మహాత్మ అన్న బిరుదు వచ్చిందని తెలిపారు. ఫూలే దంపతులు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారన్నారు. విద్య ద్వారా జ్ఞానం, జ్ఞానంతో పాటు అభివృద్ధి కూడా సాధ్యమవుతుందన్న సందేశాత్మక నినాదాన్ని ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రామరాజు, నందిపోగు రమణయ్య, పఠాన్ జిలానీఖాన్, షేక్ మున్నా, విజయకుమార్, లీలామోహన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● టీడీపీ జిల్లా కార్యాలయంలో..

నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో జ్యోతిరావు ఫూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ నేతలు కొండూరు పాల్‌శెట్టి, నన్నేసాహెబ్, పముజుల ప్రదీప్, ఉప్పు భాస్కర్, కృష్ణ, పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

● ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో..



ఫూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు



నివాళులర్పిస్తున్న కనకట్ల రఘురాం ముదిరాజ్, తదితరులు

నెల్లూరు(హరనాథపురం) : ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కనకట్ల రఘురాం ముదిరాజ్ ఆధ్వర్యంలో నాయకులు నగరంలోని మినీబైపాస్ రోడ్డులోని జ్యోతిరావు ఫూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీవీ కృష్ణయ్య, అరిగెల సాయిరాం, పాబోలు సత్యం, తిరుపతి శేఖర్, ఒంగోలు నరసయ్య, భాగవతుల విజయరాఘవేంద్ర తదతరులు పాల్గొన్నారు.

● వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో..

ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజి దయాకర్ జ్యోతిరావు ఫూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బెల్లంకొండ వెంకయ్య, జిల్లా అధ్యక్షుడు కోటకొండ వెంకటేష్, జిల్లా కార్యదర్శి బెల్లంకొండ బాల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

● జనసేన నాయకుల నివాళి



ఫూలే దంపతులకు నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : జ్యోతిరావు ఫూలే దంపతుల విగ్రహాలకు జనసేన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాలకు ఫూలే దంపతులు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నాయకులు నూనె మల్లికార్జునయాదవ్, జమీర్, బెల్లపు సుధామాధవ్, గుర్రం కిషోర్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ శుక్రవారం ప్రజాదర్బార్ : రూరల్ ఎమ్మెల్యే



అర్జీదారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేషలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రజా దర్బార్‌ను తన నియోజకవర్గంలో ఇక నుంచి ప్రతీ శుక్రవారం నిర్వహిస్తామని రూరల్‌ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నెల్లూరులోని తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గం నుంచి అనేక మంది తమ సమస్యలపై వినతులను అందచేశారు. వాటిని స్వీకరించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను లిఖితపూర్వకంగా తెలిపితే వాటిని సంబంధిత శాఖల అధికారుల ద్వారా పరిష్కరించే బాధ్యతను తాను తీసుకుంటానని స్పష్టం చేశారు. ప్రతీ రోజు కార్యాలయంలో అందుబాటులో ఉంటామని, ఆ సమయాల్లో ప్రజలు నేరుగా వచ్చి కలవచ్చని పేర్కొన్నారు.

● అండర్ బ్రిడ్జి మరమ్మతు పనులు పరిశీలించిన గిరిధర్‌రెడ్డి

మాగుంట లేఅవుట్ వద్ద అండర్ బ్రిడ్జికి జరుగుతున్న మరమ్మత్తు, ఆధునీకరణ, సుందరీకరణ పనులను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. సుమారు రూ.25 లక్షలతో సుందరీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పైగా వర్షాలు వచ్చినప్పుడు నీటిని బయటకు తోడేందుకు 40 హెచ్‌పీ మోటారును కూడా ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ పనులన్నింటిని నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసి త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు భానుశ్రీ, మదన్‌కుమార్‌రెడ్డి, దిలీప్‌రెడ్డి, మల్లి, మురళి పాల్గొన్నారు.

1న అస్మిత క్రీడాకారిణుల ఎంపిక

నెల్లూరు(విద్య), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వం, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించే అచీవింగ్ స్పోర్ట్స్ మైల్‌స్టోన్ బై ఇన్‌స్పైరింగ్ ఉమెన్ త్రూ ఆక్షన్(అస్మిత) ఎంపికలను డిసెంబరు 1వ తేదీన నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కే.వెంకటేశ్వర్లు, అరిగెల విజయ్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అండర్-14, 16 బాలికలకు మాత్రమే అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో ఆసక్తి కలిగిన బాలికలు ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రాలతో అస్మిత లీగ్‌కు సంబంధిత తేదీలో ఉదయం 9 గంటలకు హాజరు కావలని తెలిపారు.

నేడు జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు

నెల్లూరు(విద్య), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఏబీఎం కాంపౌండ్‌లో ఈనెల 29వ తేదీన జిల్లా బాలబాలికల జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మెంటా సునీల్, ఎస్.విక్టర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15 బాలికలకు, అండర్-19 బాలురకు జరిగే ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్, వయస్సు ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత తేదీలో సాయంత్రం 3 గంటలకు హాజరు కావాలన్నారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో డిసెంబరు 1, 2వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

వైభవంగా కాలభైరవ అష్టమి పూజలు



పూజలందుకున్న కాలభైరవుడు

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట మూలాస్థానేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం కాలభైరవస్వామి అష్టమి పర్వదిన వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి కుష్మాండ దీపారాధనలు చేశారు. విశేష అలంకారం, పూజలు జరిగాయి. సాయంత్రం విశేష పుష్పాలంకారం, కాలభైరవ స్వామికి ప్రాకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా భక్తులతో ఆలయం కళకళలాడింది. ఈ కార్యక్రమాలను ఈవో ఏవీ శ్రీనివాసులరెడ్డి, అర్చకులు సిబ్బంది పర్యవేక్షించారు.

విభిన్న ప్రతిభావంతులకు నేడు ఆటల పోటీలు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 29న విభిన్న ప్రతిభావంతులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామని విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు ఏఎండీ ఆయూబ్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఏసీ స్టేడియంలో ఆరోజు ఉదయం 9గంటలకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు.

రాజరాజేశ్వరికి భక్తిశ్రద్ధలతో పూజలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో రాహుకాల ఉద్వాపన పూజలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా చండీయాగం, అభిషేకం, విశే ష అర్చనలు, ప్రత్యేక అలంకారంలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణలు జరిగాయి. ఉదయం భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి రాహుకాల దీపారాధనలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకులు రాఘురామమూర్తి ఆధ్వర్యంలో సంధ్యావేశం, వేద పారాయణం, కుంభహారతులు, పల్లకీసేవ కనుల పండువగా జరిగా యి. ఈ కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనా ర్దన్‌రెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

విద్యార్థినులకు డీఈవో అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో బాలాజీరావు

నెల్లూరు(విద్య), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లోని భూపాల్‌లో జరిగిన జాతీయస్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థినులను శుక్రవారం నగరంలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోడూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు బీ.కీర్తి, డీ.రాజశ్రీలు విద్యలో రాణిస్తూనే ప్రాజెక్ట్‌ల రూపకల్పనలో ప్రతిభ చూపుతున్నారన్నారు. ఇప్పటికే పలు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా సత్తా చాటి అందరి ప్రశంసలు అందుకోవడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయిలో కూడా అప్లికేషన్ ఆఫ్ ట్రిగ్నామెట్రీ అనే ప్రాజెక్ట్‌ను ప్రదర్శించి గుర్తింపు పొందడం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరిన్ని ప్రాజెక్ట్‌లను రూపకల్పన చేసి శాస్త్రవేత్తలుగా ఎదగాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ హరిప్రసాద్, నరసింహారావు, డీఎస్ఓ శివారెడ్డి, ప్రిన్సిపాల్ సీహెచ్.ఎస్తేరమ్మ, గైడ్ టీచర్ సీహెచ్.కామాక్షమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్ని నారానాయణరావుకు మాడభూషి సాహిత్య పురస్కారం



మాడభూషి సాహిత్య పురస్కారం అందుకుంటున్న చిన్ని నారాయణరావు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రముఖ కవి, విమర్శకుడు చిన్నినారాయణరావుకు మాడభూషి సాహిత్య నగదు పురస్కారం లభించింది. ఈ పురస్కారాన్ని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం జరిగిన కార్యక్రమంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాయలం వైస్ చాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాతూరి అన్నపూర్ణ, గంగిశెట్టి శివకుమార్, డాక్టర్ సుజషామిలీ, డాక్టర్ మాలకొండయ్య, డాక్టర్ టీఎస్.వెంకట్, డాక్టర్ సునావత్ రాంబాబులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆర్టీసీ అందరి లక్ష్యం కావాలి

- ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి



కార్మికులు, ఆర్టీసీ అధికారులతో జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

కావలి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆర్టీసీ అందరి లక్ష్యం కావాలని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. కావలి ఆర్టీసీ డిపో గ్యారేజీని శుక్రవారం సాయంత్రం సురేష్ రెడ్డి సందర్శించారు. గ్యారేజీ శుభ్రత, నిర్వహణపై పలు సూచనలు చేశారు. గ్యారేజీలో పనిచేస్తున్న సీనియర్ మెకానికల్ సిబ్బంది, ఒప్పందపు కార్మికులను ఆయన సత్కరించారు. గతంలో 65 శాతం ఉన్న ఆక్యుపేషన్ రేషియో100 శాతానికి పైగా పెరిగిందన్నారు. పారిశుధ్య విభాగంలో పనిచేసే సిబ్బందికి పీఎఫ్, ఈ ఎస్ఐ సౌకర్యం కూడా కల్పించామన్నారు. బస్టాండులో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్, నూతన మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజరు ఆదినారాయణ, ఏఈ మల్లికార్జున, అసిస్టెంట్ మేనేజర్ కల్పన, బస్టాండ్ మేనేజర్ రామక్రిష్ణ, పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రణీత మృతిపై జ్యూడిషియల్ విచారణ చేపట్టాలి

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): కృష్ణాపురం నవోదయ స్కూల్లో మృతి చెందిన విద్యార్థిని కత్తి ప్రణీత మృతిపై జ్యూడిషియల్ విచారణ జరపాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు తీర్మానించారు. నగరంలోని గిరిజన భవన్‌లో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆ ఐక్యవేదిక కన్వీనర్ కేసీ పెంచలయ్య తీర్మానాలను వివరించారు. ప్రణీత మృతిపై నిజనిర్ధారణ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థిని మృతిపై రాష్ట్ర ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. న్యాయ విచారణ కోసం హైకోర్టును ఆశ్రయిసామని తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీల ఇళ్లను ముట్టడించాలని, కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానించారని తెలిపారు. సమావేశంలో దళిత, గిరిజన సంఘాల నాయకులు, ఉపాధ్యాయ, విద్యార్థి, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అయ్యప్పస్వామి మండల పూజలు

నెల్లూరు(సాంస్కృతికం) నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని వేదాయపాలెంలోని అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి మండల పూజలు కొనసాగుతున్నాయి. శుక్రవారం అయ్యప్ప స్వామి నిర్మాల్య దర్శనం, పాలాభిషేకం, మహాగణపతి హోమం, ఉషఃపూజ, శ్రీవేలి ఉత్సవం, కలిశపూజ, నవకాభిషేకం, ఉచ్ఛపూజ జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, దర్శనం, మహాదీపారాధన, భగవతి సేవ, అత్తాలపూజ, పడి కర్పూర దీపం, హరిహరాసనం నిర్వహించారు. దాతల దాతృత్వంతో మధ్యాహ్నం అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గూడల శేషగిరి రావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య పర్యవేక్షణ లో జరిగిన ఈ కార్యక్రమాల్లో కమిటీ సభ్యులు కత్తి మోహన్‌రెడ్డి, పావలా ప్రసాద్, పలువురు అయ్యప్పస్వామి భక్తులు పాల్గొన్నారు.

శ్రీ వాకాటి సంజీవిశెట్టి ఎడ్యుకేషనల్ ట్రస్ట్
(శ్రీ సర్వోదయ కళాశాల), నెల్లూరు నగరం, SPSR నెల్లూరు జిల్లా

షాపింగ్ కాంప్లెక్స్ పై ఫ్లెక్స్ బ్యానర్లు ఏర్పాటు చేసుకొనుటకు లీజు హక్కుకు బహిరంగ వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు నగములోని శ్రీ వాకాటి సంజీవిశెట్టి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ శ్రీ సర్వోదయ కళాశాలకు హక్కు, అనుభవము కలిగిన ఈ క్రింద షెడ్యూలులో చూపబడిన స్థలములో ఫ్లెక్స్ బ్యానర్లు ఏర్పాటు చేసుకొను హక్కును తేది.01-01-2026 నుండి తేది.31-12-2028 వరకు అనగా 3 సంవత్సరముల కాలపరిమితికి లీజుకు ఇచ్చుటకు తేది.03-12-2025 బుధవారం ఉదయం 11.00 గంటలకు శ్రీ సర్వోదయ కళాశాల వద్ద దేవదాయ శాఖ అధికారుల సమక్షములో కార్యనిర్వహణాధికారి కమ్ కరస్పాండెంటుచే బహిరంగ వేలం పాట జరుపబడును.

షెడ్యూలు

వ. నెం.	సర్వే నెం.	ప్రదేశం	లీజు కాలపరిమితి	ధరావత్తు
1.	474& 475	నూతన షాపింగ్ కాంప్లెక్స్ 14 షాపుల పై భాగమున ఫ్లెక్స్ బ్యానర్లు ఏర్పాటు చేసుకొను హక్కు.	తేది.01.01.2026 నుండి తేది.31.12.2028 వరకు	రూ. 50,000/-
2.	474& 475	నూతన షాపింగ్ కాంప్లెక్స్ షాపు నెం.28 పై భాగమున ఫ్లెక్స్ బ్యానర్లు ఏర్పాటు చేసుకొను హక్కు.		
3.	474& 475	కళాశాల ముఖద్వారము దక్షిణ భాగమున ఫ్లెక్స్ బోర్డులు ఏర్పాటు చేసుకొను హక్కు.		

మిగిలిన వివరములు కళాశాల ఆఫీసు నందు సంప్రదించవలయును.
ఈవో కమ్ కరస్పాండెంట్

అట్టహాసంగా రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలు



క్రీడా జ్యోతితో పీఏసీఎస్ చైర్మన్ మస్తాన్‌బాబు, డీఈవో, అధికారులు

పొదలకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పొదలకూరు పట్టణం డీఎస్ఆర్ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డీఈవో బాలాజీరావు, పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి బాలురు, బాలికల విభాగాలకు సంబంధించి 26 జట్లు తరలివచ్చాయి. మార్చ్ ఫాస్ట్ నిర్వహించాయి. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. గెలుపోటములు సహజమని, ఓటమి తర్వాత గెలుపు సాధ్యమేనన్నారు. టోర్నమెంట్ పరిశీలకుడు కే నాగలింగేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పోతురాజు రమేష్, ఎంఈవో రేణుక, శోభనాద్రి మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చాటేవారికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శైలజ, పీడీలు బీవీ రమణయ్య, దేవిక, టీడీపీ నాయకులు గంటా మల్లికార్జున, బోగోలు భాస్కర్‌రెడ్డి, జనసేన నాయకుడు అనిల్, జిల్లా పీఈటీ అసోసియేషన్ సభ్యులు జీ శ్రీనివాసులు, థామస్ పీటర్ పాల్గొన్నారు.

కాగా, రగ్బీ పోటీలు తొలిరోజు హోరా హోరీగా జరిగాయి. బాలుర విభాగంలో నెల్లూరు, వెస్ట్ గోదావరి, ఈస్ట్ గోదావరి, కర్నూలు, ప్రకాశం, గుంటూరు, చిత్తూరు, శ్రీకాకుళం జట్లు, బాలికల విభాగంలో ఈస్ట్ గోదావరి, కృష్ణ, గుంటూరు, కర్నూలు, వైజాగ్, అనంతపురం, నెల్లూరు, చిత్తూరు జట్లు శనివారం జరిగే క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాయి.

రాష్ట్రస్థాయి బాలికల హాకీ పోటీలకు విస్తృత ఏర్పాట్లు

● జిల్లా జట్టుకు ప్రత్యేక శిక్షణ



నెల్లూరు జట్టుకు సూచనలిస్తున్న కోచ్‌లు

నెల్లూరు(విద్య), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల క్రీడాసమాఖ్య 69వ రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలకు నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. డిసెంబరు 1 నుంచి 3వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి క్రీడా జట్లు హాజరు కానున్నాయి. క్రీడాకారిణులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భోజన, వసతులకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనే నెల్లూరు బాలికల జట్టుకు ఇప్పటికే ఏసీ స్టేడియంలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. క్యాంప్ నిర్వాహకుడు థామస్‌పీటర్, కోచ్‌లు జీడీ సురేష్‌బాబు, పీ నాగేంద్రరావు, పీ పద్మజ మెలకువలు నేర్పుతున్నారు. రాష్ట్ర పోటీల్లో జిల్లా జట్టు విజయమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

లెక్క.. పక్కా!

పంచాయతీల్లో పన్నుల వసూలుకు యాప్ | పారదర్శకత కోసం 'స్వర్ణ పంచాయతీ' | నిధుల దుర్వినియోగానికి చెక్

ఇంటి పన్నుల వసూళ్లలో అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం నూతన విధానాన్ని అమల్లోకి తెచ్చింది. పన్నులకు సంబంధించి స్వర్ణ పంచాయతీ అనే యాప్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థిక నిర్వహణలో పారదర్శకతను పెంచటానికి, నిధుల వినియోగంపై ప్రజలకు సమాచారాన్ని అందించటానికి ముఖ్యంగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చెల్లింపును సులభతరం చేయడానికి ఈ యాప్‌ను రూపొందించింది.



మర్రిపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సాధారణంగా గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నుతోపాటు, కుళాయి, వాణిజ్య పన్నులు, ట్రేడ్ లైసెన్స్, వివిధ వేలం పాటలు, సెల్ టవర్ల పన్నులను సిబ్బంది వసూలు చేసేవారు. అయితే ఇలా వసూలు చేసిన మొత్తాన్ని పంచాయతీకి జమ చేయకుండా కొంత సొమ్మును వ్యక్తిగతంగా వాడుకున్న సందర్భాలు గతంలో వెలుగు చూశాయి. అలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త సాంకేతిక తను అందుబాటులోకి తెచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి స్వర్ణ పంచాయతీ యాప్ ద్వారా పంచాయతీ సిబ్బంది పన్నుల వసూళ్ల ప్రారంభించారు. ఆత్మకూరు డివిజన్‌లోని 9మండలాల్లో స్వర్ణ పంచాయతీ ప్రక్రియ పూర్తయింది. కానీ పంచాయతీ కార్యదర్శుల బదిలీలు ఒక పక్కన, మరో పక్క ఇంటి అసెస్మెంట్ నెంబరుకు ఆధార్, ఫోన్ నెంబర్లు లింక్ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో హడావిడిగా ఎవరెవరివో ఫోన్ నెంబర్లు, ఆధార్ నెంబర్లు లింక్ చేసినట్లు సమాచారం. తాజాగా వాటిని సరి చేసేందుకు మరి కొంత సమయాన్ని వెచ్చిస్తూ స్వర్ణ పంచాయతీ నిర్వహణ పారదర్శకతపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఆత్మకూరు డివిజన్‌లో 184 పంచాయతీల్లో 78,410 కుటుంబాలను ఇంటి యజమాని ఆధార్ కార్డు నెంబరుతో ఆన్‌లైన్ చేస్తున్నారు.

నిధుల దుర్వినియోగం ఇక కుదరదు

ప్రస్తుతం ఈ యాప్‌తో ఇంటి పన్ను, కుళాయి, ఇతర పన్నులు ఎంతకట్టామన్నది ఆన్‌లైన్‌లో నమోదై ఉంటుం ది. ముఖ్యంగా పన్ను కట్టిన వెంటనే ఎంత చెల్లించామ న్నది వ్యక్తిగతంగా ఫోన్లకు మెసేజ్ వస్తుంది. తద్వారా నిధుల దుర్వినియోగానికి ఆస్కారం ఉండదు. చెల్లించిన పన్నుల నగదు పంచాయతీ ఖాతాలకు జమ కావటంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు దోహదపడుతుంది.

- రమణయ్య, డీఎల్‌పీవో, ఆత్మకూరు

దివ్యాంగ విద్యార్థులకు 10లో ప్రత్యేక రాయితీలు

- దివ్యాంగ విద్యార్థులందరూ పరీక్షలకు హాజరయ్యేలా రవాణా, ఇతర ఏర్పాట్లకు చర్యలు తీసుకుంటున్నారు.
- శారీరక దివ్యాంగులైన విద్యార్థులకు ఏదైనా ఒక భాష పరీక్ష రాయకుండా మినహాయింపు ఇస్తారు. మిగిలిన వాటిల్లో 35 మార్కులు సాధించాల్సి ఉంటుంది.
- అంధులకు కూడా ఒక భాష నుంచి మినహాయింపు ఇవ్వగా మిగిలిన పరీక్షల్లో కనీసం 20 మార్కులు సాధించాల్సి ఉంటుంది.
- వినికిడి లోపం ఉన్న వారికి రెండు భాషల పరీక్షల నుంచి మినహాయింపు ఇచ్చారు. వీరు మిగిలిన నాలుగు సబ్జెక్టులలో 20 మార్కులు తెచ్చుకుంటే ఉత్తీర్ణత సాధించినట్లే!
- మాట లోపం ఉన్న విద్యార్థులు ఆరు సబ్జెక్టులలో 20 మార్కులు తెచ్చుకోవాలి.
- మానసిక వికలాంగులైన విద్యార్థులు అన్నీ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. అయితే అన్నింటిలో 10 మార్కులు చొప్పున సాధిస్తే పాస్ అయినట్లే.
- ఇక, కుష్టు, పక్షవాతం వంటి వ్యాధులతో బాధపడుతున్న వారు, మరుగుజ్జులు, యాసిడ్ దాడికి గురైన వారు.. ఇలాంటి వర్గాలకు ఏదైనా ఒక భాష నుంచి మినహాయింపుతోపాటు మిగిలిన పరీక్షల్లో 10 మార్కులు సాధిస్తే సరిపోతుంది.
- అభ్యసన వైకల్యం ఉన్నవారికి ఆంగ్లం నుంచి మినహాయింపు ఇచ్చారు. మిగిలిన వాటిల్లో 15 మార్కులు సాధిస్తే సరిపోతుంది.
- అంధులు, చేతులకు సంబంధించిన వైకల్యం ఉన్న వారు, ఎమ్మార్, సీపీ, న్యూరో సమస్యలతో చేతులు పనిచేయని వారికి ఒక సహాయకుడిని కేటాయించి పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు. వీరికి అదనంగా మరోగంట సమయం కూడా కేటాయిస్తారు.
- దివ్యాంగ విద్యార్థులకు అవసరం మేరకు వివిధ పరికరాలు, కుర్చీలు, కంటి అద్దాలు, కాలిక్యులేటర్లు, శ్రవణ యంత్రాలు, కృత్రిమ అవయ వాలు, సహాయకులను వెంట తెచ్చుకునేందుకు ముందుగా దరఖాస్తు సుకుంటే అన్నింటికీ అనుమతి లభిస్తుందని అధికారులు తెలిపారు.



నెల్లూరు(విద్య), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక మినహాయింపులు, రాయితీలు, సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దివ్యాంగ విద్యార్థులు ముందుగా పేర్లు నమోదు చేసుకుంటే ఈ రాయితీలను పొందవచ్చు. దీనిపై ఇప్పటికే అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

అవగాహన కల్పించాలి...

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అందించే సదుపాయాలపై తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖాధికారులు తెలిపారు. ఈ ప్రయోజనాలు పొందేందుకు సదరం వైకల్య సర్టిఫికెట్‌గానీ, సివిల్ అసిస్టెంట్ సర్జన్ అందించిన మెడికల్ సర్టిఫికెట్‌గానీ అంద చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు నామినల్ రోల్స్ పంపే సమయంలో దివ్యాంగ విద్యార్థులకు సంబంధించి ఆయా వైకల్య కోడ్ నమోదు చేసి పంపితే వారి వైకల్యాల ఆధారంగా మినహాయింపులు ఇచ్చిన సబ్జెక్ట్ మినహా మిగిలిన సబ్జెక్టులకు సంబంధించిన ఓఎంఆర్ షీట్లు మాత్రమే పరీక్ష కేంద్రాలకు పంపిస్తామని తెలిపారు.

1న మెప్మా మెగా జాబ్‌మేళా

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో పట్టణ ప్రాంతాలలో నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి మొదటిసారిగా జిల్లాస్థాయి మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఏ.లీలారాణి ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 1న నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళా సంఘాల సభ్యుల పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఒక కుటుంబంలో-ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడంలో భాగంగా మెప్మా సంస్థ, నిపుణ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుందని తెలిపారు. విప్రో, యాక్సిస్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ, ఆదిత్యబిర్లా సన్‌లైఫ్ ఇన్సూరెన్స్, అపోలో ఫార్మసీ, బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ తదితర సంస్థలలో ఉద్యోగావకాశం కల్పించడానికి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 31 ఏళ్ల లోపు వయస్సు కలిగి, 10 నుంచి డిగ్రీ, పీజీ వరకు చదివిన వారు మెప్మా-నిపుణలో హెచ్‌టీటీపీఎస్: జాబ్‌మేళా.మెప్మా ఏపీ.కామ్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న యువతీయువకులు వారి విద్యార్హత సర్టిఫికెట్లతో డిసెంబరు 1న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. ఇంటర్వ్యూలు పూర్తయిన వెంటనే ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందచేస్తామని తెలిపారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు నవంబరు 30తో ముగుస్తున్న నేపథ్యంలో మరో రెండు నెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్డుల పొడిగింపు కాలపరిమితి జనవరి 31వ తేదీ వరకు లేదా కొత్త కార్డుల జారీ ప్రక్రియ జరిగే వరకు ఏది ముందు జరిగితే అప్పటి వరకు ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం అక్రిడిటేషన్ కార్డులు కలిగిన పాత్రికేయులకు రెండు నెలల పొడిగింపు వర్తిస్తుందని తెలిపారు.

1న గీతా జయంతి

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో డిసెంబరు 1వ తేదీ గీతా జయంతికి వైష్ణవ ఆలయాల్లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. మహాభారతంలో కురుక్షేత్ర యుద్ధ భూమిలో అర్జునుడు, శ్రీకృష్ణ భగవానుడికి మధ్య జరిగిన సంభాషణను భగవద్గీతగా వ్యాస మహర్షి రచించి భావితరాలకు అందించారు. గీతా జయంతి సందర్భంగా ఎన్నో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

శ్రీ దుర్గా భవాని జ్యోతిష్యాలయం

స్త్రీ, పురుషుల వశీకరణ, కుటుంబ, చదువు, పెళ్లి, ప్రేమ, భార్యా భర్తల మధ్య సమస్యలు, నాగదోషం ఎలాంటి సమస్యలు ఉన్నా చెప్పబడును. శ్రీ దుర్గ హోటల్ ఎదురుగా, స్టోన్‌హౌస్‌పేట, సెల్:97042 49338

AJR-240748

FLAT FOR SALE

Fully Furnished ready to Occupy, Vastu, Excellent location. A New Flat in ground Floor for Sale @ A.C. Vegetable Market, Nellore. **Call : 7892146069.**

AJR-11423

REAL ESTATE

100% Clear Title Commercial Property for Sale with 200% growth Potential. Best for Hotels, Hospitals, and Corporates. **Call : 7892146069.**

AJR-11422

కమర్షియల్ ప్లాట్ సేల్

నెల్లూరు మైపాడు రోడ్‌కి, కిసాన్‌నగర్‌కు అతి దగ్గరలో 30 అంకణం కమర్షియల్ ప్లాట్ అమ్మకమునకు కలదు. అంకణము 3,50,000/-. సం.ప్ర. సెల్: 89191 88010

AJR-240541

PLOT FOR SALE

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట, పప్పుల వీధి, వాటర్ ట్యాంక్‌కి ఎదురుగా శివాజి నగర్‌కి వెళ్ళురోడ్డులో 15 అం॥ల దక్షిణ ముఖం ఖాళీ స్థలం అమ్మబడును. సంప్ర: 94404 02307

AJT -1827

WANTED

నెల్లూరులోని ప్రముఖ డాక్యుమెంట్ రైటర్ దగ్గర రిజిస్ట్రేషన్ దస్త్రావేజులు తెలుగులో కంప్యూటర్ నందు టైప్ చేయుటకు అనుభవం కలిగిన (మేల్) వారు కావలెను. సం.ప్ర. సెల్: 94919 45945

AJR -240543

బిజినెస్ ఆఫర్

తక్షణం వ్యాపార భాగస్వాములు వెతుకుతున్నాము. అవకాశాన్ని కొల్పోకండి. సంప్రదించండి. **RSJ Inspection Service Ltd.** Cell:8595924917,8800629648

AJA-257588

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

గూడూరును నెల్లూరులో కలపాలి : బీజేపీ



ఏవో విజయకుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న రంగారెడ్డి

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గూడూరు అసెంబ్లీ నియోజక వర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత పేర్నాటి రంగారెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆ పార్టీ నేతలతో కలసి కలెక్టరేట్‌లో ఏవో విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన ప్రాథమిక గెజిట్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలనేది ప్రజల మనోగతమని, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మిడతల రమేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కాగా, రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలను తిరుపతి జిల్లాకు బదలాయిస్తే జలవివాదాలు తప్పవని, వాటిని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతూ బీజేపీ నమామి గంగే ప్రాజెక్టు రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కోరారు. ఈ మేరకు తెలుగుగంగ ప్రాజెక్టు ఎస్ఈ సుబ్రహ్మణ్యేశ్వరశర్మకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఆ మండలాల బదలాయింపు వల్ల కండలేరు డ్యాం రెండు ముక్కలయ్యే అవకాశం ఉందని తెలిపారు.

పూలే గొప్ప సంఘ సంస్కర్త

● జేసీ వెంకటేశ్వర్లు



జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేసీ వెంకటేశ్వర్లు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. జ్యోతిరావు పూలే వర్థంతి సందర్భంగా శుక్రవారం నగరంలోని మినీబైపాస్ రోడ్డులో ఉన్న పూలే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి, కుల వివక్షత నిర్మూలన కోసం పోరాడిన గొప్ప సామాజిక ఉద్యమకారుడని చెప్పారు. దేశంలో బాలికల కోసం తొలి పాఠశాలను నిర్మించారని తెలిపారు. ఆనాటి సాంఘీక దురాచారాలను వ్యతిరేకించి బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలి

● ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్

నెల్లూరు(వైద్యం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి : జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖలో తొలగించిన హెల్త్ అసిస్టెంట్‌లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని అన్న మయ్య సర్కిల్ వద్ద ఉన్న యూటీఎఫ్ కార్యాలయంలో ఏపీ హంస జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా కార్యదర్శి కమల్‌కిరణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చేజర్ల మాట్లాడుతూ దశాబ్దాలుగా పని చేస్తున్న హెల్త్ అసిస్టెంట్‌లను తొలగించడంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. 25 ఏళ్లు పైబడిన ఏఎన్ఎంల పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే వాటిని పరిష్కరించాలన్నారు. హంస జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు, ఎన్నికల అధికారి కప్పా నారాయణ రాజు, జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి జలీల్ అహ్మద్, జిల్లా ప్రచార కార్యదర్శి మజార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వింజమూరు, ఉదయగిరి, బుచ్చిరెడ్డిపాళెం తాలూకాల కమిటీని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు సిటీ అధ్యక్ష, కార్యద ర్శులు గౌస్‌బాషా, మంజరీ, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్‌రెడ్డి సుజాత పాల్గొన్నారు. ఉదయగిరి తాలూకా అధ్యక్ష, కార్యదర్శులుగా గాజుల నౌషాద్‌బాబు, కాజామొహిద్దీన్, మహిళా వింగ్ కార్యదర్శిగా చంద్రావతి, వింజమూరు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులుగా ఝాన్సీరాణి, శ్రీవిద్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ నేతలు పాల్గొన్నారు.



ఏపీ హంస నూతన కార్యవర్గంతో జిల్లా నాయకులు

పొగాకు ధరల్లో హెచ్చుతగ్గులు

● ప్రతీ సంవత్సరం ధరల పెరుగుదల
● పెట్టుబడుల భారాన్ని తగ్గించండి
● పొగనారు రైతుల వేడుకోలు



కలిగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పంటగా పేరుగాంచిన పొగాకు ధరల్లో హెచ్చు తగ్గుల కారణంగా సాగు చేసిన రైతులు ఒక్కోసారి నష్టాల బారిన పడుతున్నారు. అయితే గత నాలుగేళ్ళుగా మద్దతు ధర ఆశాజనకంగా ఉంటోంది. ఈ క్రమంలో గతంలో ఒక బ్యారన్ కలిగిన రైతుకు 7.5 ఎకరాల విస్తీర్ణంలో పొగాకు పంట సాగుకు, 35 క్వింటాళ్ల పొగాకు అమ్మకాలకు బోర్డు అనుమతి ఇచ్చింది. గత ఏడాది నుండి ఒక్కొక్క బ్యారన్ కలిగిన రైతుకు 9.3 ఎకరాల విస్తీర్ణంలో పొగాకుపంట సాగుకు 42.75 క్వింటాళ్ల అమ్మకాలకు అనుమతి ఇవ్వడంతో రెండేళ్లనుండి రైతులు ఎక్కువ విస్తీర్ణంలో పొగాకు పంట సాగు చేయడానికి సన్నద్ధులవుతున్నారు.

పెరిగిన డిమాండ్.. అదనంగా సాగు

వాతావరణ పరిస్థితుల దృష్ట్యా బోర్డు అనుమతించిన విస్తీర్ణంకంటే ప్రతీ ఏటా పొగాకు పంటను అదనంగా సాగుచేయడం రైతుకు తప్పనిసరయింది. ఈ క్రమంలో పొగాకు సాగుకు అవసరమైన పొగ నారుకు కూడా గతంలో కన్నా విపరీతంగా డిమాండ్ పెరిగింది. కలిగిరి వేలంకేంద్రం పరిధిలో సుమారు 150 నుండి 200 ఎకరాల్లో పొగనారు సాగు చేశారు. బోర్డు ద్వారా అనుమతి పొంది విత్తనాలు తీసుకొని పలువురు రైతులు పొగనారును సాగు చేశారు. నారు సాగుకు సుమారు 40 రోజులనుండి 120 రోజుల వరకు వివిధ దశల్లో నారును పీకి మూటలు కట్టి నారుమడుల వద్ద రైతులకు అమ్ముతారు.

ఏటా పెరుగుతున్న ధరలు

గత మూడేళ్లనుండి ఏటేటా పొగాకు ధరలు పెరుగుతుండడంతో ఎక్కువ మంది రైతులు పొగాకు సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఒకప్పుడు రాజమండ్రి తదితర ప్రాంతాలకు మాత్రమే వెళ్ళి పొగ నారు తీసుకొచ్చి నాటేవారు. అయితే పొగాకు బోర్డు నాణ్యమైన విత్తనాలను సరఫరా చేసి, పొగనారు చేసే రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇచ్చి అవగాహన కల్పిస్తుండడంతో స్థానికంగా పొగనారుకు కూడా మంచి డిమాండ్ ఏర్పడింది.

అదనపు పెట్టుబడులు భారమే...

వర్షాభావ పరిస్థితుల్లో ట్యాంకర్లతో నీరు తోలడం, కూలీలచే మోయించాల్సి వస్తున్నందున అదనపు ఖర్చులతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారు. దీంతో వర్షాలు కురిసినపుడు మాత్రమే ఎక్కువమంది రైతులు సాగు చేస్తున్నారు. దీంతో పొగనారు వద్ద నుండే పెట్టుబడులు పెరిగిపోతున్నాయని, ఈ ప్రభావం సాగుపై పడుతోందని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా వర్షాలు కురిసినపుడు, రైతులు బురద ఏత వేసే క్రమంలో మూట నారు (6 వేల పొగ మొక్కలు) రూ. 4 వేల నుండి రూ. 5 వేలు పలుకుతుంది. వర్షాలు లేని సమయంలో రూ. 2 వేలు మాత్రమే ఉంటోంది. అయితే ఈ ఏడాది ఇటీవల వర్షాలు కురిసినపుడు మూట పొగనారు ధర రూ.7 వేలకు పైగా పలకగా, ప్రస్తుతం రూ. 4వేల వరకు ధర ఉన్నట్లు రైతులు తెలిపారు. దీంతో సాధారణంగా అయ్యే పెట్టుబడి కంటే అదనంగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోర్డు అధికారులు పొగనారు ధరలను నియంత్రించి అదనపు పెట్టుబడుల భారం నుండి ఉపశమనం కలిగించాలని రైతులు కోరుతున్నారు.

ఆటోలో రూ.50.. అంగట్లో 80!

● నింగినంటుతున్న టమోటా ధర



ఉదయగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు రోజురోజుకు పెరుగుతూనే ఉన్నాయి. మార్కెట్‌లో గత వారం రోజుల క్రితం కిలో రూ.40 పలికిన టమోటా ప్రస్తుతం నాణ్యతను బట్టి రూ.60, రూ.80కు విక్రయిస్తున్నారు. శుక్రవారం వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేల్ ప్రాంతం నుంచి ఓ వ్యక్తి ఆటోలో టమోటాలు తీసుకొచ్చి కిలో రూ.50 చొప్పున విక్రయించడం, మార్కెట్‌లో రూ.80 పలుకుతుండడంతో ప్రజలు ఎగబడి కొనుగోలు చేశారు. రానున్న రోజుల్లో టమోటా ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు అంటున్నారు.

వాల్మీకుల సమావేశాన్ని జయప్రదం చేయండి

ఉదయగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ కడప జిల్లా పోరుమామిళ్ల మదర్‌థెరిస్సా ఫౌండేషన్ హాలులో ఆదివారం జరిగే రాష్ట్రస్థాయి వాల్మీకుల సంఘ నాయకుల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఉదయగిరి వాల్మీకి సంఘ నాయకులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి వాల్మీకి సంఘ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని వారు కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 12128
వెండి కిలో ధర	రూ. 169000
వెండి ఒక గ్రాము	రూ. 174.00

రామాలయ నిర్మాణానికి భూమిపూజ



రామాలయ నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్న గ్రామస్థులు

సంగం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాల దొరువు గ్రామంలో సీతారాముల ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఉదయం భూమిపూజ చేశారు. గ్రామంలో సీతారాముల నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్థులు టీటీడీ శ్రీవాణి ట్రస్ట్‌కు పదిశాతం వాటా చెల్లించారు. దీంతో టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నుంచి ఆలయ నిర్మాణానికి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రూ. 50 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఆమేరకు ఆలయ నిర్మాణానికి వేదపండితుల ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు.

ఆకట్టుకున్న మాక్ అసెంబ్లీ



మాక్ అసెంబ్లీలో పాల్గొన్న విద్యార్థులు.

కలువాయి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు నిర్వహించిన మాక్ అసెంబ్లీ ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారంతో సభను ప్రారంభించారు. ఎమ్మెల్యేలు, మంత్రుల స్థానాల్లో విద్యార్థులు కొలువుతీరారు. ముందుగా ముఖ్యమంత్రికి విపక్ష ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం సభ్యులు అడిగిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానం ఇచ్చారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు ఆహ్వానించి యువతకు ఉద్యోగాలు కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని తెలియజేశారు. 9వ తరగతి విద్యార్థులు నిర్వహించిన మాక్ అసెంబ్లీ ఆసక్తికరంగా సాగింది.

ఉదయగిరి తాలుకా హంసా కార్యవర్గం ఎంపిక



నూతనంగా ఎంపికైన హంసా కార్యవర్గ సభ్యులు

ఉదయగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంసా) ఉదయగిరి తాలుకా యూనిట్ కో-ఆప్టేట్ కార్యవర్గాన్ని శుక్రవారం నెల్లూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సుధాకర్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపిక చేసింది. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడిగా గాజుల నౌషాద్‌బాబు, కార్యదర్శిగా షేక్ ఖాజామొహిద్దీన్, ఉపాధ్యక్షులుగా రబ్బానిబాషా, ఎం లావణ్య, మహిళా కార్యదర్శిగా ఎం చంద్రావతి, సంయుక్త కార్యదర్శులుగా కే జయమ్మ, ఎం శైలజను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు, పలువురు ఉద్యోగులు సన్మానించి అభినందనలు తెలిపారు.

గండిపాళెంలో పరిశుభ్రతకు శ్రీకారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

ఉదయగిరి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెంలో శుక్రవారం పంచాయతీ అధికారులు పారిశుధ్యం మెరుగుకు శ్రీకారం చుట్టారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'రహదారులే డంపింగ్ యార్డులు' అనే కథనానికి స్పందించిన ఎంపీడీవో బీ.శ్రీనివాసులు స్పందించారు. వెంటనే రహదారి పక్కన ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించడంతోపాటు గ్రామంలోనూ పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణయ్య గ్రీన్‌అంబాసిడర్లతో కలిసి ప్రధాన రహదారి పక్కనే చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రం చేశారు. ఈ నేపథ్యంలో అటుగా వెళ్ళే ప్రజలతోపాటు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఆత్మకూరు-సోమశిల రోడ్డును బాగుచేయాలి

● ఆటో కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

అనంతసాగరం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుంతలు పడి అధ్వానంగా మారిన ఆత్మకూరు-సోమశిల ప్రధాన రహదారి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఆటో కార్మికులు శుక్రవారం అనంతసాగరం బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. గుంతలు పడిన రోడ్డులో ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా ఉందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు వారికి మద్దతు తెలిపారు.

తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో దిత్వా తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి వచ్చేనెల 1వ తేదీ వరకు భారీ నుంచి అతి భారీవర్షాలు కురిసే అవకాశామున్నందున మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి తహసీల్దారు షాజియా శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాలు కురిసే సమయంలో అధిక నీటి ప్రవాహం వలన వాగులు, వంకలు, చెరువులు, నీటి కుంటలు పొంగిపొర్లి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యే అవకాశముందన్నారు. కావున మండల స్థాయి అధికారులు, సిబ్బంది వారు పనిచేసే స్థానాల్లో ఉండి ప్రజలకు అన్నివిధాల సహాయ సహకారాలు అందిస్తూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆమె సూచించారు.

నీరు నిలిచేదెలా..?

● చెరువులకు పలుచోట్ల లీకులు

● అధ్వానంగా తూములు, కాలువలు

● వృథాగా పోతున్న వర్షపు నీరు



జలకళ సంతరించుకున్న లింగాల చెరువు

ఉదయగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో రైతులు వర్షాధారంపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తారు. గత కొన్నేళ్లుగా అరకొర నీటితో ఉన్న వనరులు మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు కళకళలాడుతున్నాయి. అయితే చెరువులు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోక పోవడంతో తూములు, అలుగులు, కాలువలు దెబ్బతిని నీరు లీకేజీల రూపేణా వృథాగా పోతుండడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. దీంతో పుష్కలంగా నీరు ఉన్నా ఆయకట్టు భూములు బీళ్లుగా మారుతున్నాయి.

45 వేల ఎకరాల ఆయకట్టు

ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో సుమారు 250 చెరువులు ఉండగా వాటి కింద 45వేల ఎకరాల ఆయకట్టు భూములు ఉన్నాయి. ఉదయగిరి, సీతారామపురం మండలంలో 66 చెరువులు ఉండగా దాదాపు 90 శాతం చెరువులకు జలకళ సంతరించుకుంది. దుత్తలూరు, వరికుంటపాడు, వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాల్లో సైతం చెరువులు జలకళ సంతరించుకున్నాయి. అయితే తూముల షట్టర్లు దెబ్బతినడం, కాలువలు శిథిలమై కంప చెట్లతో నిండిపోవడంతో ఆయకట్టు భూములకు నీరు చేరే ప్రసక్తేలేదు.

ఇరిగేషన్ వ్యవస్థను నాశనం చేసిన వైసీపీ

గత వైసీపీ ప్రభుత్వం ఇరిగేషన్ వ్యవస్థను నాశనం చేసిందని ఇటీవల జరిగిన డీఆర్సీ సమావేశంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువులన్నీ మరమ్మతులకు గురై అలుగులు, కాలువలు, తూములు, కట్టల రివిట్‌మెంట్‌లు దెబ్బతిన్నాయన్నారు. గండిపాళెం, మర్రిపూట్లు, నక్కలగండి జలాశయాల కింద అధికారికంగా 20 వేల ఎకరాలు ఉన్నా అనధికారికంగా మరో 10వేల ఎకరాలు ఆయకట్టు భూములు ఉన్నాయి. ఈఏడాది మర్రిపూట్లు, నక్కలగండి జలాశయాలు పూర్తి నీటి సామర్థ్యానికి నోచుకోగా గండిపాళెం జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 35 అడుగులు కాగా 25 అడుగుల మేర నీరు చేరింది. అయితే ఆయా జలాశయాలు సైతం లీకులు ఉండడం, తూములు, కాలువలు సక్రమంగా లేకపోవడంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు చేరకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా రానున్న రోజుల్లో చెరువులు, జలశయాలకు మరమ్మతులు చేపట్టి లీకేజీలను నివారించి పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.



వెంకట్రావుపల్లి చెరువు తూము నుంచి వృథాగా పోతున్న నీరు

జ్యోతిరావు పూలేకి నివాళి



పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు, సిబ్బంది

సంగం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్, ఎంపీపీ పద్మావతమ్మ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావ్ పూలే వర్థంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏపీఎం రవిశంకర్‌రెడ్డి, మండల పరిషత్, వెలుగు కార్యాలయాల సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి



బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారి రాములు

ఏఎస్ పేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్కూల్ బస్సులకు ఫిట్నెస్ తప్పనిసరి అని ఆత్మకూరు రవాణా శాఖ అధికారి రాములు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక రాగూర్ పాఠశాల బస్సుల ఫిట్నెస్ పత్రాలను పరిశీలించారు. పాఠశాల నిర్వాహకులకు, బస్సు డ్రైవర్లకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ



క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వీవోఏలు

సంగం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షాలెట్ ఆధ్వర్యంలో థీమ్ -5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై వెలుగు వీవోఏలు, పొదుపు మహిళలకు శుక్రవారం ఒక్కరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్ర మంలో ఎంపీపీ పద్మావతమ్మ, డిప్యూటీ ఎంపీడీవో సురేష్ కుమార్, ఏపీఎం రవి శంకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వీవో ఏలు, సంఘమిత్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్ ఘాతుకం!

(5వ పేజీ తరువాయి)

ఆమె, ఆమె అనుచరులు కుమారుడితో ఒంటరిగా వస్తున్న సమయం చూసి ప్రణాళిక ప్రకారం మట్టుబెట్టినట్లు తెలుస్తోంది. కాగ పెంచలయ్యతోపాటు మరొకరిని కూడా హతమార్చాలని కామాక్షి టార్గెట్ చేసినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న అదనపు ఎస్పీ సౌజన్య, రూరల్ డీఎస్పీ శ్రీనివాసురావు, సీఐ గుంజి వేణు తమ సిబ్బందితో ఘటనాస్థలికి చేరుకున్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



ఘటనాస్థలిలో గుమికూడిన జనం

సీజేఎఫ్ఎస్ భూముల పరిశీలన



సీజీఎఫ్ఎస్ భూములను పరిశీలిస్తున్న అధికారులు

వింజమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కావలి, ఉదయగిరి జాతీయ రహదారికి ఆనుకుని ఉండే సీజేఎఫ్ఎస్ భూములను జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, కావలి ఆర్డీవో వంశీకృష్ణ, తహసీల్దారు హమీద్ శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 93ఎకరాల ప్రభుత్వ భూమిని అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారికి కేటాయింపుల్లో భాగంగా భూములను పరిశీలిస్తున్నామన్నారు. ఈసందర్భంగా జేసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రికార్డుపరంగా భూములను పరిశీలిస్తున్నామని, 2010 సంవత్సరంలో సీజేఎఫ్ఎస్ పట్టాలు రద్దయినట్లు గుర్తించామన్నారు. కొంతమంది గిరిజనులు ఇక్కడ సాగు చేస్తున్నారని వారికి పట్టా ఉన్నట్లయితే తగు న్యాయం చేస్తామన్నారు.

మీకు అండగా ఉంటా : ఎమ్మెల్యే కాకర్ల

కాగా, సీజేఎఫ్ఎస్ భూములు నుడా ఆధీనంలోకి పోవడంతో మాకు జీవనాధారం పోయిందంటూ ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వద్ద ఎస్టీ కాలనీవాసులు వాపోయారు. దీంతో జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లుతో ఎమ్మెల్యే చర్చించారు. అనంతరం కాకర్ల మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ భూకేటాయింపు చేస్తామని హామీ ఇచ్చారు.

అన్న క్యాంటీన్ నిర్మాణ పనుల పరిశీలన

వింజమూరు పట్టణంలో నిర్మిస్తున్న అన్న క్యాంటీన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్యాంటీన్ నిర్మాణం తుది దశకు చేరుకున్నట్లు తెలియజేశారు. మిగిలివున్న పనులను కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే కాకర్ల ఫోన్‌లో అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వంశీకృష్ణ, తహసీల్దారు హమీద్, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవర్చుకోవాలి



పాఠశాల ఆవరణలో వ్యర్థాలను తొలగిస్తున్న విద్యార్థులు

ఉదయగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే సేవాగుణం అలవర్చుకోవాలని ఎంపీడీవో బీ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు జాతీయ సేవా పథకం కింద కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని గండిపాళెం, వెంగళరావునగర్ గ్రామాల్లో సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారం రోజుల పాటు రెండు గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రత, పాఠశాలల్లో ప్రహరీలు, ప్రవేశ ద్వారాలకు సున్నం కొట్టడం, ఆరోగ్య, పశు, రక్తదాన శిబిరాలు, శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన సదస్సు చేపట్టడం జరుగుతుందన్నారు. తొలిరోజు పాఠశాలల ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలు, కలుపు నివారణ చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొండ్రు తిరుపతి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు డాక్టర్ ఎన్ సునీత, వెంకటేశ్వర్లు, పశు వైద్యాధికారి రాఘవేంద్రశర్మ, వ్యవసాయాధికారి విజయభాస్కర్, కళాశాల ఆచార్యులు దుర్గాప్రసాద్, లావణ్యకుమారి పాల్గొన్నారు.

ఏపీ ఎన్‌జీజీవో సభ్యత్వం నమోదు



సభ్యత్వం నమోదు చేస్తున్న ఏపి ఎన్‌జీజీవో అసోసియేషన్ సభ్యులు

ఏఎస్ పేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ ఆత్మకూరు డివిజన్ ప్రెసిడెంట్ బి శైలజ ఆధ్వర్యంలో శుక్రవారం ఏఎస్ పేటలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దారు అనిల్ కుమార్, డిప్యూటీ తహసీల్దారు వెంకటేశ్వర్లు, ఎంపిడివో ప్రసన్నకుమారి, ఏవో రేణుక తదితరులతో పాటు కార్యాలయ సిబ్బంది. పీహెచ్‌సీ కార్యాలయ అధికారులు, సిబ్బంది సభ్యత్వం నమోదు చేశారు. ఈకార్యక్రమంలో ఆత్మకూరు డివిజన్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్‌వి సుబ్బయ్య, ట్రెజరర్ సుప్రియ, ఫార్మసీ ఆఫీసర్ బి హైమవతి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిపై ప్రజాభిప్రాయ సేకరణ



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నేతలు

వింజమూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం మండలంలోని గోనుగుంట కల్యాణ మండపంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల, గ్రామ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రం వేళచ్చేరి నియోజకవర్గం ఎమ్మెల్యే హాసన్ మౌలానా ముఖ్య అతిథిగా, నెల్లూరు పార్లమెంటు అబ్జర్వర్‌గా విచ్చేశారు. గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని పటిష్టపరచాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దేవకుమార్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అనీల్, జిల్లా ముఖ్య నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరు రాజగోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ జగదీశ్, అన్నీ మండలాల కన్వీనర్లు, కో ఆర్డినేటర్లు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకు విద్యా సంస్థలు మద్దతు ఇవ్వాలి



ఆందోళనకు మద్దతు ఇవ్వాలని విద్యా సంస్థల యాజమ్యాలను కోరుతున్న యువకులు

కలువాయి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలాన్ని గూడూరు రెవెన్యూ డివిజన్‌లోకి అలాగే తిరుపతి జిల్లాకు మార్పు చేయాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా మండలంలోని యువత మరోసారి ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఈమేరకు శుక్రవారం అన్ని విద్యా సంస్థల యాజమాన్యాలను, వ్యాపారులను కలసి మద్దతు కోరారు. శనివారం ర్యాలీగా బయలుదేరి తహసీల్దారుకు వినతిపత్రం అందజేయనున్నట్లు, ర్యాలీలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కలువాయిని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించే వరకు ఆందోళనలను ఉధృతం చేస్తామని వారు తెలియజేశారు.

C.R.I.M.E N.E.W.S

పోలీసులమని చెప్పి చైన్ చోరీ

● 3 సవర్ల బంగారు గొలుసుతో ఉడాయింపు

● లబోదిబోమన్న వృద్ధురాలు

మనుబోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు అలవాటుపడిన కొందరు యువకులు మోటార్ సైకిళ్లపై వచ్చి చైన్ స్నాచింగ్‌లు చేయడం ఇటీవల సర్వసాధారణమై పోయింది. గడిచిన కొద్దినెలల్లోనే మండలకేంద్రమైన మనుబోలులో ఇలాంటి సంఘటనలు జరిగాయి. అయితే తాజాగా ఈ దఫా చోరులు పంథా మార్చారు. పోలీసు యూనిఫాంలో వచ్చి, బెదిరించి ఒంటరిగా ఉన్న వృద్ధులు, మహిళలను టార్గెట్ చేసుకున్నారు. బాధితురాలి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం మండల పరిధిలోని కొండూరు సత్రం వద్ద సాయిబాబా హోటల్ వద్దకు రెండు మోటార్‌సైకిళ్లపై నలుగురు యువకులు వచ్చారు. ఆ సమయంలో హోటల్‌కు చెందిన సజ్జా రాధారాణి అనే వృద్ధురాలు దుకాణం వద్ద ఉంది. ఆమె దగ్గరకు పోలీసు ప్యాంటు (ఖాకీ) ధరించి ఉన్న ఓ యువకుడు వచ్చాడు. నేను గూడూరు సీఐని, ఎస్పీ మేడం నెల్లూరు నుంచి గూడూరుకు వెళుతోంది. ఆమె అన్ని అంగళ్లు తనిఖీ చేస్తుంది. అంగళ్ళలో గుట్కాలు, పాన్‌పరాగ్‌లు అమ్మకండి, అవి తీసి లోపల పెట్టుకోండని చెప్పాడు. అలాగే నాయనా.. అంటూ వృద్ధురాలు తలూపింది. ఆమె మెడలో ఉన్న గొలుసును గమనించిన నకిలీ సీఐ ఒంటిమీద బంగారు అవి వేసుకోకండి.. దొంగలు తిరుగుతున్నారని చెప్పాడు. తర్వాత తీసేస్తాలే అని చెప్పగా.. 'కాదు ఇప్పుడే తీసేసి దాచేయండి' అని యువకుడు బలవంతం చేశాడు. ఆ సమయంలో వృద్ధురాలు కొడుకు, కోడలు ఇంట్లో భోజనం చేస్తున్నారు. దీంతో ఆమె మెడలోంచి 3 సవర్ల బంగారు దండ తీసి టేబుల్‌కు ఉన్న డ్రాలో దాస్తుండగా, 'నేను దాచిపెడతాను ఇవ్వండి' అంటూ దండను యువకుడి చేతిలోకి తీసుకున్నాడు. డ్రాలో పెట్టినట్లుగా నటించి, దండ, డ్రా తాళం తీసుకుని అక్కడినుండి యువకుడు, అతడి స్నేహితులు ఉడాయించారు. దీంతో వృద్ధురాలు గట్టిగా కేకలు వేయగా, కుటుంబసభ్యులు, స్థానికులు అక్కడికి వచ్చారు. అప్పటికే నలుగురు యువకులు గూడూరు మార్గం గుండా వెళ్ళిపోయారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీసీ కెమెరాల ద్వారా చోరుల ఆచూకీ తెలుసుకుంటామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరాకేష్ తెలిపారు.

జామాయిల్ కర్ర పట్టివేత



జామాయిల్ కర్ర లారీని పట్టుకున్న తహసీల్దార్, ఎస్ఐ

సీతారామపురం, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): మండలం లోని సింగారెడ్డిపల్లి గ్రా మ సర్వేనెంబర్ 447 లోని మేత పోరంబోకు భూమిలో గల జా మాయిల్ కర్రను అక్ర మంగా తరలిస్తున్న ఓ లారీని శుక్రవారం రాత్రి తహసీల్దార్ ఫజియా, ఎస్సై శివకృష్ణారెడ్డిలు స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోరంబోకు భూమిలో కొట్టిన జామాయిల్ కర్రను సింగారెడ్డిపల్లి గ్రామ సమీ పానగల భూముల్లో డంపింగ్ చేస్తుండగా స్థానికులు గమనించి అధికారులకు సమాచారం అందించారు. ఈమేరకు రెవెన్యూ అధి కారులు, పోలీసులు రంగ ప్రవేశం చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పందెం రాయుళ్ల అరెస్టు

ఇందుకూరుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చట్టివారిగ కండ్రిగలో కోడిపందాలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం ఎస్ఐ నాగార్జునరెడ్డి తన సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక కోడి, రూ. 2500 నగదు స్వాధీనం చేసుకున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఇద్దరికి జైలు శిక్ష

నెల్లూరు(లీగల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో నేరం రుజువుకావడంతో ఇరువురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ నెల్లూరు నగర మూడవ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి షేక్ అబ్దుల్ రెహమాన్ శుక్రవారం తీర్పు చెప్పారు. నెల్లూరు నగరం మూలపేటకు చెందిన ఫిర్యాది చెన్నారెడ్డి రామకృష్ణారెడ్డి కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లికి చెందిన రాజరాజేశ్వరి బాయిల్డ్ రైస్‌మిల్ మేనేజింగ్ పార్టనర్ కాండ్ర ప్రసన్న కుమార్‌రెడ్డి, పార్టనర్ ప్రతిమ ఇరువురు ఫిర్యాది రామకృష్ణారెడ్డి వద్ద 2016 జూన్ 11వ తేదీన రూ.25 లక్షల అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోట్ రాసి ఇచ్చారు. అప్పు తీర్చే క్రమంలో రూ.30 లక్షలకు 2019 ఆగస్టు 2వ తేదీన చెక్కు ఇచ్చారు. సదరు చెక్కును ఫిర్యాది ఆ మరుసటి రోజు (3వ తేదీ) బ్యాంకులో ప్రజంట్ చేయగా అది చెల్లలేదు. దాంతో ఫిర్యాది తన న్యాయవాది ద్వారా వారిరువురికి లీగల్ నోటీస్ ఇచ్చి కోర్టులో ఎన్ఐ యాక్ట్ కింది ప్రయివేట్ కంప్లయింట్ దాఖలు చేశారు. విచారణ కాలంలో నేరం రుజువు కావడంతో నిందితులిద్దరికీ పై విధంగా జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అలాగే చెక్కు మొత్తం రూ.30 లక్షలతోపాటు మరో రూ.30 లక్షల ఫిర్యాదికి పరిహారం కింద చెల్లించాలని తీర్పు చెప్పారు.

మతిస్థిమితం లేని మహిళపై లైంగిక దాడి

మనుబోలు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ మహిళపై 70 ఏళ్ళ వృద్ధుడు శుక్రవారం లైంగికంగా దాడి చేసిన ఘటన మండలంలోని గొట్లపాళెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గ్రామానికి చెందిన బుడగా పెంచలయ్య బుట్టలు, గంపలు అల్లుకుని జీవనం సాగిస్తుండేవాడు. శనివారం మద్యం సేవించి దళితవాడలో ఉన్న ఓ వ్యక్తితో మాట్లాడేందుకు వెళ్ళాడు. ఆ సమయంలో ఆయన ఇంట్లో లేడు. ఆయన మనవరాలు (మతిస్థిమితం లేని మహిళ) ఇంట్లో ఒక్కటే ఉంది. దీంతో పెంచలయ్య ఆమెపై లైంగికదాడికి ప్రయత్నించాడు. కొద్దిసేపటి తరువాత ఆమె ఇంట్లోనుంచి పెంచలయ్య రావడాన్ని గమనించిన స్థానికులు ఇంట్లోకి వెళ్ళి గమనించారు. దీంతో మహిళపై లైంగిక దాడి జరిగినట్లు గుర్తించారు. పెంచలయ్య కోసం గాలించి అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మహిళ మెడలో బంగారు సరుడు అపహరణ

నెల్లూరు(క్రైం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రొవిజన్స్ షాపునకు వెళ్లిన మహిళ మెడలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి బంగారు సరుడు, మంగళసూత్రంను అపహరించుకెళ్లిన ఘటన పడారుపల్లి ప్రాంతంలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. పడారుపల్లి ప్రాంతంలో నాటకరాని శ్రీదేవి, శ్రీనివాసులు దంపతులు నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి శ్రీదేవి కోడిగుడ్లు తెచ్చుకునేందుకు ప్రొవిజన్స్ షాపునకు వెళ్లింది. చెన్నకేశవ స్వామి గుడి దగ్గరకు వెళ్లేసరికి పక్క వీధిలో నుంచి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై ఆమెకు ఎదురుగా వచ్చి ఆమె మెడలోని సుమారు 29 గ్రాముల బంగారు సరుడు, మంగళ సూత్రం తెంచెకెళ్లారు. సరుడు తెంపుకెళ్లే సమయంలో మహిళ గట్టిగా పట్టుకున్నా ఇద్దరు నిందితులు లాక్కుంటూ వెళ్లడంతో ఆమె కింద పడి గాయపడ్డారు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చేలోపు నిందితులు పరారయ్యారు. జరిగిన విషయాన్ని తన భర్తకు తెలపడంతో శుక్రవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



హెల్మెట్ తప్పనిసరిగా ధరించండి!

అల్లూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు రెడ్డి సూచించారు. శుక్రవారం అల్లూరు ప్రధాన కూడలి, వైఎస్సార్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద యువతకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకపోవడంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది హరికృష్ణ, ద్విచక్రవాహనదారులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

కావలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు తాము జీవించి ఉన్నట్లు ప్రతి సంవత్సరం నిర్దిష్టకాలంలో పంపించే లైఫ్ సర్టిఫికెట్లు జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే పంపించాలని కావలి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల రమణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు, డిసెంబరు నెలల్లో పంపించాలని కొందరు అపోహపడుతున్నారని, అలా పంపిన సర్టిఫికెట్లు చెల్లవన్నారు. జనవరి 1నుంచి ఫిబ్రవరి28 లోపల మాత్రమే సమర్పించాలన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ ఆరోగ్యం కోసం పూజ

కావలి (టౌన్) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే, కావలి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని వైసీపీ శ్రేణులు, అభిమానులు శుక్రవారం గ్రామ దేవత కలుగోళమ్మ ఆలయంలో కుంకుమ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కనమర్లపూడి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రసాద్‌నాయుడు అంత్యక్రియల్లో కాకర్ల

జలదంకి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం గట్టుపల్లి పంచాయతీ చింతలపాలెంలో హత్యకు గురైన టీడీపీ నాయకుడు గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు అంత్యక్రియలు శుక్రవారం జరిగాయి. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరై ప్రసాద్ మృతదేహానికి నివాళులర్పించారు. ప్రసాద్‌నాయుడు హత్య వెనుకు ఎంతటి వారున్నా చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. కాగా ప్రసాద్ అంత్యక్రియల్లో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను రూపుమాపాలి : సీడీపీవో



బాల్య వివాహాలు అరికడదామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ఉలవపాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను రూపుమాపాలంటే ఆడపిల్లలకు చదువు ఒక్కటే మార్గమని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో డీ మాధవీలత పేర్కొన్నారు. వీరేపల్లిలోని ఆదర్శ పాఠశాలలో శుక్రవారం బాల్య వివాహాలు, గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు మాత్రమే వివాహం చేయాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతుంటే దగ్గరలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు తెలియచేయాలని సూచించారు. అదేవిధంగా బాల్య వివాహాల వలన భవిష్యత్‌లో కలిగే నష్టాలను తల్లిదండ్రులకు తెలియపరచాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం బాల్య వివాహాలు అరికడదాం అంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కే రమాదేవి, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దగదర్తి (బిట్రగుంట) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ జలదంకి శ్రీహరినాయుడు అన్నారు. దగదర్తి మండలం కేకేగుంట గ్రామ టీడీపీ ఇన్‌చార్జి అంబటి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ పార్టీ అధ్యక్షుడు నగళ్ళ సుధాకర్ 'రైతన్నా మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారులతో కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల యూనిట్ ఇన్‌చార్జి మారుబోయిన వేణుగోపాల్, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎండోటి తిరుపతి, స్థానిక టీడీపీ నేతలు దొడ్ల దయాకర్, వల్లేపుమల్లి, రాంప్రసాద్, వ్యవసాయ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నేత శ్రీహరినాయుడు

గ్రాంట్ ఇస్తేనే.. వస్తాం!

- మొదట రసాభాస.. చివరికి సుఖాంతం
- పెద్దన్న పాత్ర పోషించిన జెట్పీటీసీ
- పాలకుల కోసం అధికారుల ఎదురుచూపులు
- ఆలస్యంగా సాధారణ సర్వసభ్య సమావేశం.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీదేవి

కావలి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు మండల గ్రాంట్ ఇస్తేనే సాధారణ సర్వసభ్య సమావేశానికి హాజరవుతామని ఎంపీటీసీలు పట్టుబట్టారు. సమావేశ మందిరానికి రాకుండా ఎంపీపీ క్యాబిన్లో చర్చలు జరిపిన ఉదంతం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం చోటు చేసుకుంది. దీంతో ఉదయం 11 గంటలకు జరగవలసిన సమావేశం మధ్యాహ్నం 1 గంటకు జరిగింది. అధికారులు 10 గంటల నుండి పడిగాపులు కాయగా, 11 గంటలు వచ్చిన ఎంపీటీసీలు సమావేశ మందిరానికి రాకుండా ఎంపీపీ ఆలూరు కొండమ్మ క్యాబిన్‌కు చేరుకుని గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేస్తేనే సమావేశానికి వస్తామని రసాభాస చేశారు. దీంతో జెట్పీటీసీ జంపాని రాఘవులు పెద్దన్న పాత్ర పోషించాడు. అధికారులను సమన్వయం చేస్తూ ఎంపీటీసీలకు సర్దిచెప్పటంతో చివరకు సమావేశం 1 గంటకు జరిగింది. మండల గ్రాంట్ నిధులు ఎంపీపీలకు ఇవ్వలేదని సమావేశానికి రాకుండా ఎంపీటీసీలు బాయ్‌కాట్ చేశారు. సమావేశం నిర్వహణపై అధికారులు సందిగ్ధంలో ఉండగా ఎంపీపీ క్యాబిన్‌కు చేరుకున్న ఎంపీడీవో శ్రీదేవి ఎంపీటీసీలతో చర్చించారు. గ్రాంటు వచ్చిన తరువాత ఇస్తామని చెప్పటంతో సమావేశానికి ఎంపీటీసీలు హాజరయ్యారు. మండల గ్రాంట్ వచ్చిన తరువాత పనులు ఇస్తామని ఎంపీటీసీలకు చెప్పడంతో వారు తీర్మానం రాసిచ్చారు. ఇప్పటివరకు ఎంత గ్రాంట్ వచ్చింది? ఏమేమి పనులు చేశారో చెప్పాలని సభ్యులు ఎంపీడీవోను కోరగా కార్యాలయ ఏవో శెలవులో ఉన్నారని, వచ్చిన తరువాత నివేదిక ఇస్తామని చెప్పారు. అనంతరం అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెట్పీటీసీ జంపాని రాఘవులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పంచాయతీ అభివృద్ధి అధికారులు, అన్నిశాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్టీవో నాగలక్ష్మి

రహదారి భద్రతపై విద్యార్థులకు అవగాహన

కందుకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో రవాణాశాఖ అధికారులు శుక్రవారం రహదారి భద్రత - మనందరి బాధ్యత అనే అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు, కళాశాల అధ్యాపకులనుద్దేశించి ఆర్టీవో టీవీఎస్ నాగలక్ష్మి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విధిగా పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపటం, విశ్రాంతరహితంగా వాహనం నడపటం పూర్తిగా నిషిద్ధమని, ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా ప్రమాదాల సమయంలో అత్యవసర ద్వారాలను వినియోగించటం, అత్యవసర సమయా ల్లో పరికరాల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రతి బస్సులో అగ్నిప్రమాదాల నివారణ పరికరం, ఫస్ట్‌ఎయిడ్ కిట్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ జే. అనీల్‌కుమార్, ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ సీహెచ్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆర్టీవో టీవీఎస్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ కార్యక్రమం నిర్వహించి రహదారి భద్రతకై పాటించాల్సిన నిబంధనలపై డ్రైవర్లకు సూచనలు చేశారు.

- **ఉలవపాడు:** రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా శుక్రవారం ఆటోడ్రైవర్లు, ప్రభుత్వ జూనియర్ కాలేజి విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు ఎస్సై అంకమ్మ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీస్తాయన్నారు. ముఖ్యంగా ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని సౌండ్ బాక్సులతో అతివేగంగా వెళ్లడం కూడా ప్రమాదాలకు ప్రధాన కారణంగా పేర్కొన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే కేసులు నమోదుచేస్తామన్నారు. మైనర్ పిల్లలు, లైసెన్స్ లేని వ్యక్తులు ఆటోలు నడపడాన్ని ప్రోత్సహించిన వారిపై కూడా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు లోబడి ఆటోలు నడపాలని డ్రైవర్లకు సూచించారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై అంకమ్మ

స్వచ్ఛ ఆర్టీసీ అందరి లక్ష్యం కావాలి

- ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి



కార్మికులు, ఆర్టీసీ అధికారులతో జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి

కావలి, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆర్టీసీ అందరి లక్ష్యం కావాలని ఆర్టీసీ నెల్లూరు జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి తెలిపారు. కావలి ఆర్టీసీ డిపో గ్యారేజిని శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించారు. గ్యారేజీ శుభ్రత, నిర్వహణపై పలు సూచనలు చేశారు. గ్యారేజీలో పనిచేస్తున్న సీనియర్ మెకానికల్ సిబ్బంది, ఒప్పందపు కార్మికులను ఆయన సత్కరించారు. గతంలో 65 శాతం ఉన్న ఆక్యుపేషన్ రేషియో100 శాతానికి పైగా పెరిగిందన్నారు. పారిశుధ్య విభాగంలో పనిచేసే సిబ్బందికి పీఎఫ్, ఈ ఎస్‌ఐ సౌకర్యం కూడా కల్పించామన్నారు. బస్టాండులో ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్, నూతన మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజరు ఆదినారాయణ, ఏఈ మల్లికార్జున, అసిస్టెంట్ మేనేజర్ కల్పన, బస్టాండ్ మేనేజర్ రామక్రిష్ణ, పలువురు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మా కుంటుంబ కలహాలతో

రవికుమార్‌కు సంబంధం లేదు

- చేజర్ల మహేశ్వర రెడ్డి

కావలి (టౌన్) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమ కుటుంబ కలహాలతో టీడీపీ నేత పమిడి రవికుమార్ చౌదరికి ఎటువంటి సంబంధం లేదని, ఆయనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని చేజర్ల మహేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జర్నలిస్ట్ క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో మహేశ్వర రెడ్డి తన తల్లితండ్రులతో కలిసి మాట్లాడారు. తన భార్య గీతాంజలి చేసిన ఆరోపణలపై వివరణ ఇచ్చారు. 2016లో తనకు గీతాంజలితో వివాహం జరిగిందని, అప్పటినుంచి కొద్ది రోజులు సజావుగా కాపురం సాగిందన్నారు. అకారణంగా తనపై ఆరోపణలు చేసేదని, పెద్దల సమక్షంలో అనేక సార్లు రాజీ ప్రయత్నాలు చేసినా కాపురానికి రాలేదన్నారు. స్వగ్రామమైన దగదర్తి మండలంలో పమిడి రవికుమార్ చౌదరి తనకు భూమిని కౌలుకిచ్చాడన్నారు. ఆయనకు చెందిన ఇంటిలోనే నివాసముంటున్నామన్నారు. తమ కుటుంబానికి అండగా ఉన్నాడన్న అక్కసుతో కుటుంబ కలహాల్లోకి ఆయనను లాగి ఆరోపణలు చేస్తున్నారన్నారు. తన భార్య ప్రవర్తన నచ్చక విడాకులకు దరఖాస్తు చేశానన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, మన్నెమాల సుకుమార్ రెడ్డి, మనుబోలుపాడు సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి ప్రోద్భలంతో పమిడిపై కేసు నమోదు చేయించారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చేజర్ల మహేశ్వర రెడ్డి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత!

బిట్రగుంట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాలుష్యాన్ని అరికట్టేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని టీడీపీ మండలాధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బోగోలు మండలం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో జయమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసులు, వీఆర్వో సింగారయ్య, ఎంపీడీవో సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు నవీన్‌కుమార్, సరిత తదితరులు పాల్గొన్నారు.



'పచ్చదనం - పరిశుభ్రత'లో భాగస్వాములు కావాలి

కొండాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం- పరిశుభ్రత కార్యక్రమంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆదినారాయణరావు పేర్కొన్నారు. థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌లో భాగంగా శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వెలుగు వీవోఏలు, పొదుపుసంఘాల లీడర్లకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ఆదినారాయణరావు

కావలి టిడ్కో గృహాల్లో కార్డెన్ సెర్చ్

అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు సహకరించాలి : కావలి డీఎస్పీ శ్రీధర్

కావలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నేరాలు, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణలో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్డెన్ సర్చ్ నిర్వహిస్తున్నట్లు కావలి డీఎస్పీ పీ. శ్రీధర్ తెలిపారు. రూరల్ సర్కిల్ పరిధిలోని మద్దూరుపాడు టిడ్కో గృహాలలో శుక్రవారం ఉదయం రూరల్ సీఐ రాజేశ్వరరావు సీఐలు, ఎస్‌ఐలతో కలిసి డీఎస్పీ శ్రీధర్ కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గృహాల్లో నివసించేవారి వివరాలు, వేలిముద్రలు సేకరించారు. ఇళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మారణాయుధాలు, పేలుడు పదార్థాలు, గంజాయి, అక్రమ మద్యం వంటివి ఏమైనా ఉన్నాయా? అని పరిశీలించారు. సరైన పత్రాలు లేని 23 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అసాంఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా ఈ తనిఖీలు చేపట్టామన్నారు. అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన ఏ సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా నిర్వహిస్తున్న కార్డెన్ సెర్చ్‌కు ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఫిరోజ్, గిరిబాబు, పాపారావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



టిడ్కో గృహాల్లో ఉన్న వారితో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

నేడు జిల్లా హ్యాండ్‌బాల్ జట్ల ఎంపికలు

నెల్లూరు(విద్య), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులోని ఏబీఎం కాంపౌండ్‌లో ఈనెల 29న జిల్లా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మెంటా సునీల్, ఎన్ విక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-15 బాలికలకు, అండర్-19 బాలురకు జరిగే పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తామన్నారు.

పైపులైన్ లీకై తాగునీరు వృథా



లింగసముద్రం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాలలోని తాతా హోటల్ సెంటర్ వద్ద రాళ్లపాడు-రేళ్లపాడు మంచినీటి పథకానికి చెందిన వాల్వ్ వద్ద పైపులైన్ లీకై తాగునీరు వృథాగా పోతోంది. సుమారు 15 రోజుల నుంచి ఈవిధంగా నీరు లీకై వృథాగా పోతుండడంతో ఈ వాల్వ్ వద్ద బురదగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. అంతేగాక ఈనీరు రోడ్డు పక్కన చేరి మురికి గుంటగా మారడంతో బస్సులు కూడా ఈ సెంటర్‌లో ఆపకుండా కొంచెం ముందు ఆపుతున్నారు. ఈ సెంటర్ మూడు రోడ్ల కూడలి కావడంతో పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మురికి గుంట దోమలకు ఆవాసంగా మారి సాయంత్రం అయ్యిందంటే దోమలు విజృంభిస్తున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రబాబు, లోకేష్‌కు ఎమ్మెల్యే ఇంటూరి కృతజ్ఞతలు

కందుకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలుపుతూ రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌లను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన జిల్లాల పునర్విభజన కోసం ఏర్పాటుచేసిన క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులను కూడా కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తూ సముచిత నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు కూటమి ప్రభుత్వానికి అండగా నిలుస్తారన్నారు. కాగా, కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో విలీనం చేస్తున్న సందర్భంగా శనివారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును ఘనంగా సత్కరిస్తున్నట్లు పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

జ్యోతిరావు పూలేకు ఘన నివాళి

కందుకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా శుక్రవారం కందుకూరు డివిజన్ బీటీఏ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా నివాళులర్పించారు. కోవూరు రోడ్డు కూడలిలో ఉన్న పూలే విగ్రహానికి బీటీఏ నాయకులు కళ్లగుంట మోహనరావు నేతృత్వంలో పలువురు ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అణగారిన వర్గాల ప్రజలకు అక్షరజ్ఞానం నేర్పించేందుకు మహాత్మా జ్యోతిరావు పూలే చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో బీటీఏ నాయకులు పి గంగయ్య, చొప్పర కొండలరావు, గుడిపూడి అంజయ్య, రవీంద్ర, శ్రీనివాసులు, గాలంకి మాల్యాద్రి, గుంతటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో..

కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి శుక్రవారం ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ డెరెక్టర్ చిలకపాటి మధుబాబుల ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ముచ్చు వేణు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, బెజవాడ ప్రసాద్, వడ్డెళ్ల రవిచంద్ర, ముచ్చు శ్రీను, చుండూరి శ్రీను, భవనాసి వెంకటేశ్వర్లు గుమ్మా శివ, పసుపులేటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలేకి ఘన నివాళి

కావలి (టౌన్) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలో పలువురు నివాళులర్పించారు. బీసీ ఐక్యతాభవన్ ఆధ్వర్యంలో ట్రంకురోడ్డు ఆర్టీసీ డిపో ఎదురుగానున్న పూలే విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏరియా వైద్యశాల బ్లడ్‌బ్యాంక్‌లో జరిగిన రక్తదాన శిబిరంలో పలువులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీసీ ఐక్యతాభవన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిన్ని వరప్రసాద్, గౌరవాధ్యక్షుడు గోవిందు, ప్రధాన కార్యదర్శి పరిశుద్ధరావు, అబిసాగర్, సామాజిక కార్యకర్త మాల కొండారెడ్డి, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో బీజేపీ సీనియర్ నాయకులు కుట్టుబోయిన బ్రహ్మానందం, పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్, స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు. టీడీపీ పట్టణ కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, నాయకులు అమరా వేదగిరి, జ్యోతి బాబురావు, పోట్లూరు శ్రీనివాసులు, బాలగురుస్వామి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ నేతలు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కనమర్లపూడి నారాయణ, గంధం ప్రసన్న, కుందుర్తి శ్రీనివాసులు, షాహుల్ హమీద్ పూలేకు ఘననివాళులర్పించారు. యువ న్యాయవాదులు బెజవాడ అభిసాగర్, గుంజి నరేష్, రామ్ వినోద్‌కుమార్, అనుమలశెట్టి శ్రీనివాసులు, సుకుమార్ జర్నలిస్ట్ బాబూరావు తదితరులు పూలే విగ్రహం వద్ద నివాళులర్పించారు.

సర్వాయపాలెం జడ్పీ స్కూల్లో..

కావలిరూరల్, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): కావలిరూరల్ మండలం సర్వాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సభ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలికల కోసం దేశంలో మొట్టమొదటిసారిగా పాఠశాలను ప్రారంభించిన ఘనత పూలేకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



కందుకూరు టీడీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



పూలే విగ్రహానికి పూలమాల వేసి జోహార్లు అర్పిస్తున్న బీటీఏ నాయకులు, ఉపాధ్యాయులు



కావలిలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్ళపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

తీరం దిశగా కదులుతున్న దిత్వా

వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు

కలెక్టరేట్‌తో పాటు మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ముంచుకొస్తోంది. దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఇప్పటికే వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో శని, ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీతెలిపింది. శ్రీలంకను ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో తుఫాన్‌గా ఏర్పడి తీరం వెంబడి 50 కిలోమీటర్ల వేగంతో గాలి వీచే అవకాశంఉందని వాతావరణశాఖ చెబుతోంది. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. మండల, రెవెన్యూ డివిజన్ కేంద్రాలతో పాటు కలెక్టరేట్‌లోను కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తుఫానుతో ఇబ్బంది కలిగినా.. ముంపునకు గురైనా ఎప్పటికపుడు సమాచారాన్ని కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌కు 0877-2236007లో సమాచారం ఇవ్వాలి. క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు ఆదేశించారు. దిత్వా తుఫాను నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలతో కలెక్టర్ వెంకటేశ్వర్ టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. తీర.. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అవసరమైతే తాత్కాలిక పునరావాస కేంద్రాలను సిద్ధంచేసి, తాగునీరు, ఆహారం, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జలపాతాలు, వాగులు, నదీప్రాంతాలు, ప్రమాదకర పర్యాటక ప్రాంతాలను తాత్కాలికంగా మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. అన్నిశాఖల సమన్వయంతో తుఫానుతీవ్రతను తగ్గించేలా.. ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కాగా, మూడు రోజుల పాటు సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని మత్స్యకారులకు ఆ శాఖ అధికారి రాజేష్ సూచించారు.



కాళంగి జలాశయం

మూడు గేట్ల ఎత్తివేత

కేవీబీపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కాళంగి జలాశయంలో నీటి మట్టం పెరగడంతో శుక్రవారం ఉదయం 18 గేట్లలో మూడింటిని రెండు అడుగుల చొప్పున పైకి లేపి నీటిని దిగువకు వదిలారు. ఈ సీజన్‌లో 217 అడుగులు మాత్రమే జలాశయంలో నీరు నిల్వ ఉంచాలనే అంచనాల ప్రకారం మిగతా నీటిని దిగువకు వదిలారు. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో వర్షాలు పడితే నీటి మట్టం పెరగవచ్చని, ముందస్తు చర్యల్లో భాగంగా గేట్లు ఎత్తినట్లు ఏఈ నబియా తెలిపారు.


తూపిలిపాళెం తీరంలో ఎగిసి పడుతున్న కెరటాలు


తీరంలో ఎగిసిపడుతున్న కెరటాలు

వాకాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా వాకాడు మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరంలో అలలు ఎగిసిపడుతున్నాయి. ఈదురుగాలులు వీస్తూ కెరటాలు బలంగా తీరాన్ని తాకుతున్నాయి. దీంతో మత్స్యకారులు వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వేట ఆగడంతో మత్స్యకారులకు జీవనోపాధి దెబ్బతింది. తీరప్రాంతాలలో వీస్తున్న చలిగాలులకు వృద్ధులు, పిల్లలు వణికిపోతున్నారు.

వరి రైతుకు వెన్నుపోటు

నకిలీ విత్తనాలతో మోసపోయిన రైతులు


20 రోజులకే వెన్ను తీసిన వరిపైరు



రైతులు కొన్న విత్తనాల సంచులు

మిరప, వేరుశనగ, పత్తి రైతులు నకిలీ విత్తనాలతో మోసపోయారని వింటుంటాం. ఇప్పుడా పరిస్థితి వరి రైతులకీ దాపురించింది. సూళ్లూరుపేట మండలంలో బీపీటీ 2752 రకం విత్తనాలు కొని నార్లుపోసి వరి నాటుకున్న రైతులు దారుణంగా మోసపోయామంటూ లబోదిబోమంటున్నారు. విత్తనాలు అమ్మిన దుకాణాదారు, వ్యవసాయాధికారులు మాత్రం విచారిస్తాం, కంపెనీ వారిని రప్పిస్తాం, పరిహారం ఇప్పిస్తాం అని తాపీగా సమాధానాలు చెబుతున్నారు.

- సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

సూళ్లూరుపేటలోని ఒక ప్రయివేటు దుకాణంలో బీపీటీ 2782 (జిలకర మసూరాలో ఒక రకం) విత్తనాలను సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో రైతులు కొనుగోలు చేశారు. విత్తనాల సంచులపై అన్నపూర్ణ సీడ్స్, నంద్యాల అని ఉంది. ఇదేమి రకమని అడిగితే, కొత్త రకం విత్తనాలు మంచి పంట వస్తుందని దుకాణ యజమాని చెప్పారని రైతులు అంటున్నారు. ఈ విత్తనాలతో నాట్లు పోసుకున్నారు. నారు పచ్చగా చిక్కగా ఎదిగింది. 30 రోజుల నారుని పెరికి పొలాల్లో నాటుకున్నారు. 20 రోజులకే పైరు వెన్నుతీయడం మొదలైంది. సాధారణంగా 60 రోజులకు కానీ వెన్నురాదు. పైగా వెన్నులోనూ గింజల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ముందుగానే వెన్నుతీసిన పైరులో గింజ గట్టిపడదని, పంట రాదని అర్థమైన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణానికి పరుగులు తీశారు. 'ఎవరికి చెప్పొద్దు కంపెనీ వారితో మాట్లాడి ఎకరాకి రూ.2వేలు ఇప్పిస్తా' అని వారు సమాధానపరిచారు. ఈ విషయాన్ని వ్యవసాయాధికారి దృష్టికి తీసుకెళ్లారు. 'పరిశీలిస్తాం.. న్యాయం చేస్తాం' అంటూ వారం రోజులు గడిపేశారని రైతులు చెబుతున్నారు. లక్షలు ఖర్చు చేసి చేసిన సేద్యం అప్పులు మిగిలించిందని ఆవేదన చెందుతున్నారు. సూళ్లూరుపేట మండలంలోని మన్నెముత్తేరి, గంపలకండ్రిగ, పెద్దఉల్లాపవడ, మంగళంపాడు ప్రాంతాల్లో ఈ పరిస్థితి కనిపిస్తోంది. దాదాపు 80 మంది రైతులు 200 ఎకరాలకు పైగా ఈ నకిలీ విత్తనాలతో మోసపోయి తీవ్రంగా నష్టపోయారు. వానలు పడుతూ ఉండడంతో ఇంకా పలు గ్రామాల్లో వరినాట్లు జరుగుతున్నాయి. వీటిలో ఎందరు ఇలా మోసపోయారో తెలియాల్సివుంది.

నిండా మోసపోయా



నేను 10 ఎకరాలు వరిసాగు చేస్తున్నాను. బీపీటీ 2782 రకం విత్తనాలు కొనుగోలు చేసి నాటా. మొత్తం సాగుకు రూ2 లక్షలు పెట్టుబడి ఖర్చు అయ్యింది. నాటిన 20 రోజులకే వెన్ను తీసేసింది. ఆ ఎన్నులో 10 నుంచి 15 గింజలు మాత్రమే ఉన్నాయి. పూర్తిగా నష్టపోయా.

- కొమ్మనగుంట శ్రీనివాసులు, మంగళంపాడు రైతు


వెన్నుతీసిన పైరును ఏవో కాంచనకు చూపిస్తున్న రైతులు

పరీక్షలు చేయిస్తాం

దుకాణ యజమాని ద్వారా కంపెనీ వారిని పిలిపించి పొలాలను పరిశీలించాం. వెన్నుతీసిన మాట వాస్తవమే. శాస్త్రవేత్తలను పిలిపించి పరీక్షలు చేయిస్తాం. సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చేస్తాం.

- కాంచన, మండల వ్యవసాయ అధికారి

న్యాయం చేయండి



ఈ విత్తనాల కొనుగోలు చేసి 4 ఎకరాలు వరినాట్లు వేశా. 19 రోజులకే ఎన్ను తీయడంతో పోసపోయానని అర్థమైంది. ఇవి నకిలీ విత్తనాలని షాపు యజమాని వద్దకు వెళ్లాను. వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. దాదాపు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టాను. న్యాయం చేయాలి.

- గంపల చలపతి, గంపలకండ్రిగ రైతు

స్పోర్ట్స్ విలేజ్

- దామినేడులో 28 ఎకరాల కేటాయింపు
- పలమనేరు ఏఎంసీకి 33 ఎకరాల వెటర్నరీ వర్సిటీ భూములు
- మంత్రిమండలిలో నిర్ణయాలు

తిరుపతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జాతీయ స్థాయి క్రీడా మౌలిక వసతుల ఏర్పాటు దిశగా కీలక అడుగు పడింది. తిరుపతి రూరల్ మండలం దామినేడు వద్ద స్పోర్ట్స్ విలేజ్‌కు 28 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఈ మేరకు శుక్రవారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఆమోదముద్ర వేసింది. దామినేడులో 193-8, 193-9 తదితర సర్వే నంబర్లలోని 28.37 ఎకరాలను శాప్‌కు కేటాయించేందుకు క్యాబినెట్ అంగీకరించింది. ఈ భూమిలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనున్నారు. అందులో భాగంగా జాతీయ ప్రమాణాలతో క్రీడల అభివృద్ధికి మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. ఈ భూములకు ఎకరా రూ.2.50 కోట్లు చొప్పున కలెక్టర్ వెంకటేశ్వర్ మార్కెట్ విలువ సిఫారసు చేసినప్పటికీ ప్రభుత్వం ఉచితంగా భూములను క్రీడల కోసం కేటాయించింది. దీనిపై సీఎం చంద్రబాబుకు శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. స్పోర్ట్స్ విలేజ్‌గా సీఎం నామకరణం చేశారని, క్రీడాంధ్రప్రదేశ్ రూపకల్పనలో ఈ నిర్ణయం ఒక కీలక మైలురాయి కానుందని అభిప్రాయపడ్డారు.

- తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ యూనివర్సిటీకి చెందిన 33 ఎకరాలను పలమనేరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి బదిలీ చేసేందుకు కూడా మంత్రిమండలి అంగీకరించింది. వెటర్నరీ వర్సిటీ పరిధిలోని పలమనేరు లైవ్ స్టాక్ రీసెర్చి స్టేషన్ ఆధీనంలో ప్రస్తుతం ఆ భూములున్నాయి. ఆ భూములకు అవసరమైన పరిహారాన్ని కూడా పలమనేరు మార్కెట్ కమిటీ ఇప్పటికే చెల్లించింది. ఈ నేపథ్యంలో ఆ భూములను మార్కెట్ కమిటీ ఏర్పాటుకు కేటాయిస్తూ మంత్రిమండలి నిర్ణయం తీసుకుంది.



యూడైస్ నమోదులో తప్పులు చేయొద్దు

- 6 వరకు టెన్త్ పబ్లిక్ పరీక్షల రుసుం చెల్లింపు గడువు పెంపు

తిరుపతి(విద్య), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థులకు సంబంధించిన ఫొటోలు, సంతకం, మోల్స్ తదితర వివరాలను యూడైస్‌లో నమోదు సమయంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ప్రధానోపాధ్యాయులు చూసుకోవాలని డీఈవో కుమార్ శుక్రవారం సూచించారు. ఇతర వివరాలకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనరును సంప్రదించాలన్నారు. ఇక, టెన్త్ పబ్లిక్ పరీక్షలకు ఫీజు చెల్లింపు గడువును డిసెంబరు 6వ తేది వరకు ప్రభుత్వం పొడిగించిందన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయుల లాగిన్ నుంచి అధికారిక వెబ్‌సైట్ bse.ap.gov.in ద్వారా మాత్రమే రుసుములు చెల్లించాలని ఆయన సూచించారు. అపరాధ రుసుములతో డిసెంబరు 15వరకు చెల్లించొచ్చన్నారు. ఆఖరి తేదీ వచ్చేవరకు చూడొద్దని సూచించారు.

కన్నీళ్లొస్తున్నాయ్..!

- ఇచ్చిన మాటకు కట్టుబడే ఉంటా
- నెల్లూరు జిల్లాలో గూడూరు విలీనంపై పోరాడతానన్న ఎమ్మెల్యే పాశం



'గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని ఎన్నికల ముందు నుంచీ ప్రజలకు మాటిచ్చా. దీనికోసం పోరాడుతూనే ఉన్నా. ప్రజల కోరిక నెరవేరకపోవడం, ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేనందుకు కన్నీళ్లొస్తున్నాయ్. రాజకీయాలు శాశ్వతం కాదు. అవసరమైతే వదులుకునే పరిస్థితిలో ఉన్నా. టీడీపీ అధినాయకత్వాన్ని ఒప్పిస్తా. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకునే వరకు పోరాడుతూనే ఉంటా'నంటూ గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆవేదన చెందారు. కోట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రజాదర్బార్‌లో ఆయన భావోద్వేగంతో మాట్లాడారు. 'గూడూరును నెల్లూరుజిల్లాలో కలపాలని రెండు పర్యాయాలు అసెంబ్లీలో ప్రస్తావించా. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కూడా ఎన్నికలకు ముందు ఈ హామీ ఇచ్చారు. ఈ విషయంలో పరిస్థితులన్నీ అనుకూలంగా వచ్చి గూడూరు నియోజకవర్గ ప్రజలు సంబరాలు చేసుకునే సమయంలో ఏం జరిగిందో కానీ, చివరిక్షణంలో ఆగింది. కన్నీళ్లు ఆపుకోలేని పరిస్థితిలో ఉన్నా. గూడూరు నియోజకవర్గ ప్రజలకు జరిగిన అన్యాయంపై 20 మంది మంత్రులకు ఫ్యాక్స్ ద్వారా వివరించా. అందరూ సానుకూలంగా స్పందించారు. ఇక్కడి వాస్తవ పరిస్థితులను సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు స్వయంగా వివరిస్తా. గూడూరును నెల్లూరులో కలిపేందుకు కృషిచేస్తా. దీనిని రాజకీయం చేయొద్దు. గూడూరును తిరుపతిలో కలిపిన పాపం ఏవరిదో ప్రజలకు తెలుసు. నాకు రాజకీయ భవిష్యత్తు ఉన్నా.. లేకున్నా గూడూరు కోసం పోరాడుతూనే ఉంటా' అని ఎమ్మెల్యే చెప్పారు.

- కోట, ఆంధ్రజ్యోతి

లోకేశ్ మామా.. మా కష్టం చూడండి

'లోకేశ్ మామా.. బడికి పోవాలంటే మా కష్టం చూడండి. మా చదువులకు ఆటంకం రాకుండా అరుణా నది దాటేందుకు కేరళ తరహాలో కాలిబాట బ్రిడ్జి ఏర్పాటు చేయండి' అంటూ పిచ్చాటూరు మండలం రజానగరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు కోరారు. శుక్రవారం వారు అరుణానదిలో నీటి పాయను దాటుతూ ఫొటోతీసి సామాజిక మాధ్యమాల ద్వారా మంత్రి లోకేశ్‌కు తమ సమస్యను విన్నవించారు. ఈ మార్గం గుండా రామగిరి, అడవికండ్రిగ, కాలంజేరి గ్రామాలకు చెందిన సుమారు 70 మంది విద్యార్థులు బడికి వెళ్లాలంటే ఈ నదిని దాటాల్సిందే. వర్షాకాలం వాగు దాటాలి. ఎండాకాలం ఇసుకలో అడుగు పెట్టాలంటే బొబ్బలెక్కుతాయి. వీరి చదువు సాగాలన్నా.. అటువైపు గ్రామాల ప్రజలు జాతీయ రహదారిని చేరాలన్నా నదిని దాటాల్సిందే. ఒక్కోసారి అరణియార్ గేట్లు ఎత్తితే నీటి ప్రవాహ ఉధ్రుతి పెరిగి.. పది కిలోమీటర్ల మేర అదనంగా ప్రయాణించి పాఠశాలకు చేరుకోవాలి. ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యను కూటమి ప్రభుత్వమైనా పరిష్కరించాలని వారు కోరారు.

- పిచ్చాటూరు, ఆంధ్రజ్యోతి


పాఠశాల కోసం అరుణానదిలో నీటి పాయను దాటుతున్న విద్యార్థులు

పక్షుల పండుగకు వేళాయె!

తడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మరోసారి పక్షుల పండుగకు సమయం వచ్చేసింది. జనవరిలో ఈ పండుగ నిర్వహణకు అధికార యంత్రాంగం సంసిద్ధత వ్యక్తం చేస్తుంటే తమ బకాయిల మాటేంటంటూ మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. 2000వ సంవత్సరంలో మొదలైన ఈ పక్షుల పండుగ 2020 వరకు నిర్విరామంగా అధికార యంత్రాంగం నిర్వహించింది. మూడు రోజులపాటు నేలపట్టులో పక్షుల వీక్షణ, తడ మండలం భీములవారిపాళెంలో పడవ షికారు, సూళ్లూరుపేటలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు వేలాదిగా తరలివచ్చే పక్షుల ప్రేమికులతో ఆ మూడురోజులపాటు పండుగ వాతావరణం కనబడేది. 2020 వరకు ఈ పండుగ నిర్వహణ ఇలాగే జరిగింది. ఆ తర్వాత అప్పటి వైసీపీ ప్రభుత్వం పక్షుల పండుగను పక్కన పెట్టేసింది. తద్వారా అటు పర్యాటకులు, ఇటు పక్షుల ప్రేమికులు ఇంచుమించుగా దీనిని మరచిపోయారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పక్షుల పండుగ నిర్వహణకు ముందుకొచ్చింది. పర్యాటకులను ఆకర్షించాలనే ఉద్దేశ్యంతో 2025 జనవరిలో మూడు రోజులపాటు పక్షుల పండుగ నిర్వహించింది. ఈసారి జనవరి మొదట్లో ఈ పండుగను నిర్వహించేలా జిల్లా అధికారులు నిర్ణయించి ప్రభుత్వానికినివేదికలు పంపుతున్నట్లుగా తెలుస్తోంది. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో కలెక్టర్ వెంకటేశ్వర్ సమావేశమయ్యారు. ఇప్పటి నుంచి నిర్వహణ పనులు మొదలైతే తప్ప అప్పటికి పూర్తికావన్న ఉద్దేశ్యంతోనే చర్యలు తీసుకున్నట్లుగా సమాచారం.

మా బకాయిల మాటేంటి?

పక్షుల పండుగ నిర్వహణకు ఏర్పాట్ల దిశగా అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంటే.. మత్స్యకారులు మాత్రం తమ పడవ బకాయిల మాటేంటంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. 2020లో పక్షుల పండుగకు ఏర్పాటు చేసిన పడవలకు ఇప్పటికీ బకాయిలు చెల్లించలేదు. ఈ ఏడాది పక్షుల పండుగ సమయంలో పాత బకాయిలను చెల్లించేందుకు కృషి చేస్తామని చెబుతూనే ఈ దఫా బకాయిలు కూడా ఇంకా చెల్లించలేదు. నిధులు విడుదల కాలేదంటూ సదరు అధికారులు మత్స్యకారులకు సర్దిచెప్పి పంపుతున్నారు.

జనవరిలో ఫ్లెమింగో ఫెస్టివల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జనవరిలో ఫ్లెమింగో ఫెస్టివల్ నిర్వహించనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన జిల్లా పర్యాటక మండలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫ్లెమింగో ఫెస్టివల్‌కు సంబంధించి మైక్రో ప్లాన్ సిద్ధం చేయడం, తేదీలు ఖరారు చేయడం, కార్యక్రమాలు, పర్యాటక సదుపాయాలు, వేదికల ప్రణాళిక, పులికాట్, నేలపట్టు ప్రాంతాల్లో ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. ఫెస్టివల్ ప్రచారం కోసం ప్రమోషనల్ వీడియో లేదా టీజర్ రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూ క్యూరేటర్ సెల్వం, పర్యాటకశాఖ రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్‌రెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి తిరువీధి ఉత్సవం

తిరుచానూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారికి శుక్రవారం సాయంత్రం ఘనంగా తిరువీధి ఉత్సవం జరిగింది. అమ్మవారి ఉత్సవమూర్తికి మధ్యాహ్నం స్నపన తిరుమంజనం నిర్వహించారు. సర్వాలంకార శోభితురాలైన పద్మావతిదేవిని తిరుచ్చిపై కొలువుదీరి రాత్రి తిరుమాడవీధుల్లో ఊరేగించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణ, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, బాబుస్వామి, మణికంఠ స్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి యథావిధిగా ఆర్జిత సేవలు

పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల సందర్భంగా పదిరోజులుగా ఆలయంలో అన్ని ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. ఉత్సవాలు ముగిసిన నేపథ్యంలో శనివారం నుంచి యథావిధిగా ఆర్జిత సేవలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

నేడు ఎస్వీయూలో 'అన్వేషణ్'

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీలోని సెనేట్ హాలులో శనివారం ఉదయం 10 గంటలకు 'అన్వేషణ్-2025' కార్యక్రమం నిర్వహించనున్నారు. విద్యార్థులకు రీసెర్చ్ పేపర్, పోస్టర్, ఓరల్ ప్రెజెంటేషన్, ఇన్నోవేషన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ డీన్ మురళీధర్, కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ తెలిపారు.

సర్వ దర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం

హుండీ ఆదాయం: రూ.4.54 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 59,548

తలనీలాలు సమర్పించినవారు: 25,781

వెటర్నరీ వర్సిటీ పాలకమండలి ఎప్పటికో?

రెండేళ్లు గడుస్తున్నా నియామకం లేదు ● వీసీ నుంచి అధికారుల వరకు ఇన్‌చార్జులే

తిరుపతిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీవెటర్నరీ వర్సిటీలో రెండేళ్లుగా రెగ్యులర్ పాలకమండలి(ఈసీ)ని నియమించలేదు. గతవైసీపీ ప్రభుత్వ హయాంలో ఈసీసభ్యుల పదవీకాలం ముగిసినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. దీంతో 2023 అక్టోబరు నుంచి వర్సిటీకి పూర్తిస్థాయి పాలకమండలి లేదు. గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా డాక్టర్ పద్మనాభరెడ్డిని తిరిగి రెండోదఫా వీసీగా నియమిస్తూ ఉత్తర్వులు రావడంతో అప్పట్లో కొందరు ప్రొఫెసర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. యూజీసీ నియమ, నిబంధన ప్రకారం చట్టసవరణ(అమెండ్‌మెంట్) చేసి వీసీ నియామక నోటిఫికేషన్‌ని జారీ చేయాలని న్యాయస్థానం తీర్పునివ్వడంతో ఆయన నియామకానికి బ్రేక్‌పడింది. ఆ క్రమంలోనే 2023 డిసెంబరు నెలాఖరులో ఐసీఏఆర్‌కి చెందిన ఓ ఎక్స్‌అఫిషియో సభ్యుడు పదవీవిరమణ చేశారు. అప్పట్నుంచి వర్సిటీకి ఎక్స్‌అఫిషియో, పూర్తిస్థాయి పాలకమండలి(ఫుల్‌బోర్డు), రెగ్యులర్ వీసీని నియమించలేదు. గతనెల 28న వర్సిటీలో 253 టీచింగ్ ఖాళీ పోస్టుల (81బ్యాక్‌లాగ్ ఖాళీలతోపాటు) భర్తీకి అనుమతిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



వీటిని భర్తీ చేయాలంటే బోర్డు అనుమతి తీసుకోవాలి. అయితే వర్సిటీలో ఫుల్‌బోర్డు లేకపోవడం, న్యాయస్థానంలో పలు కేసులు పెండింగ్‌లో ఉండడంతో ఈ పోస్టులను భర్తీ చేస్తారా లేదా అన్న అయోమయంలో అధ్యాపకులున్నారు. ఈనేపథ్యంలో వర్సిటీకి కొత్తపాలకమండలి నియామకం ఎపుపడు ఉంటుందనేది చర్చగా మారింది.

అక్కడందరూ ఇన్‌చార్జులే

వర్సిటీలో వీసీ నుంచి యూనివర్సిటీ ఆఫీసర్ల వరకూ అందరూ ఇన్‌చార్జీలుగానే వ్యవహరిస్తున్నారు. 2024 జూలై 19 నుంచి ప్రొఫెసర్ జేవీరమణ ఇన్‌చార్జి వీసీగా ఉన్నారు. గతనెలలో ముగ్గురు రెగ్యులర్ యూనివర్సిటీ ఆఫీసర్ల మూడేళ్ల పదవీకాలం ముగిసింది. దీంతో ఇప్పుడు వీసీ, రిజిస్ట్రార్, వెటర్నరీసైన్స్ డీన్, డీఆర్, డీఈ, సీవోఈ, కంప్ట్రోలర్, డెయిరీడీన్ పోస్టులలో తాత్కాలికంగా ఇన్‌చార్జులే ఉన్నారు. దీంతో ఉద్యోగుల సర్వీస్‌మేటర్స్, ఫైనాన్షియల్ అప్రూవల్స్ వంటి సమస్యలతో ఉన్నతాధికారవర్గాలు సతమతమవుతున్నారు. నాన్‌టీచింగ్ ఉద్యోగుల, సీఏఎస్ అధ్యాపకుల పదోన్నతులు నిలిచిపోయాయి. రెండు కాన్వొకేషన్లు పెండింగ్‌లో ఉండడంతో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు ఒరిజనల్ డిగ్రీల కోసం ఎదురు చూస్తున్నారు. తాత్కాలిక ఇన్‌చార్జులైన అధికారులు నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితితో అజమాయిషీ, పర్యవేక్షణ కొరవడి వర్సిటీ పాలనగాడి తప్పుతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వందకు చేరిన కోర్టు కేసులు

వర్సిటీకి సంబంధించి వంద కోర్టు కేసుల వరకూ పెండింగ్‌లో ఉన్నాయని సమాచారం. వీటిలో పలువురు ఉద్యోగులు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కేసులే ఎక్కువగా ఉన్నాయని తెలిసింది. గత ప్రభుత్వ హయాం నుంచి ఇప్పటివరకు వర్సిటీ ఉన్నతాధికారవర్గాలు, ఉద్యోగుల మధ్య సమన్వయం లేక చిన్నాచితక సమస్యల పరిష్కారానికి కూడా ఉద్యోగులు, బాధితులు కోర్టులను ఆశ్రయిస్తున్నారు.

తిరుమలకు పూర్తిగా విద్యుత్ బస్సులు

దశలవారీగా డీజిల్, పెట్రోల్ ట్యాక్సీలు, టీటీడీ అద్దెవాహనాల రద్దు ● టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో పూర్తిగా విద్యుత్ వాహనాలనే వినియోగంలోకి తీసుకురావడానికి విస్తృత చర్యలు చేపట్టినట్టు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి భవనంలో శుక్రవారం కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ ప్రతినిధులు, ఆర్టీసీ, టీటీడీ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పవిత్రత, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని పాత డీజిల్, పెట్రోల్ వాహనాల వినియోగాన్ని క్రమంగా రద్దు చేయనున్నట్టు వివరించారు. తొలిగా తిరుపతి, తిరుమల మధ్య పూర్తిగా విద్యుత్ బస్సులు మాత్రమే నడిచే ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్టు తెలిపారు. తిరుమలలో నడిచే ట్యాక్సీలు, టీటీడీ అద్దె వాహనాల స్థానంలో విద్యుత్ వాహనాలను దశలవారీగా భర్తీ చేయనున్నట్టు చెప్పారు. త్వరలో జరుగనున్న టీటీడీ బోర్డు సమావేశంలో ఈ అంశంపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోనున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా కేంద్ర ప్రభుత్వ సీనియర్ కన్సల్టెంట్ ప్రతినిధి కునాల్ జోషి వివిధ అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమీక్షలో టీటీడీ డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు, వీజీవో సురేంద్ర, ఐటీ డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లు నాయుడు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి

లింగ వివక్షను రూపుమాపాలి



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ చైతన్యంతో ముందుకు వచ్చి లింగ వివక్షతను నిర్మూలించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రాత్రి అంతర్జాతీయ మహిళలపై హింసవ్యతిరేక దినం సందర్భంగా నయీ చేతన4.0 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నెలరోజులు జెండర్ సమానత్వ ప్రచారంనిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు శోభన్‌బాబు, సుశీలాదేవి, వసంతబాయి, శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ నారావారిపల్లె పెండింగ్‌పనులు పూర్తి చేయాలి

స్వర్ణనారావారిపల్లె అభివృద్ధికి సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రాత్రి స్పెషల్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారిణి సుశీలాదేవి తోపాటు ఇతర అధికారులతో ఆయన సమీక్షించారు. ప్రకృతి వ్యవసాయం, అనిమల్ హాస్టల్, సబ్‌స్టేషన్, రంగంపేట స్కూల్ నిర్మాణం, కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ తదితర అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేసుకోకుంటే కార్డుల రద్దు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంకా ఈకేవైసీ చేసుకోలేదా? అలాగైతే రేషన్ కార్డులు రద్దవుతాయి. ఈ నెలాఖరుకు గడువు ఉంది. జిల్లాలో 5,87,001 కార్డులున్నాయి. వీటిల్లో ఇప్పటి వరకు 70 వేల వరకు ఈకేవైసీ చేసుకోలేదని తెలిసింది. వీళ్లు ఏ మాత్రం ఈకేవైసీ చేసుకోకుంటే ఈనెలాఖరుకు రేషన్ కార్డులు రద్దయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఇక, రేషన్ సరుకులు పక్కదారి పట్టకుండా ఉండడానికి ఇప్పటికే క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ కార్డులు పంపిణీ చేసింది. ఇందులోనూ ఇప్పటి వరకు దాదాపు 61,203 కార్డులు సచివాలయ సిబ్బంది వద్దే ఉన్నట్లు సమాచారం.

బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేశాం



● జీఎం అమరేంద్ర రెడ్డి

తిరుపతి(సెంట్రల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టెలికం జిల్లా (ఉమ్మడి చిత్తూరు జిల్లా)లో గడిచిన నాలుగేళ్లలో వినియోగదారులకు ఇబ్బంది లేకుండా నెట్‌వర్క్‌ను బలోపేతం చేశామని బీఎస్ ఎన్‌ఎల్ జీఎం సి.అమరేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ జిల్లాలో ఫైబర్ నెట్‌వర్క్ వినియోగ దారులు 30 వేల మందికిపైగా ఉన్నారని తెలిపారు. వారి సేవలకు అంతరాయం లేకుండా నెట్‌వర్క్‌ను సరిదిద్దామని చెప్పారు. కార్యాలయాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచామన్నారు. వచ్చే ఏడాది మార్చిలోగా జిల్లాకు మరో 75 టవర్లు వస్తాయని చెప్పారు. దీంతో సెల్‌ఫోన్ల సేవలు మరింత మెరుగుపడతాయన్నారు. చిత్తూరు, మదనపల్లె, పలమనేరు, పీలేరు, పుత్తూరు, వాల్మీకిపురం, పాకాల నుంచి తిరుపతి టెలికం జిల్లా కేంద్రానికి 10జీ స్పెక్ట్రంను 100జీకి పెంచామన్నారు. దీంతో ఇంటర్నెట్ వాడకం 2200 టెరాబైట్ పెరిగిందన్నారు. జిల్లాలో బీఎస్ఎన్ఎల్ సేవలను విస్తరింపజేశామన్నారు.

విశాఖకు గూగుల్ పెద్ద గేమ్ ఛేంజర్

● ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



శ్రీకాంత్, గంటా శ్రీనివాసరావు, అశోక్ - జస్టిస్ ఏవీ శేషసాయి

తిరుమల, నవంబరు28(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంకు గూగుల్ సంస్థ రావడంతో పెద్ద గేమ్ ఛేంజర్‌గా మారబోతోందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సినీనటులు శ్రీకాంత్, అశోక్‌తో కలిసి శుక్రవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, గతంలో మైక్రోసాఫ్ట్ సంస్థ హైదరాబాద్‌కు వచ్చినప్పుడు అద్భుతమైన మార్పులు జరిగాయని గుర్తు చేశారు. సైబరాబాద్ వంటి నగరం ఏర్పాటు కావడంలో మైక్రోసాఫ్ట్ కీలకంగా వ్యవహరించిందన్నారు. ఇదే తరహాలో గూగుల్ రాకతో విశాఖపట్నం కూడా ప్రపంచగుర్తింపు నగరంగా అభివృద్ధి చెందబోతోందన్నారు. రిలయన్స్, టీసీఎస్ వంటి అనేక సంస్థలు విశాఖవైపు చూస్తున్నాయన్నారు. కాగా, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

జీఎస్టీ ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలి

మెడికల్ డీలర్లను ఆదేశించిన జీఎస్టీ సంయుక్త కమిషనర్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, మెడికల్స్‌పై ప్రభుత్వం జీఎస్టీ 2.0 తగ్గించిన ప్రయోజనాన్ని వినియోగదారులకుతప్పనిసరిగా అందించాలని చిత్తూరు డివిజన్ రాష్ట్ర పన్నుల సంయుక్త కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి వ్యాపారులకు స్పష్టం చేవారు. శుక్రవారం ఆయన డ్రగ్స్, మెడికల్ ఏజెన్సీల హోల్‌సేల్ డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు, రీటైలర్లతో తిరుపతి కమర్షియల్‌టాక్స్ కాంప్లెక్స్‌లో సమావేశమయ్యారు. జీఎస్టీ అమలు ప్రక్రియలో వినియోగదారులకు అందాల్సిన ప్రయోజనాలను అందజేయకుంటే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొత్త జీఎస్టీ రేట్ల అమలుపట్ల ప్రతి డీలర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కంపోజిషన్ పన్ను చెల్లింపుదారులు రెగ్యులర్ కేటగిరీకి మార్చాల్సిన అవసరం, ప్రొఫెషన్ టాక్స్ చెల్లింపు తప్పనిసరి అని, రిజిస్ట్రేషన్లు పూర్తిచేయాలని, రిటర్న్‌లను సమయానికి దాఖలు చేయాలని సూచించారు. సమావేశంలో ఏపీ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరత్న, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుబ్బరామగుప్త, ప్రతినిధులు నరసింహారెడ్డి, కుమార్, శశి, శివ తదితరులు పాల్గొన్నారు.

కాసులిస్తే కానీ కదలని తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు!

ఉచితం మాటున డ్రైవర్ల చేతివాటం ● ప్రసూతి ఆస్పత్రిలో బాలింతల అవస్థలు

● పిచ్చాటూరుకు చెందిన ధనలక్ష్మి మూడు రోజుల కిందట ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో కాన్పు చేయించుకున్నారు. శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. ఇంటికి వెళ్లేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాన్ని అడగ్గా రూ.3 వేల వరకు డిమాండ్ చేశారు. చివరకు రూ.2 వేలకు బేరం కుదుర్చుకుని వెళ్లారు.

● రైల్వేకోడూరుకు చెందిన రేణుక శుక్రవారం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం కోసం డ్రైవర్‌ను సంప్రదించారు. మీది వేరే జిల్లా వస్తుందని అక్కడ వరకు ఉచితంగా రావడం కుదరదని చెప్పారు. ప్రైవేటు వాహనంలో వెళ్లాలంటే కనీసం రూ. 8 వేలు అడగతారని, రూ.4 వేలు చెల్లిస్తే విడిచిపెడతామని చెప్పడంతో చివరకు రూ.3 వేలకు బేరం కుదుర్చుకొన్నారు.

..ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పుల తర్వాత క్షేమంగా ఇంటికి చేర్చేలా ప్రభుత్వం తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. జిల్లా వ్యాప్తంగా 29 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను ప్రభుత్వం అందించింది. వీటిల్లో 19 తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి కేటాయించారు. ప్రసూతి ఆస్పత్రిలో సగటున రోజుకు 20 మందికి పైగా డిశ్చార్జి అవుతుంటారు. వీరిని ఉచితంగా ఇంటి వద్ద విడిచిపెట్టేందుకు అందుబాటులో ఉన్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్లు ముందుగానే బేరాలు కుదుర్చుకుంటున్నారు. ఈ వాహనాలు ఉచితంగా కదా అని ఎవరైనా అడిగితే వాహనాలు మాత్రమే ఉచితమని పెట్రోలు, వాహన శుభ్రత, టోల్‌గేట్లు ఇలా చెల్లించాలని చెప్పి ముందుగానే నగదు వసూళ్లు చేస్తున్నారు. అంత ఇచ్చుకోలేని వారు ఆటోలను, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు షెడ్డులోఉన్నా బేరం కుదరకుంటే తీయడం లేదన్న విమర్శలున్నాయి. దీంతో ప్రవేటు వాహనాల్లో ఇళ్లకు వెళుతున్నారు. తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు పూర్తిగా ఉచితమని, ఎవరైనా డబ్బు అడిగితే ఫిర్యాదు చేయాలని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ చెప్పారు. ఎవరైనా ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామన్నారు.



ఆటోలో వెళుతున్న బాలింతలు.. షెడ్డులో ఉన్న తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

వేర్వేరు ప్రాంతాల మధ్య 41 ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి):ప్రయాణికుల డిమాండ్ మేరకు 41 ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. డిసెంబర్ 1నుంచి మార్చి 30 వరకు (సోమ)చర్లపల్లి-షాలిమార్(07225) 18 ట్రిప్పులు, డిసెంబర్ 2నుంచి మార్చి31 వరకు(మంగళ) షాలిమార్-చర్లపల్లి(07226) 18 ట్రిప్పులు,డిసెంబర్ 2 నుంచి 9వరకు(మంగళ) రామేశ్వరం-తిరుపతి(06080) 2ట్రిప్పులు. డిసెంబర్3నుంచి 10వరకు (బుధ) తిరుపతి - రామేశ్వరం (06079) 2ట్రిప్పులు, నవంబర్29 శనివారం చప్రా-ఎంజీఆర్ చెన్నై (05081) మధ్య ప్రత్యేక రైలు నడుస్తుందని తెలిపారు.

భానుప్రకాష్‌రెడ్డికి భారత్ గౌరవ్ అవార్డు



తిరుపతి(విద్య), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి భారత్ గౌరవ్ అవార్డు లభించింది. ధార్మిక, సమాజ సేవా కార్యక్రమాలు చేసిన వారికి భారత్ గౌరవ్ సంస్థ అవార్డులను ప్రదానం చేస్తుంది. ఈ క్రమంలో 2025వ సంవత్సరానికి భానుప్రకాష్‌రెడ్డిని ఎంపిక చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, చిన్న జీయర్ స్వామి చేతులమీదుగా ఆయన అవార్డును అందుకున్నారు.

అక్రిడిటేషన్ కార్డుల గడువు పొడిగింపు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును మరో రెండు నెలలు పొడిగిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్డుల గడువు ఆదివారంతో ముగుస్తుందన్నారు.

కుటుంబ కలహాలతోనే

తిరుమలలో ఆత్మహత్యాయత్నం

● పరిస్థితి విషమం



గణేష్

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం ఆత్మహత్యకు యత్నించిన గణేశ్ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. ఆర్బీ సెంటర్ వద్ద బటన్ కట్టర్‌తో పొట్ట, గొంతు కోసుకుని, కడుపులోని పేగులను సైతం బయటకు లాగి ముక్కలు చేసి కుప్పకూలిపోయాడు. స్విమ్స్‌లో శుక్రవారం ఉదయం స్పృహలోకి వచ్చాడు. చెన్నైకి చెందిన గణేశ్ భార్య ఇందిరకు పోలీసులు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకున్నారు. కుటుంబ కలహాలతో గణేశ్ 15 రోజుల క్రితం ఇంటి నుంచి వచ్చేశాడు. మానసిక పరిస్థితి కూడా బాగాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఓజిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ గూడూరు కోర్టు న్యాయమూర్తి కె.నాగపవన్ తీర్పు ఇచ్చారు. ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు.... నెల్లూరు జిల్లా రాపూరు మండలం వేపినాపి గ్రామానికి చెందిన మోడిబోయిన వెంకటేశ్వర్లు మద్యానికి బానిసై తరచుగా భార్యను కొడుతుండేవాడు. దీంతో ఆమె తన పిల్లలతో కలిసి ఐదేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి ఓజిలి మండలం కారూరులో తన తాత ఇసుగుంట శ్రీనివాసులు వద్ద ఉంటోంది. వెంకటేశ్వర్లు తరచూ కారూరుకు వెళ్లి భార్య పిల్లలను పంపమని శ్రీనివాసులతో గొడవపడుతుండేవాడు. ఎంతకీ తన భార్యపిల్లలను పంపకపోవడంతో శ్రీనివాసులును హత్య చేసేందుకు వెంకటేశ్వర్లు పథకం పన్నాడు. 2019 జూన్ 24వ తేదీ రాత్రి 7:30 గంటల సమయంలో కారూరులో ఇంటి బయట నిద్రపోతున్న శ్రీనివాసులును గొడ్డలితో మెడమీద నరికి చంపేశాడు. అప్పటి సీఐ నరసింహారావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కోర్టులో నేరం రుజువుకావడంతో నిందితుడు వెంకటేశ్వర్లుకు జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుందరయ్య యాదవ్ కేసు వాదించారు. నిందితుడికి శిక్ష పడటానికి కృషి చేసిన నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఓజిలి ఎస్ఐ శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ మల్లిఖార్జున్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులును జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

సైకిల్‌కు పంక్చర్ వేయలేదని దాడి

● ఒకరి మృతి, మరొకరికి గాయాలు

తడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సైకిల్‌కు పంక్చర్ వేయలేదని దాడి చేయడంతో ఒకరు మృతి చెందగా, మరొక వ్యక్తికి గాయాలయ్యాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన సహమద్ ఆలీ తడ మండలం చేనిగుంటలో కోగిలి రామయ్యకు చెందిన ఖాళీ స్థలంలో పంక్చర్ షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. గురువారం చేనిగుంట దళితవాడకు చెందిన మీజూరు ప్రతాప్ సైకిల్ తీసుకువచ్చి పంక్చర్ వేయాలని కోరాడు. సైకిళ్లకు పంక్చర్ వేయలేనని సహమద్ ఆలీ చెప్పినా వినకుండా గొడవకు దిగాడు. అదే సమయంలో అక్కడకు వచ్చిన స్థల యజమాని రామయ్య సర్దిచెప్పడానికి యత్నించాడు. ఆగ్రహించిన ప్రతాప్ రాయితో సహమద్ ఆలీ, రామయ్యపై దాడిచేసి గాయపరిచాడు. స్థానికులు క్షతగాత్రులను నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సహమద్‌ఆలీ(47) శుక్రవారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఎర్ర' స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.6లక్షల జరిమానా విధిస్తూ జిల్లా ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. టాస్క్‌ఫోర్సు అదనపు ఎస్పీ కులశేఖర్ తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం విల్లిపురానికి చెందిన ముట్టియన్ ఆండీ 2019లో నాగపట్ల ఈస్ట్ బీట్ చామలరేంజ్ పరిధిలో ఎర్రచందనం దుంగలు స్మగ్లింగ్ చేస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అప్పట్లో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చి విచారణకు హాజరవుతున్నాడు. ఇదే కేసును ఇటీవల తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక కోర్టుకు మార్చడంతో విచారణ మొదలైంది. ఇరు వర్గాల వాదనలు విన్నాక నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.6లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రభుత్వం తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమరనారాయణ, కోర్టు లైజన్ అధికారి, కోర్టు కానిస్టేబుల్ కలిసి సాక్ష్యాధారాలను పటిష్ఠంగా హాజరు పరచి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేశారు.

గూడూరును జిల్లాగా ప్రకటించే వరకు ఉద్యమం



పోస్టుకార్డుల ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న గూడూరు ప్రజాసమితి సభ్యులు

గూడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించే వరకు ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని గూడూరు ప్రజా సమితి నాయకుడు కోడూరు మీరారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక డివిజన్ పోస్టాఫీసు వద్ద పోస్టుకార్డుల ఉద్యమాన్ని ప్రారంభించారు. ముఖ్య మంత్రి చిరునామాకు పోస్టుకార్డులను పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించేందుకు అవసరమైన అన్ని వసతులు ఉన్నాయన్నారు. నెల్లూరు జిల్లాలో ఉన్న గూడూరును తిరుపతిలో విలీనం చేయడంతో జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికలకు ముందు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ గూడూరు పర్యటనకు వచ్చిన సమయంలో నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లాల పునర్విభజన ప్రక్రియలో తీసుకున్న నిర్ణయంతో గూడూరు నియోజకవర్గ ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గూడూరును జిల్లాగా ప్రకటించాలని, లేని పక్షంలో ఇచ్చిన హామీ మేరకు నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి గూడూరు ప్రజల మనోభావాలను తెలియజేసేందుకు చేపట్టిన పోస్టుకార్డుల ఉద్యమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సురేంద్రనాథ్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, చంద్రశేఖరయ్య, ఆనిమెళ్ల శివప్రసాద్, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంగనపల్లిలో నవోదయ విద్యాలయం

ఆర్డీవో స్థల పరిశీలన



సంగనపల్లిలో నవోదయ విద్యాలయం కోసం కేటాయించిన స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి

డక్కిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలోని సంగనపల్లి గ్రామంలో నవోదయ విద్యాలయం ఏర్పాటుకు కేటాయించిన స్థలాన్ని గూడూరు ఇన్‌చార్జి ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. సంగనపల్లి వద్ద సర్వే నంబరు 148-1లో ఉన్న 24 ఎకరాల ప్రభుత్వ భూమిని నవోదయ పాఠశాలకు కేటాయించారు. ఈ ప్రాంతానికి రోడ్డు రవాణ, విద్యుత్, తాగునీటి సౌకర్యం వంటి అంశాలను పరిగణలోకి తీసుకోని భూ కేటాయింపు జరిపారు. త్వరలోనే నవోదయ విద్యాలయ భవన నిర్మాణ పనులకు టెండర్లు పక్రియ మొదలు కానుంది. ఈ నేపథ్యంలో ఆర్డీవో భానుప్రకాష్ రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీనివాసులు, మండల సర్వేయర్ పెంచలయ్య, వీఆర్వో నరేష్ ఉన్నారు.

సమస్యలను పరిష్కరించండి



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్, అధికారులు

కోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. మండలంలోని 21 పంచాయతీల నుంచి ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కు అర్జీలు అందజేశారు. కొన్ని సమస్యలను ఎమ్మెల్యే అక్కడిక్కడే పరిష్కరించగా, కొన్ని అర్జీలను అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంజమ్మ, ఏఎంసీ చైర్మన్ ప్రమీల, సర్పంచ్ వెంకటరమణమ్మ, తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్, టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్, టీడీపీ నాయకులు మోహన్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, కోటేశ్వరప్రసాద్, మధుయాదవ్, సుహాసిని, పోలమ్మ, మస్తాన్ బాషా, షంషుద్దీన్, చిల్లకూరు దశరధరామిరెడ్డి, చాపల శ్రీనివాసులు, నాగూరయ్య, ఏవో సుచేంద్రప్రసాద్, నారాయణ పాల్గొన్నారు.

తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెరైన్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి

చిల్లకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెరైన్ సీఐ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వరగలి జడ్పీ ఉన్నత పాఠశాలలో తీరప్రాంత గ్రామాల ప్రజలకు వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మత్స్యకార సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. వర్షాల సమయంలో తీరప్రాంతాల్లోని మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలన్నారు. బోట్లు రిజిస్ట్రేషన్లు చేయించుకోవడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకో వాలన్నారు. సముద్రంలోకి కొత్తపడవలు ప్రవేశించినా, తీరప్రాంతాల్లో ఎవరైనా కొత్తవారు సంచరిస్తున్నా తమకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మెరైన్ ఎస్‌ఐ శివసౌమ్య, ఎఫ్‌డీవో శ్రీనివాసులు, వీఆర్‌వోలు ఉదయ్‌కుమార్, రామచంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, సుమతి, రవికుమార్, మాధవి, కోటేశ్వరరావు, మల్లికార్జున్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల ఆరాధ్య దైవం పూలే



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ తదితరులు

నాయుడుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సామాజికంగా, ఆర్థికంగా అణగారిన ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేసిన బహుజనుల ఆరాధ్య దైవమని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద పూలే విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల, మహిళల అభివృద్ధి కోసం పూలే ఎంతో కృషిచేశారని కొనియాడారు. ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే కృషి కారణంగా నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణించగలుగుతున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు రఫీ, కందల కృష్ణారెడ్డి, అవధానం సుధీర్, సూరీ, సుబ్బారావు, రమణారెడ్డి, జువ్వలపాటి మస్తాన్, సాయి, సుబ్బారావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు జ్యోతిరావు పూలే

గూడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జ్యోతిరావుపూలే ఆదర్శనీయుడని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం పూలే వర్ధంతి సందర్భంగా స్థానిక కారుస్టాండు సమీపంలోని పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించి, మహిళా విద్యకు కృషి చేసిన మార్గదర్శి జ్యోతిరావుపూలే అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, శివకుమార్, బీవీరమణయ్య, ఎల్‌వీ సుబ్బయ్య, వేమయ్య, వెంకటేశ్వర్లురాజు, శ్రీనివాసులు, రమేష్‌బాబు, భాస్కర్, వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో నారాయణరెడ్డి, ఏపీఎం పద్మ, వెలుగు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది రవికుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రేణిగుంట - కడప రహదారిలోని అంజనేయపురం చెక్‌పోస్టు వద్ద శుక్రవారం తిరుపతి అటవీశాఖ అధికారులు 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఓ కారును సీజ్ చేశారు. డ్రైవర్ పారిపోయాడు. ఈ తనిఖీల్లో డీఆర్వో ఆర్ఎస్ చైతన్య, ఎఫ్‌బీవో వెంకటేశ్వరరావు, కరకంబాడీ బీట్ ప్రొటెక్షన్ వాచర్లు సిసింద్రీ, ప్రసాద్, వెంకటేష్, నవీన్ పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడికి ఏడాది జైలు

గూడూరు అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసుల్లో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శుక్రవారం తీర్పునిచ్చారు. రూరల్ పోలీసుల వివరాల మేరకు... మండలంలోని గిరిశాస్త్రులవారి కండ్రిగ గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్ గొల్లపల్లి గ్రామంలోని మల్లికార్జున్ ఇంటితో పాటు పలు ఇళ్లల్లో చోరీకి పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. మనోజ్‌కుమార్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. గూడూరు కోర్టులో నిందితుడు నేరాన్ని అంగీకరించడంతో ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: విజయశ్రీ



ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, అధికారులు

నాయుడుపేట టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యల అర్జీలను స్వీకరించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవడానికి మండలాల్లో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ సేవలు చేరవేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటాన్నామని అన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి రాష్ట్రంలో రైతాంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, తహసీల్దారు రాజేంద్ర, ఎంపీడీవో సురేష్‌బాబు, వ్యవసాయశాఖ ఏడీ నాగార్జునసాగర్, ఏవో గణేష్, టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు కందలకృష్ణారెడ్డి, రఫీ, కట్టారమణారెడ్డి, నిత్యకృష్ణారెడ్డి, చెంగయ్య, చక్రపాణి, చెంచయ్య, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

నెల్లూరు జిల్లాలో గూడూరును విలీనం చేయాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏఎస్ఎఫ్ నాయకులు

గూడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో గూడూరును విలీనం చేయాలని అంబేడ్కర్ స్టూడెంట్స్ ఫెడరేషన్ నాయకుడు షఫీహరన్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరును తిరుపతి జిల్లాలో కలపడంతో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వ్యయప్రయాసలకు గురవ్వాల్సి వస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చి విస్మరించడం సబబు కాదన్నారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, ఎల్‌వీ సుబ్బయ్య, వెంకటేశ్వర్లురాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి చర్యలు

తడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని నిర్మిస్తామని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శుక్రవారం తడకు చెందిన మాజీ ఎంపీటీసీ షోడవరం యల్లయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబసభ్యులను ఎమ్మెల్యే విజయశ్రీ పరామర్శించారు. అనంతరం పూడి గ్రామంలో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 40 యేళ్లుగా రోడ్డులేని పరిస్థితిని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్‌నాయక్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, నాయకులు సెల్వం, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, డ్వాక్రా సంఘాల లీడర్లు, సభ్యులు

పెళ్లకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంపీడీవో ప్రమీలారాణి అన్నారు. పెళ్లకూరు స్త్రీశక్తి భవన్‌లో థీమ్-5 క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంపై డ్వాక్రా సంఘాల లీడర్లు, సభ్యులకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పరిసరాల శుభ్రతపై ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సమ్మన శ్రీహరి, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయండి

పెళ్లకూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పునబాక, చెంబేడు గ్రామాల మధ్య ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డును బాగు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి పునబాక, చెంబేడు గ్రామాలకు చెందిన జనసేన నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నాయుడుపేటలో జరిగిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. పరిశ్రమలు, క్వారీలకు రాకపోకలు సాగించే వాహనాల కారణంగా రోడ్డు ధ్వంసమైందని, మరమ్మతులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు మల్లాం విజయ్, నాయకులు తాళ్ల రెడ్డిశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శుక్రవారం గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని సాకీయా పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశామని కరస్పాండెంట్ శివకుమార్ తెలిపారు. కార్యక్రమంలో కల్యాణి, సుప్రజ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



దేవసేనకు నగదును అందజేస్తున్న టీడీపీ నాయకులు

కోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి పంచాయతీలో ఇద్దరికి ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సూచన మేరకు టీడీపీ నాయకులు ఆర్థిక సాయం చేశారు. గూడలి అరుంధతీయవాడకు చెందిన తాళ్లూరు దేవసేన ఇల్లు కాలిపోవడంతో ఆయనకు రూ.5వేలు, ప్రకాశంకాలనీకి చెందిన మహేష్ గుండె శస్త్రచికిత్స చేయించుకోవడంతో ఆయనకు రూ.5వేలు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పల్లెమల్లు వెంకటకృష్ణారెడ్డి, బందిలి రఘురామయ్య, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం

ఓజిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. ఓజిలి మండలం ఆరిమేనిపాడులో కుందాం సొసైటీ అధ్యక్షుడు పురుషోత్తంరాజు అధ్వర్యంలో శుక్రవారం జరిగిన రైతన్నా - మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రైతులతో మాట్లాడారు. ఆరిమేనిపాడు చుట్టుపక్కల ప్రాంతాల్లో నిమ్మ సాగు, ఎదురౌతున్న సమస్యలు, ధరల గురించి రైతులు విజయశ్రీకి వివరించారు. రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీఏ గోపీనాయక్, ఏవో వరప్రసాద్, నాయుడుపేట ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, ఓజిలి మండల టీడీపీ కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్‌నాయుడు, బీసీ, మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు పాడి వెంకటసుబ్బయ్య, ఎస్‌కే ఖలీల్, ఏఎంసీ డైరెక్టర్లు రవీంద్రారెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గూడూరును జిల్లా కేంద్రం చేయాలి



రెవెన్యూ ఉద్యోగుల తరపున ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న తహసీల్దారు జయజయరావు

కోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, అలా కానిపక్షంలో నెల్లూరులో కలపాలని కోరుతూ ప్రభుత్వ, ప్రైవేట్, ఉద్యోగులు, అసోషియేషన్లు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. మొదట కోట మండల రెవెన్యూ ఉద్యోగుల తరపున తహసీల్దారు జయజయరావు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అనంతరం యూటీఎఫ్, బీటీఏ, ఐసీడీఎస్, అంగన్‌వాడీ వర్కర్స్, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల యాజమాన్యాలు, వెలుగు, ఇరిగేషన్, ట్రాన్స్‌కో ఉద్యోగులు వినతిపత్రాలు అందజేశారు. ఆయా వినతులను ముఖ్యమంత్రికి పంపుతానని ఎమ్మెల్యే తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిత

నాయుడుపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం విజయవాడలోని శాసనసభలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులతో స్టూడెంట్ అసెంబ్లీ నిర్వహించింది. ఇందులో సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ వేషధారణలో నాయుడుపేట పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థిని కావలి పల్లవి మాట్లాడారు. అసెంబ్లీలో చక్కగా, క్రమశిక్షణతో మాట్లాడిన పల్లవికి ఎమ్మెల్యే విజయశ్రీ ఎమ్మెల్యే ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో మునిరత్నం, ప్రధానోపాధ్యాయుడు మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన జీవనోపాధులే లక్ష్యం

ఓజిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మెరుగైన జీవనోపాధులతో పాటు పారిశుధ్యం, పచ్చదనం వికసించేలా థీమ్-5 కింద క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఎంపీడీవో నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంలో భాగంగా కార్యదర్శులు, వెలుగు, అంగన్వాడీ, ఆశా వర్కర్లతో పాటు పలువురు సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏపీఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో జ్యోతికిరణ్, పక్కన ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారి చైతన్య

సూళ్లూరుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీడీపీవో జ్యోతికిరణ్ అన్నారు. సూళ్లూరుపేట జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మన్నారు పోలూరు ప్రాథమిక పాఠశాలలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ అధికారి చైతన్య, ప్రిన్సిపాల్ శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకుడి మృతి



రాజా(ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ వి.రాజా గుండెపోటుతో మృతి చెందారు. కళాశాలలో ఆయన చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ విక్టోరియా రాణి, అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు.

ఆలయ భూములను కాపాడండి

తిరుపతి(జీవకోన), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నాగలాపురంలోని వేదనారాయణ స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి అధ్యక్షుడు కిరణ్ కుమార్, హిందూ చైతన్య వేదిక అధ్యక్షుడు కుమారస్వామి కోరారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ టీటీడీకి చెందిన ఆలయ భూములను స్థానిక వీఆర్వో నాగభూషణం తప్పుడు పత్రాలు సృష్టించి ఇతరులకు కట్టబెడుతున్నాడని ఆరోపించారు. గుడిమాన్యాన్ని ఆక్రమించుకుంటున్నా పట్టించుకోవడం లేదన్నారు.

సముద్రతీరంలో పునిత్ సాగర్ అభియాన్



సముద్రతీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తగలబెడుతున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

కోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోట మండలం శ్రీనివాససత్రం సముద్రతీరంలో శుక్రవారం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో పునిత్ సాగర్ అభియాన్ కార్యక్రమం జరిగింది. ఎన్‌సీసీ క్యాడెట్లు చీపురులు చేతబట్టి సముద్రతీరాన్ని శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగలబెట్టారు. మత్స్యకారులకు, గ్రామస్తులకు నీటి వనరుల సంరక్షణ, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నావెల్ యూనిట్ కామాండెంట్ గణేష్ గోడంగావే, సబ్ లెఫ్టినెంట్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

ఆల్తూరుపాడు రిజర్వాయరును పూర్తి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి

వెంకటగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండల పరిధిలోని ఆల్తూరుపాడు రిజర్వాయరును తక్షణమే పూర్తిచేసి రైతులకు సాగు, తాగునీటి అవసరాలు తీర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం పూర్తయితే డక్కిలి, వెంకటగిరి, ఏర్పేడు మండలాలతో పాటు తిరుపతి పట్టణ ప్రజలకు తాగునీటి అవసరాలు తీరుతాయని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాజశేఖర్, వెంకటరమణ, పెంచలయ్య, రాధాకృష్ణ, బాలకృష్ణ, జాన్, నరసింహులు, శివకుమార్, మునిక్రిష్ణారెడ్డి, మునీంద్ర, సాయి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్

వాకాడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ అన్నారు. శుక్రవారం వాకాడు ఎస్టీ బంగ్లాకాలనీ వద్ద సివిల్ రైట్స్ డే నిర్వహించారు. చట్టాలపై అవగాహన కల్పించారు. బంగ్లాకాలనీవాసులు మాట్లాడుతూ డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ అఖిల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి, ఎంఈవో నసీంఆలీ పాల్గొన్నారు.

పెళ్లకూరులో...



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హెచ్ఎం స్వర్ణలత

పెళ్లకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బాలల హక్కులు, చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిప్రియ అన్నారు. శుక్రవారం పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల హక్కులు, బాల్య వివాహ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం వల్ల విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా మంచి శారీర దారుఢ్యంతో ఎదుగుతారని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు ఎం.సుజిని, పి.గౌరీప్రియ, ఎం.పుష్పకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత పాల్గొన్నారు.